సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 29, సంచిక: 14 | శుక్రవారం | 03-07-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00



భారత్ – జపాన్ సంబంధాలకు కొత్త ఊపు
ఎఐ సృష్టించిన నకిలీ తీర్పులు.. న్యాయ వ్యవస్థకు ప్రమాదకరం
ఉద్యమం మరింత ఉధృతికి.. 'కాక్‌రోచ్‌లతో చాయ్ పే చర్చ' షురూ 07


### అయోధ్య రామాలయం విరాళాలపై

# కాగ్ ఆడిట్

భక్తుల కానుకల నిర్వహణకు సంబంధించిన ఆరోపణలపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలి

ప్రధాన మంత్రికి సిపిఐ రాజ్యసభ పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ లేఖ



**న్యూఢిల్లీ :** శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రారంభమైనప్పటి నుంచి అందిన నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులతో సహా ప్రతి విరాళంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేత సమగ్ర ఆడిట్ చేయించి, ఆ నివేదికను దేశం ఎదుట ఉంచాలని ప్రధాన మంత్రిని సిపిఐ రాజ్యసభ పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి గురువారం నాడు ఆయన లేఖ రాశారు. అయోధ్య రామాలయం, దాని నిర్మాణం, భక్తుల కానుకల నిర్వహణకు సంబంధించిన ఆరోపణలపై జరుగుతున్న అన్ని నేరపూరిత కార్యకలాపాలపై స్వతంత్ర న్యాయ విచారణను ఏర్పాటు చేయాలని ఎంపి సందోష్ కుమార్ కోరారు. ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి, బిజెపి లేదా మరే ఇతర సంస్థతో సంబంధం ఉన్నా లేకపోయినా, దోషిగా తేలిన ప్రతి ఒక్కరిని వారి హోదాతో సంబంధం లేకుండా న్యాయస్థానం ఎదుట నిలబెట్టేలా చూడాలని అన్నారు. లక్షలాది మంది భక్తులు తమ ప్రార్థనలను, ఆశలను, జీవితకాలపు పొదుపును శ్రీరాముడి కోసం అందించారే తప్ప సంఘ్ పరివార్‌కు కాదని ఆయన విమర్శించారు. బిజెపి అగ్ర నేత అటల్ బిహారీ వాజ్‌పాయ్‌కు 1989 సెప్టెంబర్‌లో సిపిఐ పార్లమెంట్ సభ్యుడు కామ్రేడ్ హిరేన్ ముఖర్జీ లేఖ రాస్తూ లక్షలాది మంది ప్రజల విశ్వాసాన్ని రాజకీయం చేయవద్దని, బాబ్రీ మసీదుకు వ్యతిరేకంగా సంఘ్ పరివార్ చేస్తున్న ప్రచారాన్ని విరమించుకునేలా వారిని ఒప్పించాలని కోరారు. అందుకు బదులుగా వాజ్‌పాయ్ 'ప్రియమైన హిరేన్‌దా.. మసీదును కూల్చివేయాలని నేను ఎన్నడూ చెప్ప లేదు, అలాగే

తరువాయి 12లో

### మూసీ ప్రక్షాళన

# మొదటి దశకు ఆమోదం

## రూ.7,345 కోట్ల పనులకు కేబినేట్ మంజూరు





- పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ఉచిత అల్పాహారం, భోజనం, పాలు సరఫరా
- 'విబి-జి రామ్ జి' ఉపాధి హామీ చట్టంపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయం
- టిమ్స్ ఆసుపత్రుల్లో 6,278 పోస్టులు మంజూరు
- సమావేశం నిర్ణయాలను మంత్రులు అడ్లూరి, సీతక్కతో కలిసి మంత్రి పొంగులేటి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'విబి– జి రామ్ జి' ఉపాధి హామీ చట్టంపై సుప్రీంకోర్ట్‌లో న్యాయపరంగా పోరాటం చేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. కేంద్ర ప్రభుత్వ ఒంటెద్దు పోకడలతో అమలులోకి తీసుకొచ్చిన 'విబి జీ రామ్ జీ చట్టాన్ని' అనివార్యంగా, గత్యంతరం లేని పరిస్థితిలో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించే ఆలోచనతో తెలంగాణ రాష్ట్రంలో జులై 1వ తేదీ నుంచి అమలు చేసేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ఉచిత అల్పాహారం, భోజనం, పాలు సరఫరా చేయాలని నిర్ణయించింది. మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం జరిగింది. సమావేశంలో ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలులోనికి తీసుకొచ్చిన జివి రాంజీ చట్టంలో

తరువాయి 8లో



### కాంగ్రెస్, బిఆర్‌ఎస్ సవాల్.. ప్రతి సవాల్

# కొనసాగిన హైడ్రామా

- గన్‌పార్క్ వద్ద ఎదురుచూసిన మంత్రులు పొన్నం, అడ్లూరి, అజారుద్దీన్
- తెలంగాణ భవన్ వద్ద హరీశ్‌రావు సహా పలువురు అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో గురుకుల పాఠశాలల టెండర్ల అంశంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ పార్టీల మధ్య రాజకీయ యుద్ధం తీవ్రరూపం దాల్చింది. ఇరు పార్టీల నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లతో హైదరాబాద్‌లో గురువారం తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. మంత్రుల సవాల్ బిఆర్‌ఎస్ నేతల ప్రతిసవాల్‌తో ఒక వైపు గన్‌పార్క్ వద్ద, మరోవైపు బిఆర్‌ఎస్ కార్యాలయం వద్ద హైడ్రామా కొనసాగింది. ప్రతిపక్ష బిఆర్‌ఎస్ నేతల సవాల్‌తో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహ్మద్ అజాహరుద్దీన్ గురుకుల టెండర్లపై చర్చకు సిద్ధంగా ఉన్నామంటూ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ (అమరవీరుల స్థూపం) వద్దకు చేరుకుని బిఆర్‌ఎస్ నేతల కోసం నిరీక్షించారు. మరోవైపు కాంగ్రెస్ మంత్రులు చేసిన సవాల్‌ను స్వీకరిస్తూ తెలంగాణ భవన్ నుండి గన్ పార్క్‌కు మాజీ మంత్రి టి.హరీష్ రావు, ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, తదితర బిఆర్‌ఎస్ నేతలు బయలుదేరగా పోలీసులు దారిలోనే అడ్డుకుని, ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**గురుకుల టెండర్లలో అవినీతి అవాస్తవం : మంత్రి పొన్నం ప్రభాకర్**

గురుకులాల పాఠశాలలలో కొనుగోళ్లలో అవినీతి ఆరోపణలను మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమారు తీవ్రంగా ఖండించారు. గన్‌పార్క్ వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మొత్తం రూ.643 కోట్ల టెండర్లలో సుమారు రూ.500 కోట్ల పనులు టెస్కో, లిడ్ క్యాప్ వంటి ప్రభుత్వ సంస్థలకు ఇచ్చినట్లు తెలిపారు. ఈసారి మొత్తం ప్రక్రియను ఓపెన్ గ్లోబల్ టెండర్ల ద్వారా పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. మఫత్‌లాల్ వివాదంపై కూడా స్పష్టత ఇస్తూ, టెండర్లలో పాల్గొన్న వారికే కాంట్రాక్టులు ఇచ్చామని, నాణ్యత తనిఖీలు చేసి ఎంపిక చేసినట్లు వివరించారు.ఈ అంశంపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని కూడా స్పష్టం చేశారు.

**టెండర్లపై చర్చకు మేం ఎప్పుడైనా సిద్ధం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

గురుకులాల టెండర్లపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని, ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షం వెనక్కి తగ్గుతోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించామని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులు హరీశ్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఆయన అన్నారు. ఆధారాలతో చర్చకు రావాలని, అసెంబ్లీ సమావేశాల్లో అన్ని వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. గత బిఆర్‌ఎస్ 9 ఏళ్ల పాలనలో జరిగిన అవినీతి అంశాలపై తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని, ప్రజల ముందు నిజాలు బయటపెడతామని మంత్రి పేర్కొన్నారు. గురుకుల విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన

తరువాయి 8లో




### మైనారిటీల హక్కులను

# కాలరాస్తున్న ప్రభుత్వాలు

- ఆల్ ఇండియా తంజీమ్- ఎ- ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ అజీజ్ పాషా

ప్రజాపక్షం/హైదరాబాద్

మైనారిటీల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సిపిఐ మాజీ ఎంపి, 'ఆల్ ఇండియా తంజీమ్–ఎ–ఇన్సాఫ్' జాతీయ అధ్యక్షులు సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. మైనారిటీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా తంజీమ్– ఎ–ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం 'చలో సెక్రటేరియట్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా పార్క్ నుంచి సచివాలయం వైపు ర్యాలీగా వెళ్తున్న నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ సందర్భంగా ప్రదర్శకులను ఉద్దేశించి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ

తరువాయి 8లో

**ప్రతి గుడిసెకూ పట్టా ప్రతి పేదవానికీ ఇల్లు**

# సాధించే వరకూ అవిశ్రాంత పోరాటాలు

- 6న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద లక్షలాదిమందితో మహా ధర్నా
- సింగరేణిపై శ్వేత పత్రం విడుదల చేయాలి
- పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు, పేదలకు సాగు హక్కు పత్రాలు (పట్టాలు) ఇవ్వాలి : కూనంనేని సాంబశివరావు
- వచ్చే ఎన్నికల్లో మోదీని గద్దె దింపడమే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా సిపిఐ ఉద్యమ కార్యాచరణ : కె.రామకృష్ణ




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ప్రతి గుడిసెకూ పట్టా , ప్రతి పేదవాడికీ ఇల్లు నినాదంతో వాటిని సాధించేవరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అవిశ్రాంత ఉద్యమాలను చేపడుతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ ఏ కూనంనేని సాంబశివరావు, గడిచిన 12 ఏళ్లలో ఏ వర్గానికి న్యాయం చేయని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా సిపిఐ ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసిందని జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణలు ప్రకటించారు. గురువారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ ఏ కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ మాట్లాడారు.

**పేద వర్గాల సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలు : కూనంనేని సాంబశివరావు**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేద వర్గాల సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్షంగా సిపిఐ, సిపిఐ (ఎం), ఎంసిపిఐ, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్, సిపిఐ (ఎమ్ న్యూ డెమోక్రసీ తదితర వామపక్ష పార్టీలు అన్ని పెద్ద ఎత్తున ఆందోళనలను చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గతనెల 27న వరంగల్ జిల్లా దిగ్బంధనం, ఈ నెల 1వ తేదీన

తరువాయి 8లో

### గుడిసెవాసుల పట్టాల కోసం

## 6న హైదరాబాద్‌లో భారీ ధర్నా

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని గుడిసెవాసులందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న హైదరాబాద్‌లోనిధర్నా చౌక్ (ఇందిరా పార్క్) వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. విద్యానగర్‌లోని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ

తరువాయి 8లో






### స్పీడ్ పోస్ట్, ప్రైవేట్ కొరియర్ ద్వారా

# దేశవ్యాప్తంగా గంజాయి సరఫరా

- జార్ఖండ్ కేంద్రంగా రూ.5 కోట్ల టర్నోవర్‌తో డ్రగ్స్ దందా
- అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు చేసిన తెలంగాణ పోలీసులు
- ప్రధాన నిందితుడి అరెస్ట్
- హైదరాబాద్ సిపి సజ్జనార్ వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

స్పీడ్ పోస్ట్, ప్రైవేట్ కొరియర్ సేవలను అడ్డాగా చేసుకుని దేశవ్యాప్తంగా గంజాయిని సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) పోలీసులు ఛేదించారు. జార్ఖండ్‌కు చెందిన ప్రధాన నిందితుడు సత్యం మిశ్రాను అరెస్ట్ చేయగా, మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసిలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో హైదరాబాద్ సిపి సజ్జనార్ వివరాలను వెల్లడించారు. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రా తన సోదరుడు శుభమ్ మిశ్రా, రాహుల్ ఝా, సచిన్ మిశ్రా, సంతోష్ పండిట్లతో కలిసి

తరువాయి 8లో



### బెంగళూరు రాతి గనిలో

# ఘోర ప్రమాదం..

- కూలిన భారీ బండరాయి
- ఎనిమిది మంది మృతి

**బెంగళూరు:** కర్ణాటక రాజధాని బెంగళూరులోని దక్షిణ తాలూకా పరిధిలో ఉన్న ఓ రాతి గనిలో గురువారం జరిగిన ఘోర ప్రమాదంలో బిహార్‌కు చెందిన కార్మికులతో పాటు మొత్తం ఎనిమిది మంది దినసరి కూలీలు మృతి చెందారు. భారీ గ్రానైట్ బండరాయి ఒక్కసారిగా కూలిపడటంతో ఈ విషాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బెంగళూరు అర్బన్, బెంగళూరు సౌత్ జిల్లాల

తరువాయి 12లో

### అక్రమ సంపాదనకు అడ్డదారులు

# కట్టడిలో వైఫల్యం

- దొరకని అవినీతి అధికారులు... కొందరు దొరికినా దొరలే !
- ఎసిబి దాడులతో బయటపడుతున్న ఆస్తులు - విస్తుపోతున్న ప్రజలు



ప్రజాపక్షం/ ఖమ్మం

సమాజంలో జవాబుదారి తనం లోపించడం ముఖ్యంగా అధికారులు తమ పనులను బాధ్యతగా భావించకపోవడం ప్రభుత్వ ఉద్యోగమంటే తమ పరిధిలో ఏదైనా చేయవచ్చునన్న భావన బలపడటం భారీ అవినీతికి ఆస్కారమిస్తుంది. అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్న కొందరిని కట్టడి చేయడంలో వైఫల్యం చెందడమే అవినీతి అనకొండలు పెరగడానికి కారణమవుతుంది. ఏదో సినిమాలో చెప్పినట్లుగా తోటకూర దొంగతనం చేసిననాడే దండించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు కదా అని పశ్చాత్తాపంతో దొంగ అన్నట్లుగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవినీతిపై పర్యవేక్షణ లేకపోవడం కొందరి అవినీతి బహిరంగమే అయినా కనీస చర్యలు తీసుకోకపోవడం ఈ పరిస్థితికి కారణమవుతుంది. అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) దాడుల్లో పట్టుబడుతున్న అధికారుల స్థాయి వారి ఆస్తుల చిట్టాలు చూస్తుంటే సామాన్యులు సైతం అవాక్కవుతున్నారు. ఎవరి చిట్టా చూసినా కేజీల్లో బంగారం, కోట్లలో ఆస్తులు, గుట్టలు గుట్టలుగా కరెన్సీ నోట్లు బయటపడుతున్నాయి. ఎప్పుడో ఒకసారి ఒకరిపైనో ఇద్దరిపైనో దాడి జరిగితే ఇంత అక్రమ ఆస్తి బయటపడుతుంది. మొత్తంగా అవినీతి అధికారుల ఆస్తుల చిట్టాను లాగితే ఎంత ఉంటుందో అంతు చిక్కడం లేదు. కొందరు కమీషన్ల కింగ్‌లై క్షేత్రస్థాయి చిరుద్యోగి నుంచి పై అధికారి వరకు వసూళ్లలో వాటాలు పుచ్చుకునే వారే. ఏ శాఖలోనూ పారదర్శకత మచ్చుకు కూడా కనిపించడం లేదు. గ్రామస్థాయిలో చిన్న ధృవీకరణ పత్రం ఇచ్చేందుకు మొదలవుతున్న లంచం బదిలీలు, జీవోల దాకా

తరువాయి 12లో

### ఉత్తర తెలంగాణలో

# భారీ వర్షాలు

- రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, ఈదురుగాలులకు అవకాశం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
- రాజస్థాన్‌లోకి ప్రవేశించిన రుతుపవనాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే వారం రోజుల పాటు వర్షాలు కొనసాగనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముండగా, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శుక్రవారం ఉదయం వరకు ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే

తరువాయి 12లో

# ప్రహసనంగా బస్తీ మే సవాళ్ళు

గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య సాగుతున్న పోటాపోటీ విమర్శలు పతాక స్థాయికి చేరుకున్నాయి. బహిరంగ చర్చలకు బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల బహిరంగ సవాళ్ళ పరంపర గురువారం హైదరాబాద్ వీధుల్లో రచ్చకు దారి తీసింది. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలనలపై, అప్పులపై చర్చకు తాను సిద్ధమేనని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు తెలంగాణ భవన్‌లో ఎదురు చూడగా, మరోవైపు గురుకులాలకు స్కూల్ యూనిఫామ్‌ల విషయంలో అవినీతిపై చర్చకు రావాలన్న మరో బిఆర్‌ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ సవాలును మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, మహ్మద్ అజారుద్దీన్ లు స్వీకరిస్తూ గురువారం ఉదయమే గన్ పార్క్ వద్దకు చేరుకున్నారు. మంత్రులు అక్కడే ఎదురు కొద్ది సేపు ఎదురు చూసి గురుకుల యూనిఫామ్‌ల వ్యవహారంపై తమ వాదనను చెప్పుకొని వెళ్ళిపోగా, వారు వెళ్ళిపోయిన తరువాత తెలంగాణ భవన్ నుంచి బయలు దేరిన బిఆర్‌ఎస్ డిప్యూటీ లీడర్ తన్నీరు హరీశ్‌రావు, ప్రవీణ్‌కుమార్‌లను అక్కడే పోలీసులు అరెస్టు చేశారు. కెటిఆర్ సవాలును స్వీకరించిన మరో మంత్రి జూపల్లి కృష్ణారావు గన్ పార్క్‌కు చేరుకొని బిఆర్‌ఎస్ హయాంలో అప్పులపై వివరించి వెళ్ళిపోయారు. ఉదయం నుంచి వ్యవహారాన్ని గమనించిన వారికి ఇదొక ప్రహసనాన్ని తలపించింది. ఈ సవాళ్ళ పర్వానికి ముందు దారి తీసిన పరిణామలను పరికిస్తే, ఎన్నికల హామీలపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, అసెంబ్లీ డిప్యూటీ లీడర్ తన్నీరు హరీశ్‌రావులు ఇటీవల జిల్లాల్లో తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల డోసు పెంచారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ ఆర్థిక అరాచకత్వంతో రాష్ట్రం రూ.8.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, అయినప్పటికీ సాధ్యమైనంత మేరకు హామీలను అమలు చేస్తూనే ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, కాంగ్రెస్ నేతలు చెబుతూనే ఉన్నారు. బిఆర్‌ఎస్ పదేళ్ళ పాలనపై, రెండేళ్ళ తమ ప్రభుత్వ పాలనపై చర్చకు సిద్ధమేనని, అందుకు సిద్ధమైతే స్పీకర్‌కు ప్రతిపక్ష నాయకుడు కె.చంద్రశేఖర్‌రావు లేఖ రాసి అసెంబ్లీకి రావాలని నల్లగొండ, హైదరాబాద్ సభలలో సిఎం రేవంత్ రెడ్డి సవాలు విసిరారు. దీనికి ప్రతిగా బిఆర్‌ఎస్ నేతల సవాళ్ళు, దానికి మంత్రుల స్పందనలతో గురువారం నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

స్థూలంగా అప్పులు, ఎన్నికల హామీల అమలు అంశాల చుట్టూనే ఈ సవాళ్ళ రాజకీయాలు తిరుగుతున్నాయి. తాము ప్రభుత్వం ఏర్పాటు చేసిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిల్లో ముఖ్యమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచితంగా గృహ విద్యుత్, రూ.2లక్షల వరకు వ్యవసాయ రుణాల మాఫీ, రైతు భరోసా రూ.12వేలకు పెంపు, ఉచితంగా సన్న బియ్యం, సన్న ఒడ్లకు బోనస్ వంటివి అమలు చేసింది. అయితే రైతు భరోసా అందించడంలో నిరుద కొరతతో కొంత ఆలస్యం, ఒక విడత వేయకపోవం, ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం వంటివి చోటు చేసుకున్నాయి. వీటితో పాటు, మిగతా హామీల అమలు విషయంలో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు బిఆర్‌ఎస్ శతథా ప్రయత్నిస్తోంది. వాటి ఆలస్యానికి గత ప్రభుత్వ అప్పుల భారమే కారణమని ముఖ్యమంత్రి, మంత్రులు ప్రతి విమర్శలు చేస్తున్నారు.

అప్పుల విషయానికి వస్తే, బిఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో ప్రత్యక్ష బహిరంగ అప్పులు రూ.3.50 లక్షల కోట్లు అని కేంద్ర ఆర్థిక మంత్రి పంకజ్ చౌధురి పార్లమెంటులో ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానాన్ని బిఆర్‌ఎస్ ఆయుధంగా ప్రయోగిస్తోన్నది. కాంగ్రెస్ మాత్రం రూ.8.11 లక్షల కోట్లు అని చెబుతోన్నది. రెండు వాదనలు నిజమే. ఎందుకంటే, ప్రభుత్వం తీసుకునే అప్పులు రెండు రకాలు. ఒకటి, బడ్జెట్‌లో చూపించే ప్రభుత్వం తీసుకునే ప్రత్యక్ష అప్పులు, రెండవది, బడ్జెట్‌లో కలపని ప్రభుత్వ గ్యారెంటీతో కార్పొరేషన్‌లు, స్పెషల్ పర్పస్ వెహికిల్ తీసుకునే రుణాలు. కేంద్ర మంత్రి చెప్పినది కేవలం బడ్జెట్‌లో చూపిన ప్రత్యక్ష రుణాలు మాత్రమే. అంత మాత్రాన కాళేశ్వరం ప్రాజెక్టు, గొర్ల పంపిణీ తదితరాల కోసం కార్పొరేషన్‌ల ద్వారా తీసుకున్న బడ్జెటేతర అప్పులు ప్రభుత్వానివి కాకుండా పోవు! వాటిని కార్పొరేషన్‌లు చెల్లించకపోతే ప్రభుత్వమే చెల్లించాలి. కార్పొరేషన్‌లంటే గాలి నుంచి ఊడిపడినవి కాదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాలకమండళ్ళతో నడిచేవే. కాబట్టి బిఆర్‌ఎస్ ఒక్క కన్ను మూసి చూపినట్లుగా, కేవలం ప్రత్యక్ష అప్పులనే ప్రస్తావిస్తూ, కుయుక్తితో బడ్జెటేతర అప్పులను చెప్పకుండా ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నది. మరోవైపు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలోనే 2023 డిసెంబర్ 20 తేదీన 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి'పై శాసనసభలో శ్వేత పత్రాన్ని విడుదల చేసింది. అందులో 2023–24 నాటికి రాష్ట్ర ప్రత్యక్ష రుణం రూ.3.89 లక్షల కోట్లుగా చూపించారు. దానికి అదనంగా బడ్జెటేతర రుణాలను కలుపుకొని అప్పు రూ.6.71 లక్షల కోట్లుగా శ్వేత పత్రం ప్రకటించింది. అవీ కాకుండా ఉద్యోగులు, కాంట్రాక్టర్‌లు, సప్లయర్‌లకు మరో రూ.40,154 కోట్లు బకాయిలు ఉన్నాయని పేర్కొంది. ఇంకా సింగరేణి, విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సినవి కలుపుకొని మొత్తంగా రూ.8 లక్షల కోట్లకు పైగా ప్రత్యక్ష, పరోక్ష రుణాలు, బకాయిల భారం తమపై పడిందని రేవంత్ సర్కార్ చెబుతున్న మాటలో వాస్తవముంది.

అయితే, ఎన్నికల హామీల అమలు, సింగరేణి కాలరీస్, గురుకులాలు, హ్యామ్ రోడ్లు తదితర అంశాలపై బిఆర్‌ఎస్ నేతలు విమర్శల దాడిని పెంచి ప్రభుత్వాన్ని రెచ్చగొడుతున్నారు. వాటిని అంకెలతో సహా వివరించి, పత్రికా సమావేశాలు, సామాజిక మాధ్యమాల ద్వారా జనసమూహంలోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. అలా కాకుండా బస్తీ మే సవాల్ అంటూ బిఆర్‌ఎస్ విసిరుతున్న సవాళ్ళ ఉచ్చుకు స్పందిస్తూ మంత్రులు రోడ్లపైకి రావటం తప్పుడు సంకేతాలకు దారి తీస్తుంది. ప్రభుత్వాన్ని కవ్వించటం ప్రతిపక్ష విధి, అదే సమయంలో వాటికి సరైన వేదికల్లో సమాధానం చెప్పడం ప్రభుత్వ బాధ్యత. ఉభయుల మధ్య ప్రత్యక్ష చర్చకు శాసనసభకు మించిన వేదిక ప్రజాస్వామ్యంలో మరొకటి లేదు. ఏటా కనీసం 50 రోజుల పాటు శాసనసభ సమావేశాలను నిర్వహించి, చర్చలకు అవకాశం కల్పించి, వాటికి సమర్ధవంతమైన జవాబివ్వడమే ప్రభుత్వ జవాబుదారీతనానికి గీటురాయి. అంతే తప్ప సవాళ్ళతో కాదు. అసెంబ్లీలో చర్చిద్దామని ఇప్పటికే సిఎం రేవంత్ రెడ్డి చేసిన సముచిత ప్రతిపాదనను ప్రతిపక్ష నేత అంగీకరించడం సబబు. ●



## అధికార పటిష్ఠత కోసం ఒక సాధనంగా వాడుకుంది

**శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రారంభమైనప్పటి నుంచి అందిన నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులతో సహా ప్రతి విరాళంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేత సమగ్ర ఆడిట్ చేయించి, ఆ నివేదికను దేశం ఎదుట ఉంచాలి. అయోధ్య రామాలయం, దాని నిర్మాణం, భక్తుల కానుకల నిర్వహణకు సంబంధించిన ఆరోపణలపై జరుగుతున్న అన్ని నేరపూరిత కార్యకలాపాలపై స్వతంత్ర న్యాయ విచారణను ఏర్పాటు చేయాలి. రాజకీయ అధికారాన్ని కూడగట్టుకోవడానికి సంఘ్ పరివార్ శ్రీరాముడిని ఆశ్రయించింది. ఇప్పడు దురాశతో ఆయన ఆలయాన్ని కళంకితం చేసిందనే ఆరోపణలను ఎదుర్కొంటోంది.సంఘ్ పరివార్ దురాశ నుండి లక్షలాది మంది విశ్వాసాన్ని కాపాడాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరుతున్నాను.**

- సిపిఐ రాజ్యసభ పక్ష నాయకుడు
పి.సందోష్ కుమార్




## ప్లాస్టిక్ సంచులు వద్దు.. బట్ట సంచులే ముద్దు

ఆధునిక మానవ నిత్యజీవితంలో ప్లాస్టిక్ ఒక అవిభాజ్య భాగమైపోయింది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకోబోయే వరకు మనం ఉపయోగించే వస్తువులలో ప్లాస్టిక్ పాత్ర ఎంతో ఉంది. ముఖ్యంగా, ఒక్కసారి మాత్రమే వాడి పారేసే 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్' బ్యాగుల వాడకం ప్రపంచవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోయింది. ఈ తాత్కాలిక సౌకర్యం మన పర్యావరణానికి శాశ్వత శాపంగా మారుతోంది. ఈ తీవ్రమైన పరిస్థితిపై ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి, ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని పూర్తిగా అరికట్టేలా ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం జూలై 3వ తేదీన 'అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం' జరుపుకుంటారు.

ప్లాస్టిక్ బ్యాగులు చౌకగా, సులభంగా లభిస్తాయి కాబట్టి మనం వీటిని విచ్చలవిడిగా వాడుతున్నాం. కానీ ఇవి ప్రకృతికి కలిగించే నష్టాలు ఊహాతీతం. ప్లాస్టిక్ బ్యాగులు అంత సులభంగా భూమిలో కలిసిపోవు. శాస్త్రీయ అంచనాల ప్రకారం, ఒక్క ప్లాస్టిక్ బ్యాగ్ పూర్తిగా విచ్ఛిన్నం కావడానికి 400 నుండి 1000 సంవత్సరాల సమయం పడుతుంది. దీనివల్ల భూమి పొరలు దెబ్బతిని, వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా భూగర్భ జలాల రీఛార్జ్ ప్రక్రియ నిలిచిపోతుంది. నగరాల్లో రోడ్లపై పారేసే ప్లాస్టిక్ కవర్లను ఆహారంతో పాటు ఆవులు, ఇతర జంతువులు తిని పేగుల్లో ప్లాస్టిక్ పేరుకుపోయి ప్రాణాలు కోల్పోతున్నాయి. అలాగే, నదుల ద్వారా సముద్రాలలో చేరే ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల తిమింగలాలు, తాబేళ్లు, చేపలు వంటి లక్షలాది జలచరాలు ప్రతి సంవత్సరం మృత్యువాత పడుతున్నాయి.

మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ప్లాస్టిక్ కాలక్రమేణా పూర్తిగా నశించకుండా చిన్నచిన్న ముక్కలుగా, అంటే 'మైక్రోప్లాస్టిక్స్'గా మారుతుంది. ఇవి నీరు, ఆహార గొలుసు ద్వారా పరోక్షంగా మానవ శరీరంలోకి, జంతువుల శరీరంలోకి ప్రవేశించి క్యాన్సర్, హార్మోన్ల అసమతుల్యత వంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతున్నాయి. పర్యావరణపరంగానే కాకుండా, డ్రైనేజీలు, మురుగు కాలువలలో ప్లాస్టిక్ బ్యాగులు ఇరుక్కుపోవడం వల్ల నీటి ప్రవాహం ఆగిపోతోంది. దీనివల్ల నగరాలలో స్వల్ప వర్షాలకే మురుగునీరు రోడ్లపైకి చేరి కృత్రిమ వరదలు సంభవించడానికి, తద్వారా అంటువ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణమవుతోంది.

ఈ ప్లాస్టిక్ మహమ్మారిని పూర్తిగా నివారించాలంటే, మన నిత్యజీవితంలో పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్థానంలో జనపనార సంచులు లేదా గుడ్డ సంచులు వాడటం అత్యంత ఉత్తమమైన మార్గం. ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లకు బదులుగా పూర్వకాలంలాగా అరటి ఆకులు, విస్తరాకులు, మట్టి పాత్రలను ఉపయోగించవచ్చు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లకు ప్రత్యామ్నాయంగా స్టీల్, రాగి లేదా గాజు బాటిళ్లను, అలాగే ప్లాస్టిక్ స్ట్రాలకు బదులుగా కాగితం లేదా వెదురుతో చేసిన స్ట్రాలను వాడటం అలవాటు చేసుకోవాలి.

ఈ సామాజిక మార్పు సాధ్యం కావాలంటే మనం వ్యక్తిగతంగా కొన్ని బాధ్యతలను స్వీకరించాలి. మనం మార్కెట్‌కు లేదా షాపింగ్‌కు వెళ్లేటప్పుడు ఇంటి నుంచే ఒక గుడ్డ సంచిని తీసుకెళ్లడం నియమంగా పెట్టుకోవాలి. దుకాణదారుడు ప్లాస్టిక్ బ్యాగ్ ఇస్తానన్నా 'వద్దు' అని తిరస్కరించే స్పృహ మనలో కలగాలి. దీనితో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని నిరాకరించడం (Refuse), తగ్గించడం (Reduce), ఉన్న వాటిని తిరిగి ఉపయోగించడం (Reuse), మరియు రీసైక్లింగ్‌కు పంపడం (Recycle) అనే '4R' సూత్రాన్ని ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో పాటిస్తేనే ప్లాస్టిక్ రహిత సమాజం వైపు అడుగులు పడతాయి.

'ప్రకృతి మనిషి అవసరాలను తీర్చగలదు, కానీ అతని స్వార్థాన్ని కాదు' అన్న మహాత్మా గాంధీ సూక్తి ప్లాస్టిక్ వాడకానికి సరిగ్గా సరిపోతుంది. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం అనేది కేవలం ఒక రోజు జరుపుకునే వేడుక కాదు; అది భూమిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరి నిరంతర బాధ్యత. ప్రభుత్వాలు చట్టాలు చేసినంత మాత్రాన, జరిమానాలు విధించినంత మాత్రాన ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యం కాదు, ప్రతి పౌరుడిలోనూ అంతర్గత మార్పు రావాలి. పచ్చని పర్యావరణాన్ని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును రాబోయే తరాలకు బహుమతిగా అందించాలంటే ఈ రోజు నుంచే ప్లాస్టిక్ బ్యాగులకు పూర్తిగా స్వస్తి పలి కి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి.

*(జులై 3 అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం)*



**సుధాకర్ ఎవి,**
9000674747

### 105 సంవత్సరాల స్థితిస్థాపకత

# ప్రపంచ నాయకత్వ బాటలో చైనా కమ్యూనిస్టు పార్టీ



పల్లవ్ సేన్ గుప్త

కార్మిక చోదక శక్తిగా, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ధ్వజంగా కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సిపిసి)105వ వార్షికోత్సవం జరుపుకుంటోంది. అంకిత భావం కలిగిన, బహుకొద్ది మంది మార్క్సిస్టు విప్లవ కారులు 1921 జులైలో సిపిసి స్థాపించారు. అది అర్థఫ్యూడల్, అర్థవలస దేశాన్ని ప్రపంచస్థాయి సోషలిస్టు శక్తిగా పరివర్తన గావించింది. ఒక విప్లవ పార్టీ మార్క్సిస్టు – లెనినిస్టు సూత్రాలను నిర్ధిష్టమైన దేశీయ పరిస్థితులకు ఎలా క్రియాశీలంగా అనువర్తింప జేయగలదో, ఒక స్థితిస్థాపక సోషలిస్టు రాజ్యాన్ని నిర్మించటానికి తీవ్రమైన అంతర్గత , బాహ్యవైరుధ్యాలను అధిగమిస్తూ ఎలా ముందుకు సాగగలదో ఈ ప్రయాణం నిరూపించింది.

**నూతన ప్రజాస్వామిక విప్లవం**

1921లో సిపిసి ఆవిర్భావం ప్రపంచ చరిత్ర గమనాన్ని మార్చివేసింది. 1917 అక్టోబర్ విప్లవ గర్జన మార్గదర్శకత్వంలో సిపిసి వ్యవస్థాపకులైన చెన్ డుక్సియు, లీ దఝావో తదితరులు చైనా శ్రమజీవులను విదేశీ సామ్రాజ్యవాదం నుంచీ, దేశీయ ఫ్యూడలిజం నుంచి విముక్తి చేసేందుకు పార్టీని ఏర్పాటు చేశారు. పార్టీ ఆరంభ సంవత్సరాల్లో ముమ్మరంగా వర్గపోరాటం జరిగింది. విప్లవ ప్రతీఘాత కొమింటాంగ్ (కెఎంటి) పాశవికంగా అణచివేతకు పాల్పడింది. పట్టణ తిరుగుబాటు అనే ప్రామాణిక నమూనా చైనాలో విజయవంతం కాదని మావో జెడాంగ్ వ్యూహాత్మక నాయకత్వం కింద సిపిసి గుర్తించింది. పార్టీ 'నూతన ప్రజాస్వామిక విప్లవ' సిద్ధాంతం రూపొందించుకుని తన ప్రధాన దృష్టిని గ్రామసీమల వైపు మరల్చింది. విస్తారంగా రైతాంగం సమీకరణ, కార్మిక– కర్షక రెడ్ ఆర్మీ ఏర్పాటు, చరిత్ర ప్రసిద్ధమైన లాంగ్‌మార్చ్ (సుదీర్ఘ విముక్తి యాత్ర) చేబట్టడం ద్వారా సిపిసి అభేద్యమైన విప్లవ స్థావర ప్రదేశాలు నిర్మించింది. జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా ప్రతిఘటన యుద్ధం కాలంలో చైనీయుల దేశానికి నిజమైన రక్షకునిగా సిపిసి నిలబడింది. ఆ తర్వాత అమెరికా మద్ధతుగల కెఎంటికి వ్యతిరేకంగా అంతర్యుద్ధం దరిమిలా సిపిసి ప్రజాబాహుళ్యాన్ని సంపూర్ణ విజయంలోకి నడిపించింది. శతాబ్దకాల జాతీయ అవమానం, అణచివేతకు అంతం పలుకుతూ 1949 అక్టోబర్ 1న చైర్మన్ మావో చైనా ప్రజారిపబ్లిక్ (పిఆర్‌సి) వ్యవస్థాపకతను ప్రకటించారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంలో కార్మిక వర్గ నియంతృత్వాన్ని నెలకొల్పుతున్నట్లు ప్రకటించారు.

**అతివాద పెడధోరణులు – సాంస్కృతిక విప్లవం**

**కమ్యూనిస్టు ఉద్యమంలో చీలిక**

చైనా విముక్తి దరిమిలా, యుద్ధ శిథిలాలనుంచి సోషలిజం నిర్మించే బృహత్తర కర్తవ్యాన్ని సిపిసి చేబట్టింది. తొలి పంచవర్ష ప్రణాళికను విజయవంతంగా అమలు జరిపిన పార్టీ వ్యవసాయాన్ని సమష్టీకరించింది, పరిశ్రమను సమాజపరం చేసింది, భారీ పరిశ్రమలకు పునాదులు వేసింది. అయితే సోషలిస్టు నిర్మాణ పథం రహదారి కాదు, సైద్ధాంతిక అవరోధాలతో కూడుకున్నది. సోషలిస్టు పరివర్తనను వేగవంత మొనర్చే ఆతృతలో, ఊహించుకున్న బ్యూరోక్రటిక్ వక్రీకరణలను తిప్పికొట్టేపనిలో పార్టీనాయకత్వం అతివాద పెడధోరణుల్లో పడింది. ఈ కాలంలోనే 'ముందుకు మహా గెంతు' అమలు చేశారు; అంతిమంగా 'మహా కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం' (1966–1976) అమలు జరిపారు.

పెట్టుబడిదారీ పునరుద్ధరణను నిరోధించటం, విప్లవోత్తేజాన్నినిలబెట్టటం అనే సైద్ధాంతిక తలంపుతో ప్రారంభించిన సాంస్కృతిక విప్లవం కాలంలో అనేక తప్పు నిర్ణయాలు చోటుచేసుకున్నాయి. అది దేశంలో తీవ్రమైన అస్థిరతకు, సంస్థల పక్షవాతానికి, సోషలిస్టు న్యాయవ్యవస్థ తాత్కాలికంగా బలహీనపడటానికి దారితీసింది. ఈ ''అతివాద'' సైద్ధాంతిక వైఖరుల ప్రభావం ఒక్క చైనాకే పరిమితం కాలేదు. అంతర్జాతీయంగా అవి కమ్యూనిస్టు ఉద్యమంలో పలు పిడివాద ధోరణులను ప్రోత్సహించాయి. అనేక కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల్లో చీలికలు, భేదాభిప్రాయాలను లేవనెత్తాయి. ''మావో సే–టుంగ్ ఆలోచన పతాకాన్నిసమున్నతంగా నిలుపుదాం'' అనే నినాదం కింద అనేక గ్రూపు లు కార్మికవర్గ అంతర్జాతీయత, ప్రజాస్వామ్యయుతమైన కేంద్రీకృత విధానం, ప్రపంచ కమ్యూనిస్టు ఐక్యత సూత్రాలను తిరస్కరించాయి; సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఇతోధిక ఐక్యత అవసరమైన సమయంలో కమ్యూనిస్టు ఉద్యమం చీలికలు పీలికలు కావటానికి దోహద పడ్డారు.

ఈ కల్లోల దశాబ్దం గాఢమైన చారిత్రక పాఠంగా పనిచేసింది. స్వీయాత్మక విప్లవోత్సాహం అనేది ఎల్లప్పుడూ వాస్తవిక ఆర్థిక పరిస్థితుల్లో, సమష్టి నాయకత్వంలో, ప్రజాస్వామ్యయుతమైన కేంద్రీకృత విధానంలో, నిర్ధిష్టమైన పరిస్థితులగూర్చి నిర్దిష్టమైన విశ్లేషణలో పాదుకుని ఉండాలని నిరూపించింది. ఉత్తరోత్తర సిపిసి చేబట్టిన దిద్దుబాటు జాతీయపరిస్థితులకు మార్క్సిజాన్ని సృజనాత్మకంగా అనువర్తింపజేయటం ద్వారానే సోషలిజం పురోగమిస్తుందని, మితవాద అవకాశవాదం, 'అతివాద' దుందుడుకుతనం రెండింటికీ లోను కాకూడదని పునరుద్ఘాటించింది.

**చరిత్రాత్మక దిద్దుబాటు**

**11వ సెంట్రల్ కమిటీ ఆరవ ప్లీనరీ**

ఆధునిక సిపిసి కోసం మలుపు 1981జూన్‌లో 11వ కేంద్ర కమిటీ ఆరవ ప్లీనరీ సమావేశంలో అరుదెంచింది. ఆ సమావేశం ఒక బృహత్తరమైన తీర్మానం ఆమోదించింది. అది 'చైనా ప్రజారిపబ్లిక్ వ్యవస్థాపన నాటి నుంచీ మన పార్టీ చరిత్రలో కొన్ని ప్రశ్నలపై తీర్మానం'. ఈ పత్రం తప్పనిసరైన, హేతుబద్ధతతో కూడిన, శాస్త్రీయ మార్క్సిస్టు – లెనినిస్టు సైద్ధాంతిక అవగాహనను పార్టీకి తిరిగి తీసుకువచ్చింది.

మూడు ఆవశ్యకమైన చారిత్రక కర్తవ్యాలను ఆ తీర్మానం సాధించింది :

**మావో జెడాంగ్ గూర్చి అంచనా :** అది చైర్మన్ మావోను చారిత్రక భౌతికవాదంతో అంచనా వేసింది. గొప్ప కార్మికవర్గ విప్లవకారునిగా ఆయనలోని అజరామరమైన గొప్పదనాలను సమర్థించింది. ఉత్తరోత్తర సంవత్సరాల్లో ఆయన చేసిన తప్పులను వాస్తవిక దృష్టి నుంచి గుర్తించింది. మావో జెడాంగ్ ఆలోచనను పార్టీకి మార్గదర్శకమైన సైద్ధాంతిక నిక్షేపంగా దృఢంగా అట్టిపెట్టుకుంది.

**సాంస్కృతిక విప్లవంపై తీర్పు:** అది సాంస్కృతిక విప్లవాన్ని శాస్త్రీయంగా అంచనా వేసింది. దాని పద్ధతులను ఖండించింది. వాస్తవికత నుంచి పార్టీని వేరుపరిచిన ''అతివాద''పెడధోరణిని సరిదిద్దింది.

**పిఆర్‌సి సాఫల్యాల ధృవీకరణ:** 1949 నాటినుంచి సోషలిస్టు వ్యవస్థ సాధించిన విజయాలను అది సమర్థించింది. కార్మిక రాజ్యం మూల బలాన్ని చెల్లుబాటు చేసింది. ఈ గతితార్కిక మేళవింపు పార్టీని ఐక్యం చేసింది, విప్లవాన్ని రద్దు చేయకుండా గత తప్పిదాలను సరిదిద్దుకుంది. పిడివాదం, మితవాద చారిత్రక నిహిలిజం (అన్నిటినీ తిరస్కరించటం–19వ శతాబ్దిలో రష్యా దేశంలో వ్యాపించిన గాఢ విప్లవ భావాలు గల పక్షం వారి భావాలు; ఆ కాలంలో అమలులో ఉన్న ఏ విషయమూ అంగీకారయోగ్యం కాదని వారి విశ్వాసం) రెండింటికీ ద్వారం మూసివేసింది.

**ఉత్పత్తి శక్తులు, బాహాటత...డెంగ్ వ్యూహాత్మక దార్శనికత**

చారిత్రక స్పష్టత పునరుద్ధరణతో, చైనా తదుపరి సోషలిస్టు దశకు సాధికారిక రూపశిల్పిగా డెంగ్ సియావోపింగ్ ఆవిర్భవించాడు. దారిద్ర్యంపై సోషలిజం నిర్మించలేమని డెంగ్ గుర్తించారు. సామ్రాజ్యవాదుల చక్రబంధాన్ని తట్టుకుని నిలబడాలన్నా, మానవ సంక్షేమాన్ని మెరుగుపరచాలన్నా సోషలిస్టు రాజ్యం తన ఉత్పాదక శక్తులను శీఘ్రంగా వృద్ధిపరచాలి, తన ఆర్థిక పునాదిని బలోపేతం చేసుకోవాలని వక్కాణించాడు.

1978లో, సిపిసి చరిత్రాత్మకమైన 'సంస్కరణ, ఆర్థిక వ్యవస్థను బాహాటపరిచే విధానం' ప్రకటించింది. దాంతో విదేశీ వాణిజ్యానికి, టెక్నాలజీకి 'ద్వారం తెరుచుకుంది'. అయితే నాలుగు ముఖ్య సూత్రాలను (సోషలిస్టు పథం, సిపిసి నాయకత్వం సహా) కచ్చితంగా పాటిస్తామని ప్రకటించింది. 'చైనా లక్షణాలతో సోషలిజం' అనే శాస్త్రీయ భావన ముందుకు వచ్చింది.

ప్రభుత్వరంగం కింద మార్కెట్ యంత్రాంగాలు, ప్రణాళికాబద్ధంగా స్థూల ఆర్థిక చట్రాన్ని ప్రవేశపెట్టటం ద్వారా మార్కెట్ కార్మికవర్గ నియంతృత్వానికి ఉపకరిస్తుందని సిపిసి రుజువు చేసింది. ఈ విధానం మార్క్సిజాన్ని విడనాడలేదు. చైనా సోషలిజం ప్రాథమిక దశలో ఉందని గుర్తించటం, ఉన్నతమైన కమ్యూనిస్టు సమాజం కోసం పాదార్థిక పునాది వేయటానికి ఉత్పాదక శక్తులను పెద్దఎత్తున విస్తరించాల్సిన అవసరాన్ని గుర్తించటం ద్వారా అది మార్క్సిజాన్ని సంపద్వంతం చేసింది.

**పార్టీ, రాజ్యం పటిష్ఠతకు జి జిన్‌పింగ్ దోహదం**

కామ్రేడ్ జి జిన్‌పింగ్ దృఢమైన నాయకత్వం కింద చైనా కమ్యూనిస్టు పార్టీ సోషలిస్టు నిర్మాణంలో నూతన శకంలోకి ప్రవేశించింది. పరిపాలన, సిద్ధాంతం అభివృద్ధి విషయంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక ఉదాహరణగా నిలిచింది.

21వ శతాబ్దం వాస్తవికతలకు మార్క్సిజం–లెనినిజంను అనువర్తింపజేయటంలో క్రితం తరాలు సాధించిన విజయాలు ఆధారంగా జిన్‌పింగ్, 'నూతన శకంలో చైనా లక్షణాలతో సోషలిజం నిర్మాణంపై జిన్‌పింగ్ ఆలోచన'ను అభివృద్ధి చేశారు. చైనా సమాజాన్ని ఎదుర్కొంటున్న ప్రధాన వైరుధ్యాన్ని శాస్త్రీయంగా తిరిగి మదింపుచేయటం ఈ ఆలోచనలో కేంద్ర లక్షణం. అది శీఘ్రగతిన ఆర్థికాభివృద్ధి నుంచి వక్కాణింపును అసమతుల, అరకొర అభివృద్ధి–మెరుగైన జీవితం కోసం ప్రజల ఆకాంక్ష మధ్యనున్న వైరుధ్యం వైపు మరల్చింది. ఈ దృక్పథం ఉన్నత నాణ్యతతో కూడిన అభివృద్ధి, అందరి సౌభాగ్యం, పర్యావరణహితమైన నాగరికత, ప్రజల సంక్షేమానికి ఉపకరించే ఆర్థిక పురోభివృద్ధి సాధించే వైపుకు మార్గనిర్దేశన చేసింది. ఈ దృక్పథం సాఫల్యతకు ఉదాహరణ – ప్రపంచంలోనే అతిపెద్ద లక్ష్యిత దారిద్ర్య నిర్మూలన కార్యక్రమం విజయవంతంగా అమలు జరగటం. జిన్‌పింగ్ నాయకత్వం కింద సిపిసి పదుల లక్షల పార్టీ కార్యకర్తలను గ్రామీణ ప్రాంతాలకు తరలించింది. దాదాపు 10 కోట్లమందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకువచ్చారు. ఐక్యరాజ్యసమితి నిలకడైన అభివృద్ధి లక్ష్యాల్లో ఒకటైన దారిద్ర్య నిర్మూలనను షెడ్యూలుకన్నా ముందే నెరవేర్చారు. ఈ సాఫల్యం సోషలిస్టు అభివృద్ధి, ప్రభుత్వ నాయకత్వంలో ప్రణాళిక విధానం అమలులో మైలురాయిగా విస్తృతంగా పరిగణించబడింది.

పాలక కమ్యూనిస్టుపార్టీ దీర్ఘకాలిక జీవశక్తి దాని సైద్ధాంతిక బలం, సంస్థాగత నిర్మాణ నిజాయితీపై ఆధారపడి ఉంటుం ది. ఇది గుర్తించిన జిన్‌పింగ్ వ్యక్తిగత విప్లవం, కచ్చితంగా పార్టీ సూత్రాలను పాటించటం, అవినీతికి వ్యతిరేకంగా పోరాటంతోకూడిన సమగ్ర ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన అవినీతి వ్యతిరేక పోరాటం సీనియర్ నాయకులపైన, పునాదిస్థాయి కార్యకర్తలపైన గురిపెట్టింది. పాతుకుపోయిన ప్రయోజనాలను కూల్చివేయటం, పార్టీ క్రమశిక్షణను పటిష్టం చేయటం, సిపిసి నాయకత్వ పాత్రను బలోపేతం చేయటంపై కేంద్రీకరించింది. మార్క్సిస్టు విద్యను, సైద్ధాంతిక దిద్దుబాటును ముమ్మరం చేయటం, పార్టీ ప్రజాపంథాను పునరుద్ధరించటం పార్టీలో ఐక్యతను, క్రమశిక్షణను, రాజకీయ సఖ్యతను పెంపొందించింది. దీనికితోడుగా జాతీయ సార్వభౌమత్వాన్ని సమర్థించే, ఆధిక్యవాదాన్ని వ్యతిరేకించే విదేశాంగ విధానాన్ని పార్టీ వక్కాణించింది. అది బహుళపక్ష అంతర్జాతీయ వ్యవస్థను ప్రతిపాదిస్తున్నది. జిన్‌పింగ్ నాయకత్వంలో చైనా తన ఆర్థిక సార్వభౌమత్వాన్ని పటిష్టం చేసుకుంది, సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థను పరిరక్షించుకుంది. అందరి సౌభాగ్యం, అంతర్జాతీయ సహకారం లక్ష్యాలతో పార్టీ నిర్మాణాన్ని మేళవించింది. ఈ పరిణామాలు చైనా సోషలిస్టు పంథాలో విశ్వాసాన్ని పటిష్టం చేసాయి. సమకాలీన పరిస్థితుల్లో మార్క్సిజానికి కొనసాగుతున్న సజీవశక్తిని, అనువర్తింపును నిరూపించింది.

**చైనా బహుళ ధృవ విదేశాంగ విధానం**

అంతర్జాతీయ రంగంలో, సిపిసి శాంతి, రాజ్య సార్వభౌమత్వం, కార్మిక వర్గ అంతర్జాతీయత ప్రాతిపదికగా విదేశాంగ విధానం అనుసరిస్తోంది. పశ్చిమ పెట్టుబడిదారీ విధానంలో అంతర్గతంగా ఉండే ఆధిపత్యవాదం, వలసవాదం, సైనిక దురాక్రమణను చైనా తిరస్కరిస్తున్నది. బహుళ ధృవ ప్రపంచం కోసం, ''మానవాళి ఉమ్మడిగా పంచుకునే భవిష్యత్‌తో కూడిన సమాజం'' కోసం చైనా కృషి చేస్తున్నది. బెల్ట్ మరియు రోడ్డు చొరవల ద్వారా చైనా వర్ధమాన దేశాలకు మౌలిక వసతుల అభివృద్ధికై ప్రత్యామ్నాయ నమూనా ప్రణాళికను అందిస్తున్నది. సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలు ఇచ్చే బందిపోటుదారీ రుణాలనుంచి వాటికి ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తున్నది. సబబైన, బహుళ ధృవ దౌత్యాన్ని ప్రోత్సహించటం ద్వారా చైనా, సామ్రాజ్యవాద ఆధిపత్యానికి శక్తిమంతమైన ప్రతితూకంగా ఉపకరిస్తున్నది. తద్వారా గ్లోబల్ సౌత్ (దక్షిణ గోళ పేద, వర్ధమాన దేశాలు) ప్రయోజనాలు కాపాడుతున్నది, మరింత ప్రజాస్వామ్యయుతమైన అంతర్జాతీయ వ్యవస్థకు బాటవేస్తున్నది.

**పార్టీ నాయకత్వ పాత్ర**

చైనా ఆర్థిక నమూనా, మార్కెట్ యంత్రాంగాల వినియోగం, ప్రపంచ వాణిజ్య వ్యవస్థల్లో చేరిపోవటంపై అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో చర్చ జరుగుతున్నది. అయితే ఒక రాజ్యం వర్గ స్వభావాన్ని నిర్దిష్టమైన ఫలితాలను అంచనా కట్టటానికి మార్క్సిస్టు – లెనినిస్టు విశ్లేషణ అవసరం.

వివాదరహితమైన వాస్తవికత ఇలా ఉంది: నేటి చైనా ఆర్థికంగా మహాశక్తి, గ్రీన్ టెక్నాలజీలో నాయకురాలు, పురోభివృద్ధి చెందిన శాస్త్రీయ కేంద్రం, కార్మికవర్గ ఆత్మగౌరవానికి రక్షకురాలు – చైనా కమ్యూనిస్టుపార్టీ పరిపూర్ణ నాయకత్వం వల్లనే ఇది సాధ్యమైంది. ద్రవ్య జీవమార్గాలపై రాజ్యం నియంత్రణ అమలు జరపటం, భూమిపై ప్రభుత్వస్వామ్యాన్ని పరిరక్షించటం, ప్రభుత్వ యంత్రాంగాన్ని కార్మికవర్గం చేతిలో దృఢంగా ఉంచటం ద్వారా చైనా సోవియట్ యూనియన్ కూలిపోయిన విషాదకర పరిస్థితులను తప్పించుకోగలిగింది. 105 సంవత్సరాల చైనా కమ్యూనిస్టుపార్టీ మార్క్సిజం–లెనినిజం సత్యానికి సజీవ సాక్ష్యంగా ఉంది. సోషలిజం స్థిరంగా మనుగడ సాగించగలదని, అది మానవ నాగరికత అనివార్యమైన భవిష్యత్‌కు ప్రతినిధి అనీ ప్రపంచానికి రుజువు చేస్తున్నది.




బీజింగ్‌లో జులై 1, 2026 న చైనా కమ్యూనిస్టు పార్టీ 105వ వ్యవస్థాపక దినోత్సవ సభ దృశ్యం

STATE & REGIONAL NEWS
# జనరల్
STATE & REGIONAL NEWS

హైదరాబాద్
శుక్రవారం
03-07-2026
www.prajapaksham.in

ప్రజాపక్షం
Telugu National Daily


## క్యూర్ పరిధిలో త్వరలోనే 'ఇందిరమ్మ ఇళ్ల' టెండర్లు

- తుది దశలో స్థలాల సేకరణ
- 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా వెయ్యి ఇళ్ల నిర్మాణం
- గోషామహల్ లబ్ధిదారులకు పట్టాల పంపిణీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే టెండర్లు ఆహ్వానించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారపౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను గురువారం సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపి ఎం.అనిల్ కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గుడిసెల్లేని తెలంగాణను సాకారం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు కార్పొరేషన్‌ల పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తవుతుందని మంత్రి వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో ఎకరాకు రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు భూమి విలువ ఉన్నప్పటికీ, ఆ విలువను పక్కనపెట్టి అదే ప్రాంతంలో పేదలకు ఇళ్లు నిర్మించి వారి పేరిట పట్టాలు అందజేస్తామన్నారు. పేదలను నగరాలకు దూరంగా తరలించి ఇళ్లు కట్టే విధానం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండదని, వారి ఉపాధి, జీవనాధారాలకు సమీపంలోనే, అదే నియోజక వర్గ పరిధిలో ఇళ్లు నిర్మించి అందించడం ప్రభుత్వ విధానమన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రతి పేద కుటుంబానికి ఇల్లు' అనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. క్యూర్ పరిధిలోని 19 నియోజక వర్గాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఒక్కో నియోజక వర్గంలో కనీసం 500 నుంచి 1000 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించి, అనంతరం రెండో, మూడో విడతల్లో మరిన్ని ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ధూల్‌పేట్‌లో గత ప్రభుత్వ హయాం లో అసంపూర్తిగా నిలిచిపోయిన 125 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. మిగిలిన పేదలకు కూడా ఇళ్లు మంజూరు చేసేందుకు పరిసర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లు నిర్మిస్తుందని, అది సాధ్యం కాక పోతే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని తాను విసిరిన సవాల్‌కు ఇప్పటి వరకు బిఆర్ఎస్ నేతల నుంచి స్పందన రాలేదని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు.

## అప్పులు, పలు అంశాలపై చర్చించేందుకు ప్రత్యేక శాసనసభ సమావేశాలు నిర్వహించాలి

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు సవాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అప్పులతో పాటు పలు అంశాలపైన చర్చించేందుకు ముఖ్యమంత్రికి, మంత్రులకు ధైర్యం ఉంటే వెంటనే ప్రత్యేక శాసనసభ సమావేశాలను నిర్వహించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సవాల్ విసిరారు. సభలో మైక్ కట్ చేయకుండా తమకు మాట్లాడే అవకాశం కల్పిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ రెండున్నరేళ్ల డొల్లతనాన్ని, అవినీతి బండారాన్ని మొత్తం బట్టబయలు చేస్తామని స్పష్టం చేశారు. చర్చకు రావాలని సవాల్ విసిరిన మంత్రులు తీరా చర్చించేందుకు రాకుండా తోక ముడిచారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ నాయకులు, మంత్రి జూపల్లి కృష్ణారావు పరస్పర సవాళ్ల నేపథ్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో చర్చ నిమ్మితం మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం ప్రత్యేకంగా ఒక కుర్చీ వేశారు. అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో కేవలం రూ 2.80 లక్షల కోట్ల అప్పు చేశారని ఆర్‌బిఐ, కాగ్ లెక్కలు చెబుతుంటే, డిప్యూటీ సిఎం పొంతన లేని కాకి లెక్కలతో ప్రజలను మభ్య పెడుతున్నారని దుయ్యబట్టారు. ఆర్‌బిఐ, కాగ్ స్పష్టంగా అప్పుల లెక్కలు చెబుతుంటే, మరోవైపు కాంగ్రెస్ నాయకులు మాత్రం ఇష్టానుసారంగా కాకిలెక్కలు చెబుతున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ శాఖలో హోలోగ్రామ్ టెండర్లలో మంత్రి కొడుకు, సిఎం అల్లుడి పంచాయతీ భరించలేకనే ఐఎఎస్ అధికారి రిజ్వీ రాజీనామా చేశారని, బీర్ల కోసం తెచ్చిన జిఒపై జూపల్లికి కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌కు వస్తున్నానని ప్రగల్భాలు పలికిన మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం తాము ప్రత్యేకంగా కుర్చీ వేసి, మూడు గంటల పాటు వేచి చూసినా ఆయన రాలేదని కెటిఆర్ ఎద్దేవా చేశారు.

**బిఆర్ఎస్ పాలనలో లక్ష ఇండ్లను కట్టాం పొంగులేటి అంతకంటే ఒకటి ఎక్కువ కట్టాలి**

బిఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్‌రూము ఇండ్లను కట్టామని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక లక్షా ఒక ఇల్లు కట్టి చూపించాలని కెటిఆర్ సవాల్ విసిరారు. అవినీతి పాలనపై రాజీలేని పోరాటం చేసి కాంగ్రెస్ ముసుగును తొలగిస్తామన్నారు. త్వరలోనే రైతు సంగ్రామ సదస్సులు, యువజన, విద్యార్థి సదస్సుల ద్వారా కాంగ్రెస్ మోసాలను ఎక్కడికక్కడ నిలదీసి, ప్రజలను చైతన్యవంతం చేస్తామని తెలిపారు. పొంగులేటి కుమారుడు వట్టినాగులపల్లిలో కంపెనీలపై పడి భూములను దోచుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బిజెపి ఎంపిలకు కాంట్రాక్టులు ఎలా దక్కుతున్నాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బిజెపిల మధ్య చీకటి ఒప్పందాలు ప్రజలకు అర్థమైందన్నారు.



## గన్‌పార్కుకు బావబామ్మర్ది ఇద్దరూ కలిసి రండి

- వాస్తవాలతో సమాధానం చెబుతా: మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రూ.7 లక్షల కోట్లకుపైగా అప్పు చేసిందని తాను చెప్పింది వాస్తవమేనని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ అంశంపై చేసిన తన వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ హరీష్ రావు గన్‌పార్కు అమరవీరుల స్తూపం వద్దకు వస్తానని ప్రకటించారని తెలిపారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ హరీష్ రావుతో పాటు కెటిఆర్ కూడా కలిసి గన్‌పార్కుకు రావాలని సవాల్ విసిరారు. 'బావబామ్మర్ది ఇద్దరూ కలిసి గన్‌పార్కుకు రండి, నేను కూడా అక్కడికే వస్తాను. మీరిచ్చిన సవాల్‌కు ప్రజల సమక్షంలోనే అన్ని వాస్తవాలతో సమాధానం చెబుతాను' అని అన్నారు. అంతేకాకుండా, 'బావ ఒకచోట, బామ్మర్ది మరోచోట మాట్లాడటం ఎందుకు? ఇద్దరూ కలిసి రండి. మీ ఇద్దరికీ ఒకేసారి అక్కడే సమాధానం ఇస్తాను' అని మంత్రి జూపల్లి వ్యాఖ్యానించారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి జూపల్లికి తెలంగాణ టూరిజం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ టూరిజం శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐటియూసి నేతలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తెలంగాణ టూరిజం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళిలు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా టూరిజం శాఖలో పనిచేస్తున్న సుమారు 61 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పలు మాసాలుగా వేతనాలు సక్రమంగా అందడం లేదని, దీంతో ఉద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. కాంట్రాక్ట్ ఏజెన్సీల నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగ భద్రత లేక ఆందోళన నెలకొన్నదని పేర్కొన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాల ప్రకారం అన్ని సంక్షేమ ప్రయోజనాలు అమలు చేయాలని కోరారు.

## అవినీతిపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు

- ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గురుకులాల్లో జరిగిన అవినీతిపైన చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని బిఆర్ఎస్‌ఎల్‌పి ఉప నాయుడు తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. గురుకులాల విషయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రోజుకోమాట మాట్లాడుతున్నారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ అవినీతికి పాల్పడినందుకే చర్చకు రాకుండా తమను పోలీసులు అడ్డుకున్నారన్నారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్‌కు తాము ఫోన్ చేసినా వారు స్పందించలేదని హరీశ్ రావు అన్నారు. గురుకులాల టెండర్లలో రూ.2 వేలకోట్ల స్కామ్ జరిగిందని తాము ఆరోపిస్తే, మంత్రి అడ్లూరి ముందుగా రూ 687 కోట్లు అని, ఆ తర్వాత రూ.1,142 కోట్లు అని ప్రకటించారని గుర్తు చేశారు. గురుకుల కిరాణా టెండర్లను రూ 8వందల కోట్లకు ఆహ్వానించారని, రూ.2 వందల కోట్ల గోల్‌మాల్ జరిగినట్టు పత్రికలలో ప్రచురితమైందని, ఈ నిధులతో పాటు రూ.1,142 కోట్లను కలిపితే దాదాపు రూ.2వేల కోట్లు అవుతుంది కదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ఖర్చు రూ.84 వేల కోట్లు అని, ఇందులో లక్ష కోట్ల అవినీతి అని దుష్ప్రచారం చేశారన్నారు. తాము మొదటి నుంచే పిల్లలు తినే ఆహారం, గుడ్ల కొనుగోళ్లలో కూడా స్కామ్ జరిగిందని చెబుతున్నామని, పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్, గరం మసాలా వంటి వస్తువులను అధిక ధరలకు కొనుగోలు చేశారని ఆరోపించారు. ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని, ఆయన భార్య లక్ష్మీ భాయిని మార్కెటింగ్ శాఖ నుంచి బదిలీ చేశారని మండిపడ్డారు.

## బిగ్‌బాస్ షోను తలపిస్తున్న డ్రామాలు

- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లపై కేంద్రమంత్రి సంజయ్ సెటైర్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నేతలు 'బిగ్‌బాస్ షో' తరహాలో డ్రామాలు చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. రెండు పార్టీల నేతల తీరుపై సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందించారు. ముందే రిహార్సల్స్ చేసుకుని, నటనలో ఒకరితో ఒకరు పోటాపోటీగా జీవిస్తున్నారన్నారు. అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే ఇద్దరూ దానికి అర్హులే అని విమర్శించారు. తెలంగాణ ప్రజలను అమాయకులుగా భావించవద్దని, ఇరు పార్టీల డ్రామాలను చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. గురుకులాల టెండర్లు, రాష్ట్ర అప్పులు, అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు రావాలని బండి సంజయ్ సవాల్ విసిరారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ఆధ్వర్యంలో డేట్, టైం, వేదిక ఫిక్స్ చేస్తామన్నారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి, సంక్షేమానికి చేసిన ఖర్చులపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రాజకీయ బిగ్‌బాస్ షో ఆడుతున్న ఇరు పార్టీలకు ప్రజలు 'డబుల్ ఎలిమినేషన్' ఇచ్చి, రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్ సర్కార్' తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారని అన్నారు.

## ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పశ్చిమాసియా యుద్ధ సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యత ఇచ్చిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖామంత్రి జి.కిషన్ రెడ్డి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. సామాన్యులపై పెట్రోల్, డీజిల్ ధరల భారం పడకుండా అప్పట్లో విధించిన తాత్కాలిక నియంత్రణలను, పరిస్థితులు సాధారణ స్థితికి రావడంతో ఈనెల 1 నుంచి ఉపసంహరించుకున్నట్లు వెల్లడించారు. రిటైల్ బంకుల్లో వాహనాలకు రోజుకు గరిష్టంగా 200 లీటర్ల హైస్పీడ్ డీజిల్ మాత్రమే సరఫరా చేయాలనే పరిమితిని ఎత్తివేశామని, అలాగే కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ.183 వరకు తగ్గించి, చిన్న వ్యాపారులకు, హోటళ్లకు ఊరటనిచ్చామన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశం ఆర్థిక సంక్షోభంలో పడుతుందని, పెట్రోల్ బంకుల వద్ద క్యూలు కడతారని చేసిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు. అంతర్జాతీయంగా 14.2 కిలోల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1600కు చేరినప్పటికీ, మోదీ ప్రభుత్వం దేశ ప్రజలకు రూ.900కే అందుబాటులో ఉంచిందన్నారు. విపత్కర పరిస్థితుల్లో మోదీ తీసుకున్న దూరదృష్టి నిర్ణయాలు కోట్లాది మంది భారతీయులకు రక్షణ కవచంగా నిలిచాయని కిషన్ రెడ్డి అన్నారు.

## పోలీస్ స్టేషన్ల పరిధులను పునర్వ్యవస్థీకరించాలి

- డిజిపి సి.వి.ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవిష్యత్ పట్టణ విస్తరణ, జనాభా పెరుగుదల, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికతో నాలుగు కమిషనరేట్ల పరిధిలో పోలీస్ స్టేషన్ల పరిధులను పునర్వ్యవస్థీకరించాలని తెలంగాణ రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ సి.వి.ఆనంద్ తెలిపారు. ఈ ప్రక్రియలో సంబంధిత అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన అంశాలపై డిజిపి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయా కమిషనరేట్ల పోలీస్ కమిషనర్లు పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ, పరిధుల విభజన, పరిపాలనా అవసరాలు తదితర అంశాలపై తమ ప్రతిపాదనలను డిజిపికి వివరించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు (జీఓలు)కు అనుగుణంగా పోలీస్ స్టేషన్ల పరిధుల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ సంస్థలు, రెవెన్యూ డివిజన్లు, న్యాయస్థానాల పరిధులను పరిగణనలోకి తీసుకుని పోలీస్ స్టేషన్ హద్దులను నిర్ణయించాలని సూచించారు. హైదరాబాద్ నగరంలోని కొన్ని ప్రాంతాల పోలీస్ స్టేషన్ పరిధుల నిర్ణయంపై ప్రత్యేక సూచనలు చేసిన డిజిపి, పోలీస్ స్టేషన్‌ల పరిధుల మార్పులు, చేర్పుల నిర్ణయం వల్ల ప్రజలకు, ప్రభుత్వ శాఖలకు, న్యాయవ్యవస్థకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, ఆయా ప్రాంతాల భౌగోళిక, పరిపాలనా ప్రత్యేకతలను ప్రతిబింబించే విధంగా పోలీస్ స్టేషన్లకు తగిన పేర్లు నిర్ణయించాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిలు వి.సి. సజ్జనార్, తరుణ్ జోషి, రమేష్ రెడ్డి, సుమతితో పాటు ఇతర సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## 4 ఎకరాల వరకు రైతు భరోసా పూర్తి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద మూడో విడత కింద గురువారం 3 నుంచి 4 ఎకరాల వరకు రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఇందులోభాగంగా 39 లక్షల మంది రైతులకు చెందిన 22.17 లక్షల ఎకరాలసాగుభూమి కలిగిన రైతుల ఖాతాల్లో రూ.1,330.32 కోట్లను నేరుగా జమ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విడతల వారీగా నిధులు విడుదల చేస్తున్నామని, ఇప్పటికే మొదటి రెండు విడతల్లో 3 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు సాయం అందించామని, ఇప్పుడు 3 నుంచి 4 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరి ఖాతాల్లో నిధులు జమ చేశామని మంత్రి తెలిపారు. రైతుభరోసా పథకం కింద ఇప్పటివరకు మొత్తం 61.35 లక్షల మంది రైతులకు చెందిన 90.04 లక్షల ఎకరాల సాగుభూమికి రూ.5,402.37 కోట్ల సాయాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

## డ్రగ్స్, గంజాయి సరఫరాపై నిరంతర నిఘా

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్, ఐడి లిక్కర్ అక్రమ రవాణాపై మరింత కట్టుదిట్టంగా నిరంతర నిఘా పెట్టి మెరుగైన ఫలితాలు సాధించాలని డిసిఎ డైరెక్టర్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి అధికారులను ఆదేశించారు. డిసిఎ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌టిఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ బృందాలతో పాటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నిర్వహించిన దాడులు, తనిఖీల్లో ప్రతిభ కనబరిచిన అధికారులకు ఆయన నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కెమికల్ పరిశ్రమలు, ఔషధ తయారీ సంస్థలు, మెడికల్ షాపులపై జాయింట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంయుక్త తనిఖీలు మంచి ఫలితాలు ఇచ్చాయని అవినాశ్ మహంతి తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా పనిచేసి అక్రమ కార్యకలాపాలను అరికట్టాలని సూచించారు. ఎస్‌టిఎఫ్ బృందాలు 415.25 కిలోల గంజాయి, 1.10 కిలోల ఆల్ప్రాజోలామ్, 43.08 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్, 52.5 లీటర్ల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ స్వాధీనం చేసుకున్నాయని తెలిపారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్, ఎక్సైజ్ బృందాలు 799.25 లీటర్ల నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్, 2,500 కిలోల బెల్లం, 1.553 కిలోల హషిష్ ఆయిల్, 400 గ్రాముల ఓపియం పట్టుకున్న కేసుల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి నగదు రివార్డులు అందజేశారు. ఖమ్మం, మల్కాజిగిరి, షాద్‌నగర్, కాచిగూడ, భద్రాచలం, కొత్తగూడెం, వికారాబాద్, గద్వాల, కాప్రా, శేరిలింగంపల్లి, మహబూబాబాద్, మీర్‌పేట్ ప్రాంతాల్లో నమోదైన కేసుల్లో విశేష కృషి చేసిన అధికారులను ఈ సందర్భంగా డైరెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిసిఎ జాయింట్ డైరెక్టర్ జి.రామ్ధన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఆంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 100 శాతం వేతనం అమలు కాకుంటే ఉద్యమం

- ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 100 శాతం గ్రాస్ శాలరీ అమలు చేయకపోతే మరో దశ పోరాటానికి సిద్ధమవుతామని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్‌లో తోట రామాంజనేయులు అధ్యక్షతన గురువారం జరిగిన రెండవ ఏఎన్‌ఎంల రాష్ట్ర నిర్మాణ మండలి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2023లో ఎఐటియుసి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమం ఫలితంగా రెండవ ఏఎన్‌ఎంల నియామకాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ, ఇప్పటికీ తుది ఫలితాలు ప్రకటించకపోవడం విచారకరమన్నారు. గత ఏప్రిల్‌లో ప్రిలిమినరీ కీ విడుదలైనప్పటికీ రెండు నెలలు గడిచినా ఫైనల్ కీ, ఫలితాలు ప్రకటించకపోవడం అభ్యర్థుల్లో ఆందోళనకు కారణమవుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.1.5 కోట్ల ప్రమాద బీమా అమలు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగం రాని రెండవ ఏఎన్‌ఎంలు, ఈసి ఏఎన్‌ఎంలు, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలకు 100 శాతం గ్రాస్ శాలరీతో పాటు రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. పరీక్ష రాయడానికి అర్హత లేని కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలకు పదవీ విరమణ సమయంలో రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని కోరారు. పోస్టుల పెంపు అంశంపై త్వరలోనే రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. సుమతి, మెటిల్డా, రాష్ట్ర సహాయ కార్యదర్శి అశ్విని, రాష్ట్ర నాయకులు ఎం. నాగమణి, టి. స్వాతిరెడ్డి, విజయలక్ష్మి, విజయకుమారి, ఈసి ఏఎన్‌ఎం నాయకురాలు గునుగుండ్ల విజయకుమారి, జి. సబిత తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబి వలలో డిఎస్‌పి.. డైరీలోనే బినామీ ఆస్తుల చిట్టా

- అక్రమాస్తుల వివరాలు చూసి అధికారులు షాక్
- 20కిపైగా ఆస్తులు, 2 కిలోల బంగారం, రూ.43.60 లక్షల నగదు స్వాధీనం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ (పిసిఎస్)లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి)గా పనిచేస్తున్న సంకిరెడ్డి భీమ్ రెడ్డిపై అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అక్రమాస్తుల కేసు నమోదు చేసింది. ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించిన ఎసిబి అధికారులు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంతో పాటు బంధువులు, స్నేహితులు, బినామీలకు చెందిన మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో హైదరాబాద్, గచ్చిబౌలి, తెల్లాపూర్, పటాన్‌చెరు, నాగోల్, వికారాబాద్, సంగారెడ్డి, కర్ణాటక, బెంగళూరులోని దేవనహళ్లి తదితర ప్రాంతాల్లో విల్లా, ఇండ్లు, ఫ్లాట్లు, వాణిజ్య స్థలాలు, ఓపెన్ ప్లాట్లు, 50 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు ఉన్నట్లు పత్రాలు లభించాయి. అలాగే లంకో హిల్స్‌లోని కమర్షియల్ కాంప్లెక్స్‌లో వాటా, మణికొండలో 3 వేల చదరపు అడుగుల వాణిజ్య స్థలం, రూ.75 లక్షల పెట్టుబడి కూడా గుర్తించారు. ఇక సోదాల్లో డిఎస్‌పి ఇంట్లో రూ.3.60 లక్షలు, బినామీ ఇంట్లో రూ.40 లక్షల నగదు, సుమారు 2 కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులు, రూ.19.91 లక్షల బ్యాంకు నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా డిఎస్‌పి నివాసంలో 23 విదేశీ మద్యం బాటిళ్లు కూడా లభించడంతో తదుపరి చర్యల కోసం ఎక్సైజ్ శాఖకు సమాచారం ఇచ్చారు. స్వాధీనం చేసుకున్న స్థిరాస్తుల మార్కెట్ విలువ డాక్యుమెంట్ విలువ కంటే పలుమార్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఎసిబి అధికారులు పేర్కొన్నారు. మరిన్ని అక్రమాస్తులపై విచారణ కొనసాగుతోందని, కేసు దర్యాప్తు జరుగుతోందని వెల్లడించారు.



**డైరీలోనే బినామీ ఆస్తుల చిట్టా..**

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఎస్‌పి భీమ్ రెడ్డి కేసులో కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. తనకు సంబంధించిన బినామీ ఆస్తులు, పెట్టుబడుల వివరాలను స్వయంగా డైరీలో నమోదు చేసుకున్నట్లు ఎసిబి అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ డైరీ ఆధారంగానే అధికారులు విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపట్టి, పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బహదూర్‌పురా సర్కిల్-21, రాజేంద్రనగర్ జోన్.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీస్

Nit.No. 09/EE-21/RJNRZ/GHMC/2026-27, dt: 02.07.2026, పని పేరు: 2026 సంవత్సరానికి గాను జిహెచ్‌ఎంసి, రాజేంద్రనగర్ జోన్, బహదూర్‌పురా సర్కిల్-21లో 4 పనులు. అంచనా విలువ: రూ. 140.77 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 02.07.2026 సా.5:00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 06.07.2026 సా.5:00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: శ్రీ టి.వెంకట శేషయ్య, ఇఇ-21, సర్కిల్-21, రాజేంద్రనగర్ జోన్, ఫూల్‌బాగ్, చాంద్రాయణగుట్ట, హైదరాబాద్. ఫోన్ నెం. 9492067578. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బహదూర్‌పురా సర్కిల్-21, రాజేంద్రనగర్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 5366-PP/CL/ADVT/2026-27, Date: 02-07-2026

**ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, సంగారెడ్డి జిల్లా.**

E1/IMP/ENGG/05/2026 — కొటేషన్ నోటీస్ — తేదీ: 01.07.2026

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 1. weigh bride, 2. సార్టింగ్ కన్వేయర్, 3. బెయిలింగ్ మెషిన్, 4. గార్డెన్ ష్రెడ్డర్, 5. మీడియం డ్యూటీ ట్విన్ షాఫ్ట్ ష్రెడ్డర్, 6. ఎయిర్ బ్లోయర్ రోజుకు 5.00 టన్నుల నుండి 10.00 టన్నుల వ్యర్థాలను తొలగించుటకు సరఫరా మరియు అమర్చడం కొరకు వ్యక్తిగత కన్సల్టెంట్లు / ఏజెన్సీలు / సంస్థల నుండి ప్రతిపాదనల కోసం కొటేషన్లను ఆహ్వానిస్తోంది. టెండర్ ప్రతిపాదనకు అర్హత సాధించడానికి, వీటిని సిద్ధం చేయడంలో అనుభవం ఉన్న ఆసక్తిగల పార్టీలు 1. కవరింగ్ లెటర్, 2. పాన్ కార్డ్, జిఎస్‌టి పత్రాలను వేర్వేరు కవర్లలో సమర్పించాలి.
కన్సల్టెంట్లు / సంస్థలు తమ సంబంధిత అనుభవ పత్రాలను మరియు అన్ని ఇతర పత్రాలను 07.07.2026 తేదీన ఉదయం 11.00 గంటలలోపు సమర్పించాలి. అవే అదే రోజు ఉదయం 11.30 గంటలకు తెరవబడతాయి.
వివరణాత్మక విధివిధానాలు & ఆర్థిక బిడ్ ఫార్మాట్ ఆసక్తిగల పార్టీలకు అభ్యర్థన మేరకు ఇవ్వబడతాయి. మరిన్ని వివరాల కోసం కార్యాలయ వేళల్లో మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించండి.
ప్రదేశం: ఇస్నాపూర్ — సం/- కమిషనర్, ఇస్నాపూర్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 5306-PP/CL/ADVT/2026-27, Date: 02-07-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎం), చార్మినార్ జోన్.

టెండర్ నోటీస్

| Sl. No. | NIT No. | పని వివరణ | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|---|---|
| 1 | 05/SE(M)/ CRZ/ GHMC/2026-27, Date: 01.07.2026 | 1 నెం. - ఔట్ సోర్సింగ్ వర్క్ | రూ. 187.55 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేది | 03/07/2026 @ 05.00 P.M. | శ్రీమతి ఆర్.ఇందిరా బాయి, సూపరింటెండింగ్ ఇంజనీర్, చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి. ఫూల్ బాగ్, బాబానగర్. ఫోన్: 9963025505 |
| | | | | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | 10/07/2026 @ 3.30 P.M. | |

మరిన్ని వివరాలకు @https://tender.eprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎం), చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 5312-PP/CL/ADVT/2026-27, Date: 02-07-2026

దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ రామాలయ భజన మందిరం**
మార్కెట్ రోడ్, పాల్వంచ పట్టణం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

మెమో నెం. 23559, రెవెన్యూ (ఎండోమెంట్స్-II) శాఖ, తేదీ: 09-06-2026
ఫారం- I
(రూల్ 4 (1) ప్రకారం)

ఇందుమూలముగా తెలియజేసేది ఏమనగా, తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రిలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టం, 1987 (చట్టం నెం. 30/1987) లోని సెక్షన్ 146(1), 2007 సవరణ చట్టం (చట్టం నెం. 33/2007), అలాగే రెవెన్యూ (ఎండోమెంట్స్-I) శాఖ జి.ఓ.ఎం.ఎస్. నెం.649, తేదీ 20-06-1981 లోని రూల్ 3 ప్రకారం, శ్రీ రామాలయం భజన మందిరం, పాల్వంచ గ్రామం మరియు మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పునరుద్ధరణ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది. ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 10 రోజుల అనంతరం కమిటీ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించబడుతుంది. కమిటీ సభ్యులుగా నియమించబడదలచిన ఆసక్తి గల వ్యక్తులు, నిబంధనల ప్రకారం నిర్దేశించిన ఫారం- II లో తమ దరఖాస్తులను ఈ నోటీసు తేదీ నుండి 20 రోజుల లోపు దేవాదాయ శాఖ కమిషనర్, హైదరాబాద్ లేదా సంబంధిత దేవాలయ పరిధిలోని జాయింట్ కమిషనర్ / డిప్యూటీ కమిషనర్ / అసిస్టెంట్ కమిషనర్ వారికి సమర్పించవలెను.

సం/- (శైలజా రామయ్యర్) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

DIPR R.O. No. : 5335-PP/CL/ADVT/2026-27, Date: 02-07-2026



## మాదిగలు విద్యా ఉద్యోగాల్లో రాణించాలి

### 'గో టు విలేజ్' కార్యక్రమంలో సిల్వర్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/దుండిగల్ :** గో టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం మరియు కుత్బుల్లాపూర్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ గార్డెన్ లో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్చార్జి తిప్పరపు లక్ష్మణ్ మాదిగ ఎం.ఎస్.పి జిల్లా అధ్యక్షులు కేశపాగ రాంచందర్ మాదిగ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి సిల్వర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకొని మాదిగలు విద్యా ఉద్యోగాల్లో రాణించాలని జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేసుకోవాలని మహాజన నేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి పార్టీ ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి, యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసురం రమేష్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నడిమి దొడ్డి సలోమి, మహాజన సోషలిస్టు పార్టీ నాయకురాలు ఆరెకటిక జ్యోతి, బాచుపల్లి మండల్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



## రాంకీ డంపింగ్ యార్డును ఎత్తివేయాలి : జెఎసిల డిమాండ్

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డును బేషరతుగా తొలగించాలని జవహర్ నగర్, దమ్మాయిగూడ యాంటి డంపింగ్ యార్డు జెఎసి నేతలు డిమాండ్ చేశారు. గురువారం బండ్లగూడలోని రాజీవ్ గృహకల్పలో షేక్ షావలి, ఎం.సమ్మిరెడ్డి అధ్యక్షతన కాలనీ పెద్దలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. అంతకుముందు స్థానిక నాయకులు ఈగ రాజు, మాజీ ఉపసర్పంచ్ ఆర్.నర్సింహ్మా గౌడ్ నాయకత్వంలో కలుషితమైన చెరువులను, చెత్త కుప్పలను నేతలు పరిశీలించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్పి జాతీయ నేత జానకి రామ్ మాట్లాడుతూ, ఈ డంపింగ్ యార్డు ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 50 లక్షల మంది ప్రజల ఆరోగ్యానికి శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం దీనిపై సానుకూలంగా ఉన్నందున, ప్రజల జీవించే హక్కును కాపాడుతూ, శాస్త్రీయ పద్ధతుల్లో యుద్ధప్రాతిపదికన డంపింగ్ యార్డును ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత టి.శివన్నారాయణ, గడ్డం సదానందం, రాజీవ్ గృహకల్ప ప్రెసిడెంట్ పోతరాజు రాములు, కాంగ్రెస్ నాయకురాలు శ్వేతరాజు తదితర వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## పకడ్బందీగా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సకాలంలో ఎన్యూమరేషన్ పత్రాలు అందేలా బూత్ లెవల్ అధికారులు పకడ్బందీగా పని చేయటం ద్వారా ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా ఉంటారని వినాయక్‌నగర్ మాజీ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి అన్నారు. డివిజన్‌లోని బూత్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో బిఎల్ఓ సూపర్‌వైజర్ సయ్యద్,హేమలత, తిరుమలదేవి, రాజేశ్వరిలను బిజెపి శ్రేణులు ఓం ప్రకాష్, సాయి సురేష్, మల్లేష్ యాదవ్ లతో కల్సి సమన్వయ ఏర్పాట్లలో పాల్గొన్నారు.

## పాత కక్షలతో వ్యక్తిపై దాడి

**ప్రజాపక్షం/నవాబ్ పేట్:** పాత కక్షలు మనసులో పెట్టుకొని ఓ వ్యక్తిని మరో వ్యక్తి, అతని కుటుంబం తీవ్రంగా గాయపరిచిన సంఘటన నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. నవాబ్‌పేట్ ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుమ్మరి గూడ గ్రామానికి చెందిన భార్యభర్తలు సూర్యాపేట అరుణమ్మ, రాంచంద్రయ్య బుధవారం సాయంత్రం పొలానికి వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన ఏక్ మామిడి వెంకట్ రెడ్డి పాతకక్ష మనసులో



పెట్టుకొని ద్విచక్ర వాహనంతో వెనుక నుండి వచ్చి రామచంద్రయ్యకు తగిలించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరగడం అదే అదనుగా భావించిన ఏక్ మామిడి వెంకట్ రెడ్డి అతని కుమారుడు సిద్దేశ్వర్ రెడ్డి, కుటుంబ సభ్యులు కలిసి రాంచంద్రయ్యను అతని భార్య అరుణమ్మ ను కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో రాంచంద్రయ్య తలకు తీవ్ర గాయా లు అయ్యాయి.వెంటనే రాం చంద్రయ్యను అతని భార్య, గ్రామస్తులు కలిసి వికారాబాద్ ఆసుపత్రికి తరలించారు. జరిగిన సంఘటన పై బాధితుడి భార్య అరుణమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు ఏక్ మామిడి వెంకట్ రెడ్డి, అతని కుటుంబం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరి తెలిపారు.

## అప్పుల బాధతో వ్యక్తి అదృశ్యం

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్ళిపోయిన సంఘటన స్థానిక బాలాజీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఎస్ హెచ్‌వో సైదులు తెలిపిన వివరాల ప్రకారం మార్వాడి లేన్, బాలాజీ నగర్ నివాసి అయిన రావికంటి ఈశ్వర్ (44, తండ్రి: పాండు) ఈ నెల 30న సాయంత్రం 6:00 గంటల సమయం



లో తన స్కూటీపై ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్ళిపోయాడు. వెళ్తూ వెళ్తు తన మొబైల్ ఫోన్‌ను కూడా ఇంట్లోనే వదిలిపెట్టి వెళ్లాడు. బాధితుడు ఈశ్వర్ తనకు తెలిసిన వారి దగ్గర పెద్ద మొత్తంలో అప్పులు చేశాడని, ఆ ఆర్థిక ఇబ్బందుల వల్లే తీవ్ర మనస్తాపానికి గురై ఇల్లు వదిలి వెళ్లిపోయాడని ఆయన భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించారు.

# 'ధరణి, భూ భారతి' అక్రమాలపై ప్రత్యేక కమిటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ధరణి, భూ భారతి పోర్టళ్లలో వెలుగులోకి వచ్చిన అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలను సూచించే బాధ్యతను కమిటీకి అప్పగించింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన బుధవారం సచివాలయం లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్ వెల్లడించారు. ధరణి పోర్టళ్లలో కొనసాగుతున్న ఫోరెన్సిక్ ఆడిట్‌లో కొన్ని ఆందోళనకర అంశాలు వెలుగులోకి వచ్చినట్లు ఆయన తెలిపారు. పోర్టల్ సిస్టమ్ నిర్మాణంలో భద్రతా లోపాలు ఉండటంతో వాటిని కొందరు దుర్వినియోగం చేసి కొన్ని మాడ్యూళ్ల ద్వారా అనధికారిక ఎంట్రీలు చేసినట్లు గుర్తించినట్లు చెప్పారు. నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసి) రూపొందించిన భూ భారతి పోర్టల్ కూడా ధరణి ఆధారిత సాంకేతిక నిర్మాణాన్ని అనుసరించడం వల్ల అదే తరహా భద్రతా లోపాలకు గురయ్యే అవకాశం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. గతంలో ధరణి పోర్టల్కు మాడ్యూళ్లు రూపొందించిన వ్యక్తులే ఈ అక్రమాల వెనుక ఉండొచ్చని ప్రభుత్వం అనుమానిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించడం, వారిపై చట్టపరమైన చర్యలు సూచించడం, భవిష్యత్తులో భద్రతా లోపాలను నివారించేందుకు అవసరమైన సిఫార్సులు చేయడం కోసం ప్రత్యేక కమిటీని ప్రభుత్వం నియమించింది.



కమిటీలో మేడ్చల్‌మల్కాజిగిరి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐటి, కమ్యూనికేషన్స్ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు చెందిన హర్ష వర్ధన్, సిఎంఆర్ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ అపూర్వ చౌహాన్, ఉట్నూర్ ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ మంద మకరంద్, తెలంగాణ సిఐబి సైబర్ క్రైమ్స్ డిఎస్‌పి ఏ. సంపత్, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ డిఐజి ఎం. సుభాషిణి, ఎన్ఐసి సీనియర్ డైరెక్టర్ (ఐటి) ఎ. శ్రీనివాస సుబ్బారావు సభ్యులుగా ఉన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు, ఎన్ఐసి పూర్తిగా కొత్త సిస్టమ్ ఆర్కిటెక్చర్‌ను అత్యున్నత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సూచించినట్లు లోకేశ్ కుమార్ తెలిపారు. ప్రత్యేక కమిటీ 15 రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు ఆయన చెప్పారు. ఆ నివేదిక ఆధారం గా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొం టూ, భూముల రికార్డుల భద్రత, సమగ్రత, పారదర్శకత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు.

## 'సర్' సర్వేలో అలసత్వం వద్దు

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) సర్వేలో అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, అర్హులైన ప్రతి ఓటరికి సహకరించి ఒక్క ఓటు కూడా రద్దు కాకుండా చూడాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. బుధవారం సర్ కార్యక్రమంలో భాగంగా ఫతేనగర్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి ఆయన ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు తమ వద్దకు రాలేదు అని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారు. జోనల్ కమిషనర్‌కు ఫోన్ చేసి సర్ పత్రాల పంపిణీలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి బీఎల్‌ఓలు చేరు



కుని ఓటర్లకు అవసరమైన సమాచారం, సహాయం అందించాలని సూచించారు. అలాగే బీఎల్‌ఓలతో పాటు స్థానిక బీఎల్‌ఏలు కూడా సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని అర్హులైన ఓటర్లకు పూర్తి సహకారం అందించాలని తెలిపారు. ఒక్క ఓటు కూడా తొలగించడానికి వీల్లేదు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే అధికారులతో పాటు నా దృష్టికి కూడా తీసుకురావాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ ఇంచార్జ్ గజ్జల నగేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమాజ అభివృద్ధికి కమ్యూనిటీ భవనాలు కీలకం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సమాజ అభివృద్ధికి కమ్యూనిటీ భవనాలు కీలకమని, దీనికోసం ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో కాలనీలు, కుల సంఘాల ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు చేస్తోందని వినాయకనగర్ మాజీ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం డివిజన్‌లోని కాకతీయనగర్‌లో గంగపుత్ర సంఘానికి చెందిన పాత భవన స్థానంలో నూతన కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, నర్సింగరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్‌లో విస్తృత ప్రత్యేక తనిఖీలు

### గంజాయి, వాహనాల స్వాధీనం

**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ పట్టణంలో విస్తృత ప్రత్యేక తనఖీలు గంజాయి స్వాధీనం ,వాహనాల స్వాధీనం ప్రజల భద్రతే పోలీసు ప్రధానలక్ష్యం అని జిల్లా ఎస్‌పి అదేశాలమేరకు, వికారాబాద్ డిఎస్‌పి పర్యవేక్షణలో రాత్రి వికారాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్‌స్టాండ్, నిర్మానుష్య ప్రాంతాలు రాత్రివేళల్లో ప్రత్యేక తనిఖీలలో వికారాబాద్ సిఐ రాఘుకుమార్ ఐదుగురు ఎస్‌ఐలతో అనుమానాస్పద వక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల సందర్భంగా బస్ స్టాండ్ సమీపంలో సుమార్ 15 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. అలాగే చెల్లుబాటు అయ్యే వాహనాలకు సంబంధించిన పత్రాలు చూపించలేని ఎనిమిది వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో అనుమానాస్పద



వ్యక్తులపై ప్రత్యేక నిఘాతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలపాలకు అడ్డుకట్ట వేయడం, మదకద్రవ్యల రవాణా,వినియోగాన్ని నియంత్రించడం ,దొంగతనాలు ఇతర నేరాలను నివరించడం ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా చర్యలు చేపట్టాడం జరిగిందని వికారాబాద్ డిఎస్‌పి అంజయ్య తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు వికారాబాద్ సబ్‌డివిజన్ పోలీసులు నిరంతరం కట్టుబడి పనిచేస్తున్నారని ,ప్రజలు కూడాఅప్రమత్తంగా ఉండి అనుమానస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా100కు సమాచారం అందించాలని తెలిపారు.

## శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సందీప్‌గౌడ్

**ప్రజాపక్షం శామీర్‌పేట :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని నూతనంగా నియమితులైన శామీర్‌పేట డివిజన్ 300 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నక్క సందీప్‌గౌడ్ అన్నారు. గురువారం శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా నక్క సందీప్‌గౌడ్‌ను నియమిస్తు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంధర్భం గా నూతనంగా నియమితులైన నక్క సందీప్‌గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

## ఉద్యమకారుడు విష్ణువర్ధన్‌గౌడ్‌కు ఘన నివాళి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ రాష్ట్ర సాధనకు మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేమూరి విష్ణువర్ధన్‌గౌడ్ ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మేడ్చల్ ఎంఎల్ఏ చామకూర మల్లారెడ్డి, మాజి ఎంఎల్ఏ మలిపెద్ది సుదీర్‌రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ లు అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి ఉద్దెమర్రి గ్రామంలో మలిదశ ఉద్యమకారుడు కీర్తిశేషులు నేమూరి విష్ణువర్ధన్‌గౌడ్ నివాసంలో జరిగిన దశదిన కర్మకు ఎంఎల్ఏ మల్లారెడ్డి హాజరై పూలతో ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యమ సమయంలో పార్టీలకతీతంగా తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేసి జైలుకెళ్లిన గొప్ప ఉద్యమకారుడు విష్ణువర్ధన్‌గౌడ్ అని కొనియాడారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విష్ణుగౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్



మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మున్సిపల్ చైర్మన్ జాం రవి, కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కమతం కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సంజీవయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ డివిజన్ల అధ్యక్షుల నియామకం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో కింది స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు రాష్ట్ర పార్టీ అధిష్టానం రంగం సిద్ధం చేస్తోంది. దీనిలోని భాగంగా జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిల్లో డివిజన్లవారీగా అధ్యక్షులను నియమిస్తూ పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అదేశాలు జారీ చేసారు. గత నవంబరు మాసంలో నియమితులైన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తోటకూర వజ్రేష్ యాదవ్‌ను డివిజన్ల అధ్యక్షులుగా మహిళలతో సహా అన్ని కులాలను సమతుల్యం చేస్తూ సమర్థుల జాబితా పంపించాలన్న ఆదేశాల మేరకు ఆయన పంపిన జాబితాలోని నేతలను డివిజన్ల అధ్యక్షులుగా నియమించారు. రానున్న కాలంలో జరుగనున్న మున్సిపల్ కార్పొరేషన్‌ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల భారీ విజయం సాధించేలా ఆయా డివిజన్లలో పార్టీ కార్యకర్తలందరిని సమన్వయం చేసుకొంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి దక్కేలా చూడటం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ పిలుపిచ్చారు. మల్కాజిగిరి నియోజక వర్గ పరిధిలో 16 , కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో 19, ఉప్పల్

# 'సర్' ను సమర్థవంతంగా నిర్వహించాలి

### కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/మోమిన్‌పేట్ :** ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి తెలిపారు.గురువారం మోమిన్‌పేట్ మండల 75వర్డులో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఇంటింటి సర్వే తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ని ఫారాలుఇచ్చారు ,కుటంబంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు. కుటంబ సభ్యులు ఒకే పిఎస్‌లో ఉన్నారా ,కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్ఓ ప్రతి ఇంటికి తిరిగి అందించాలని కలెక్టర్ తెలిపారు. 18సంవత్సరాలునిండిన అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగానమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఉఃర్ద మాట్లాడే ప్రజలు ఉన్న చోట ఉర్దూఫారాలు అందజేయాలని ,ఎలాంటి పోరపాట్లు లేకుండా సర్‌కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఓటరు




జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించాలనిఅయన బిఎల్ఓలకు సూచించారు. అనంత రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు గర్స్ల్ బాయ్స్ ,ఉర్దూ మీడియం ఉన్నతపాఠశాలలను కలెక్టర్ అకస్మికంగాతనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యహ్న భోజనానికిసంబంధించిన వంటకాలను పరిశీలించా రు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని అధికారులను అఏదశించారు. మోమిన్‌పేట్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యాదికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఆసుపత్రిలో కావాలసిన మందులు ఎప్పుడూ అందుబాఉటోల ఉంచాలని అధికారులకు సూచించారు. సిబ్బంది హాజరు పట్టిక ఇన్‌పేషేంట్ వార్డు, గదులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మున్నిరుద్దిన్,బుచ్చిబాబు, ఎంపిడిఓ రాజ మల్లయ్య, సర్పంచు సంధ్య, సుభాష్‌గౌడ్, డ్యిపూటి తహసీల్దార్ గోవర్ధన్‌గౌడ్, బిఎల్ ఓలు, తదితరులు పాల్గొన్నారు.

**ఆయిల్ ఫామ్ పంటలపై రైతులకు విస్తృత అవగాహన**

**వికారాబాద్ :** గురువారం జిల్లా వ్యాప్తంగా రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలనిజిల్లా కలెక్టర్ సంబంధించిన శాఖల అధికారులను అదేశించారు. అయిల్ పామ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయిల్ ఫామ్ సాగు వల్ల రైతులకు లభించే ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సహకాలు,సాగు విధానాలు ,మార్కెటింగ్ సౌకర్యాలు, కొనుగోలు విధానం వంటి అంశాలపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి ప్రయోజనాలు, ప్రోత్సాహకాలు, సంకేతిక సలహాలు అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. రైతు అయిల్ ఫార్మ క్షేత్ర సందర్శన ఆయిల్ ఫార్మ కంపెనీ సందర్శన చేపట్టాలని ఆదేశించారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తు, ఆయిల్ పామ్ సాగులో విజయవంతమైన రైతుల అనుభవాలను ఇతర రైతులకు పరిచయం చేసే కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్, ఉద్యాన వనశాఖ అధికారి సత్తర్‌లు పాల్గొన్నారు.




## విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

**ప్రజాపక్షం/పరిగి :** విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని కాంక్షిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల అధ్వర్యంలో ఈనెల10న చేపట్టబోయే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ పోస్టర్‌ను గురువారం పరిగి, కొడంగల్ చౌరస్తాలో విద్యార్థి సంఘాల నాయకులు కలిసి విడుదల చేశారు. ఎఐఎస్ఎఫ్ తెలంగాణ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాశ్‌నాయక్, ఎస్ఎఫ్ఐ పరిగి మండల అధ్యక్షుడు శివ మాట్లాడుతూ రాష్టంలో విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను పరిష్కరించడంలోప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.ఈనెల 10న జరుగబోయే విద్యాసంస్థల బంద్‌ను యాజమన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్మెంట్ విడుదల చేసిజీవో నెంబర్ 7 8 9రద్దు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో విద్యాభరోసా కార్డును, స్కూటీలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## టిపిసిసి అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నవాబ్ పేట్ :** కాంగ్రెస్ పార్టీ నవాబుపేట్ మండల నూతన అధ్యక్షుడిగా రావుగారి వెంకట్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం కాంగ్రెస్ పార్టీ నవాబ్ పేట్ మండల అధ్యక్షుడిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రావుగారి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తనపైన నమ్మకం ఉంచి మండల పార్టీ అధ్యక్షులుగా నియమించిన టిపిసిసి రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహించి నవాబ్ పేట్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. సీనియర్ నాయకులకు గౌరవిస్తూ, యువతకు ప్రాధాన్యమిస్తూ అంతర్గత వివాదాలకు తావు లేకుండా అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి మార్గ నిర్దేశకుడిగా పనిచేస్తానని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడుని కలిసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య, తెలంగాణ ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, నవాబ్ పేట్ మండల పిఏసిఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాథోడ్ గీత సింగ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బాల్వంత్ రెడ్డిలతో కలిసి నూతనంగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఎల్లకొండ మాజీ సర్పంచ్ రావుగారి వెంకట్ రెడ్డి, మర్యాదపూర్వకంగా కలిసి మండల అధ్యక్షుడిగా నియమించినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు దారాసింగ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.



## మాజీ ఉపసర్పంచ్ సింగం వెంకటేష్‌కు ఘన నివాళి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్ గ్రామ మాజి ఉపసర్పంచ్ సింగం వెంకటేష్‌కు గ్రామస్థులు ఘనంగా నివాళ్లర్పించారు. గురువారం లక్ష్మాపూర్‌లో ఆయన నివాసంలో జరిగిని దశదిన కర్మకు గ్రామ పెద్దలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సంధర్భంగా మాజి ఉపసర్పంచ్‌గా సింగం వెంకటేష్ లక్ష్మాపూర్ గ్రామానికి ఎనలేని సేవలు చేశారని గ్రామస్థులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, మాజీ ఎంపిపి సింగం సత్యనారాయణ, యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ, మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ వైద్యనాథ్, కాంగ్రెస్ అధ్యక్షుడు కటికెల గోపి, మాజి వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకం

**ప్రజాపక్షం/కాప్రా :** ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం చేసే లక్ష్యంగా ఓటు హక్కు ఉన్న వారందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లాల తిరుమలరెడ్డి అన్నారు. ఎంఎంసి కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాల గ్రామంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు జంగయ్య, రమేష్, స్వప్న, రమేష్ యాదవ్,తదితరులతో కల్సి పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని బిఎల్ఓ, బిఎల్ఏలను కోరారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వర్ణ కుమారి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణకుమారి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా శివరాంపల్లిలోని డిఎంహెచ్ఒ కార్యలయంలో వర్షాకాలంలో విజృంబించే వ్యాధులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ కుమారి మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఐ రిస్క్ ప్రెగ్నెన్సీ మహిళలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, గర్భిణీలకు ఐరన్ పోలిక ఆసిడ్ మాత్రమే పంపిణీ చేయాలని డిఎంహెచ్ఒ ఆదేశించారు.13న నిర్వహించే జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా 1 నుండి 19 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని డిఎంహెచ్ఒ కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ పాపారావు, డిటిసిఒ కళ్యాణ్ చక్రవర్తి, డిఐఒ శిభా హయాత్, డాక్టర్ రాధిక, డాక్టర్ రాజేష్, డిపిఒ అక్రమ్, అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గన్నారు.

## నందివనపర్తి ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలని కోరుతూ గురువారం విహెచ్‌పియస్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ విజయ్‌కుమార్ రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఒ స్వర్ణకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా సర్పంచ్ విహెచ్‌పియస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య మాట్లాడుతూ ప్రాథమిక అరోగ్య కేంద్రం ఎర్పాటుకు ప్రభుత్వం నందివనపర్తిగ్రామంలో ఉన్న సబ్ సెంటర్‌ను తీసుకున్నారు. సబ్ సెంటర్‌లో మరమ్మత్తులు పూర్తి అయి దాదాపు 4 నెలలు గడుస్తున్న ప్రారంభించడంలో అధికారులు నిమ్మకు నిరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. వర్షాకాలం కావడంతో సిజనల్ వ్యాదులతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రారంభించక పోతే విహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో అందోళనను చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐదవ వార్డు సభ్యులు యంజాల విజేత చంద్రకాంత్, ఎంఇఎఫ్ మండల ఉపాధ్యక్షులు మూలి ఎలిషా పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం



**ప్రజాపక్షం/యాచారం :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని మొండిగౌరేల్లి గ్రామ ఉపసర్పంచ్ బడే కుమార్ అన్నారు. గురువారం గ్రామానికి చెందిన ఎట్టి రాములుకు రూ.29 వేలు, మండల గీతకు రూ.10 వేలలు, పెంటారెడ్డికి 48 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సంధర్భంగా కుమార్ మాట్లాడుతూ ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు వచ్చినట్లు తెలిపారు. కాంగ్రేస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందన్నారు. కార్పోరేటు ఆసుత్రుల్లో వైద్యం చేయించుకోలేని పేదలకు ఎంతగానో ఉంపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు తాండ్ర చిన్న, ముత్యాలరెడ్డి, తాండ్ర లక్ష్మయ్య, బోడియా, మంగమ్మ, యాదయ్య, గుర్రం అశోక్‌రెడ్డి, రఘుమారెడ్డి, మల్లారెడ్డి, తాండ్ర జయంత, నాయకులు రాజు, చింటు తదితరులు పాలొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆసరా



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని చింతుల్ల అనుబంధ గ్రామమైన బాషమోని గూడ గ్రామానికి చెందిన అంతారం రాజిరెడ్డి అనారోగ్యంతో చనిపోయాడు. రాజిరెడ్డి అరోగ్యం మెరుగు పడడం కోసం కుటుంబ సభ్యులు పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. విషయం తెలుసుకున్న రాజిరెడ్డి భార్య మమత స్నేహితులు ఓదార్చారు. చింతుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో కలిసి చదువుకున్న మమత కుటుంభానికి చేదోడు వాదోడుగా నిలువాలని నిర్ణయించారు. తక్షణమే 50 వేల రూపాయలను మమతకు అందజేసి ధైర్యం చెప్పారు.

## కోళ్ళ ఫారాల దుర్వాసన, ఈగల బెడద అరికట్టాలి

**ప్రజాపక్షం/యాచార :** మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామం నుండి చిన్నతూండ్ల గ్రామానికి వెళ్ళే మార్గంలో ఉన్న కోళ్ళఫారాలతో వస్తున్న దుర్వాసన, ఈగల బెడదతో రైతులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని మండల బిజెపి నాయకులు నడికుడి కృష్ణ,వార్డు సభ్యులు కావలి కిరణ్‌కుమార్, కోమ్ము యాదయ్య, రైతులు గౌరిగే మల్లేశ్, గౌర పర్వాతాలు తెలిపారు. ఈగలతో వ్యవసాయ పొలాల వద్ద అన్నం తినాలంటేనే రైతులు భయపడుతున్నారని తెలిపారు. ఈగలతో అంటువ్యాధులు ప్రబలి వాంతులు విరోచనాలు అవుతున్నాయని తెలిపారు. వేసిన పంటలు నాశనం అవుతున్నాయన్నారు కోళ్ళ ఫారాల చుట్టు ఉన్న రైతులు వ్యవసాయం చేయాలంటేనే భయపడుతున్నారన్నారు. పాలిచే అవులు, గేదెలు రోగాల భారిన పడుతున్నాయని తెలిపారు. ఈగలు, దోమల బెడదను అరికట్టాలని పలుమార్లు అధికారులు వివరించిన పట్టి పట్టనట్టు వ్యహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, కోళ్ళఫారాల యుజమానులు పెద్ద మనసుతో అలోచించి ఈగల, దోమలు బెడదను అరికట్టి, దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సిద్ధాపూర్‌లో 'ఎకో-టౌన్' ప్రాజెక్ట్

# 86 ఎకరాల భూమి బదిలీకి ప్రభుత్వం ఆమోదం

ఘన వ్యర్థాల నిర్వహణ పనులకు లైన్ క్లియర్

జిఒ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'సిద్ధాపూర్ ఎకోటౌన్' ప్రాజెక్టుకు సంబంధించి కీలక అడుగు పడింది. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలోని 86 ఎకరాల భూమిని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)కి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఈ భూమిలో మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం) కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు 'హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ)' సంస్థకు స్పెషల్‌ఆఫీసర్ (క్యూర్) ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించింది. ఈ మేరకు మెట్రోపాలిటన్ ప్రాంతం, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ జి.ఓ 641 విడుదల చేశారు.




### జపాన్‌తో ఒప్పందం.. నెట్ జీరో లక్ష్యంగా

తెలంగాణ ప్రభుత్వం, జపాన్‌కు చెందిన 'కిటాక్యూషు' నగరానికి మధ్య కుదిరిన 'ఫ్రెండ్‌షిప్ అండ్ కోఆపరేషన్' ఒప్పందంలో భాగంగా ఈ ఎకోటౌన్ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. సర్క్యూలర్ ఎకానమీని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణతో పాటు 'నెట్ జీరో' (కర్బన ఉద్గారాల నిర్మూలన) లక్ష్యాలను సాధించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. మొదట ఈ ప్రాజెక్ట్ కోసం సిద్ధాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్లు 252, 278, 361లలో 150 ఎకరాల భూమిని బదిలీ చేయాలని టిజిఐఐసిని జిహెచ్ఎంసి కోరింది. పారిశ్రామిక, వాణిజ్య శాఖ అనుమతితో అందులో నుంచి 86ఎకరాల భూమిని జిహెచ్ఎంసికి ఉచితంగా బదిలీ చేసేందుకు టిజిఐఐసి అంగీకరించి, ఫిబ్రవరి 11న అడ్వాన్స్ పొసెషన్ సర్టిఫికేట్ ద్వారా భూమిని జిహెచ్ఎంసికి అప్పగించింది.

### వ్యర్థాల నిర్వహణ బాధ్యతలు 'హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ'కు..

ఈ 86 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ నిబంధనలు, కన్సెషన్ అగ్రిమెంట్‌కు లోబడి ఘన వ్యర్థాల నిర్వహణ సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు 'హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ (హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ)'కు స్పెషల్ ఆఫీసర్ గతంలో అనుమతులు ఇచ్చారు. ఆ అనుమతులను జిహెచ్ఎంసి కమిషనర్ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం అధికారికంగా ఆమోదించింది. ప్రభుత్వ నిబంధనలు, కన్సెషన్ అగ్రిమెంట్ షరతులకు లోబడి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు తదుపరి చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

## ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు

# ప్రభుత్వం కట్టుబడి ఉంది



వర్షాకాల విపత్తులపై జెఎటిల అవగాహన సదస్సులో అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా విపత్తు నిర్వహణను మరింత బలోపేతం చేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని పలువురు అధికారులు తెలిపారు. వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంయుక్త కార్యాచరణ బృందాల (జాయింట్ యాక్షన్ టీమ్స్ జెఎటి) కోసం గురువారం హైదరాబాద్‌లోని టిజిఐసిసిసి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్లు, జిహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి, టిజిఎస్‌పిడిసిఎల్, అగ్నిమాపక శాఖ, ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్, భారత వాతావరణ శాఖ (ఐఎండి), హైడ్రా, నీటిపారుదల శాఖ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, టిజిపిడిఎస్, జిల్లా కలెక్టరేట్లు తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు. వర్షాకాల అత్యవసర పరిస్థితుల్లో వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసేందుకు ఈ సంయుక్త కార్యాచరణ బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. టిజిఐసిసిసి 24 గంటల సమన్వయ కేంద్రంగా పనిచేస్తూ సమాచారం సేకరణ, ధృవీకరణ, హెచ్చరికల జారీ, శాఖల మధ్య సమన్వయాన్ని నిర్వహిస్తుందని వివరించారు. హైదరాబాద్ పరిధిలో మొత్తం 913 నీటి నిల్వ (వాటర్‌లాగింగ్) ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. వీటిలో 258 అత్యంత ప్రమాదకర, 290 మధ్యస్థ, 365 సాధారణ ప్రమాద స్థాయికి చెందిన ప్రాంతాలు ఉన్నాయని, వీటిని నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిజిఐసిసిసి డైరెక్టర్ కమలాసన్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర సమాచారం వెంటనే పంచుకోవడం, వేగంగా స్పందించడం ద్వారా ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించవచ్చని తెలిపారు.

## చారిత్రక కమాన్‌లకు పూర్వవైభవం

రూ.11.86 కోట్లతో పునరుద్ధరణ పనులకు ఉత్తర్వులు జారీ !

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ పాతబస్తీలోని కుతుబ్ షాహీ, అసఫ్ జాహీ కాలం నాటి చారిత్రక వారసత్వ కట్టడాల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాతబస్తీలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన 8 చారిత్రక గేట్‌వేలు (కమాన్‌లు) తీవ్రంగా దెబ్బతిని, ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో, వాటికి సమగ్ర మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.11.86 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జిఒ ద్వారా 652 జారీ చేసింది. కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) విజ్ఞప్తి మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులను జారీచేశారు. ఈపనులకయ్యే పూర్తి ఖర్చును హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్‌అథారిటీ(హెచ్ఎండిఏ) నిధులనుంచిభరించనుంది.

**గతంలో ఇచ్చిన నిధులు సరిపోకపోవడంతోనే..**

గతంలో 2023లో 6 కమాన్‌ల చిన్నపాటి మరమ్మతుల కోసం జిహెచ్ఎంసి నిధుల నుండి రూ. 2 కోట్లు మంజూరు చేసినప్పటికీ, ఆ నిధులు కట్టడాల పటిష్టతకు సరిపోవని అధికారులు గుర్తించారు. వర్షాకాలంలో ప్లాస్టరింగ్ ఊడిపడి స్థానికులకు, ప్రయాణికులకు ప్రమాదకరంగా మారడంతో, ఈసారి శాశ్వత ప్రాతిపదికన సమగ్ర పునరుద్ధరణ చేపట్టాలని ప్రభుత్వం భావించి పాత జిఒ రద్దు చేస్తూ కొత్తగా నిధులను కేటాయించింది.



**కమాన్‌లు – అంచనా వ్యయం (రూ. కోట్లలో)**

రాణిగంజ్ కమాన్ – రూ. 0.63 కోట్లు
షేక్ ఫైజ్ కమాన్ – రూ. 0.82 కోట్లు
చత్తా బజార్ కమాన్ – రూ. 1.40 కోట్లు
దివాన్ దేవిడి కమాన్1 – రూ. 2.00 కోట్లు
డబీర్‌పురా కమాన్ – రూ. 1.14 కోట్లు
హుస్సేనీ ఆలం కమాన్ – రూ. 0.55 కోట్లు
దివాన్ దేవిడి కమాన్2 – రూ. 2.38 కోట్లు
హస్మత్ గంజ్ కమాన్ (గేట్) – రూ. 2.94 కోట్లు
మొత్తం బడ్జెట్: రూ. 11.86 కోట్లు

**టెండర్లకు అనుమతి, నిపుణుల పర్యవేక్షణ**

ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిపిఆర్ (వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక)ల తయారీకి, కన్సల్టెన్సీ సేవల ఎంపిక కోసం ఆర్ఎఫ్‌పి టెండర్లు పిలిచేందుకు, అలాగే ప్రతి కమాన్‌కు విడివిడిగా బిఓక్యూ పద్ధతిలో టెండర్లు ఆహ్వానించేందుకు కూకట్‌పల్లి కమాన్ అథారిటీ (కూడా)కి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చారిత్రక కట్టడాల పరిరక్షణ నిపుణుల సమక్షంలో, వారసత్వ సంపద నిబంధనల ప్రకారమే ఈ పనులన్ని అత్యంత నాణ్యతతో పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎంపిక

డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి వెల్లడి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నరసింహ రెడ్డి తో సంప్రదించి,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, కార్యదర్శులు తోపాటు కార్యనిర్వాహక సభ్యుల నియామక ప్రతిపాదనలను తక్షణమే అమలులోకి వచ్చేలా ఆమోదించడం జరిగిందని టిపిసిసి అధ్యక్షుడు బి మహేష్ కుమార్ గౌడ్ నియామక పత్రాలను వెల్లడించినట్లు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి గురువారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షులుగా ఇ సతీష్ రెడ్డి,బొక్క జంగారెడ్డి, పుట్టగళ్ల జగన్, ఎర్రం భాస్కర్ రెడ్డి,రామచంద్రయ్య,చేకుర్తి గోపాల్ రెడ్డి,సురేష్ గౌడ్, రఘునాథరెడ్డి, జి శ్రీనివాస్ రెడ్డి, రామేశ్వరం నరసింహ, నజీర్ బాయ్,ఎం వెంకట్ రెడ్డి,కొత్త కురుమ మంగమ్మ,ఇ భద్రయ్య,కే శ్రీనివాస్,జనరల్ సెక్రెటరీగా ఎర్ర మహేందర్, జె విష్ణు వర్ధన్ రెడ్డి, ఢిల్లీ శ్రీధర్, నేనావత్ రాజు నాయక్,చిలుక ఉపేందర్ రెడ్డి,ఎండి ఇబ్రహీం,గోవర్ధన్ గౌడ్, అంబటి ప్రభాకర్,ఎ మాధవ రెడ్డి,తలారి మైసయ్య,ఎండి జైన్ లుధిన్,ముడిమాల జి శ్రీనివాస్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి,ఎస్ అంతిరెడ్డి, జే రేణుక, చేకూరి వెంకటయ్య, బి రఘురాములు, ఎస్ సంతోష్ రెడ్డి ,ఏ నరేష్ కుమార్,ఎర్రమల్ల పూర్ణచందర్ రెడ్డి, జి సత్య రాణి,ఎండి సోయాబ్ ఎన్ నర్సింగరావు జె విజయ్ పాల్ రెడ్డి, డి కృష్ణ, స్వర్ణ మాధవి ఎంపిక కాగా,ఎండి లష్టియాక్యూ గుల్షాన్ని, బాదేపల్లి సిద్ధార్థ పెంటా రెడ్డి దుర్గం శ్రీహరి గౌడ్,వై వెంకటయ్య గౌడ్, ఎం శ్రీనివాస్, బి రామా కాంత్ రెడ్డి, మహేందర్ యాదవ్, ఎంపిక చేయడం జరిగింది. వీరితోపాటు 48 మందిని సెక్రటరీలుగా 15 మంది ని ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా నియమించినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి వివరించారు.

## ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేయాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అనాథ, తప్పిపోయిన, వీధి బాలలు, బాలకార్మికులను రక్షించి, వారికి పునరావాసం కల్పించడం కోసం పోలీసుశాఖ, మహిళాశిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా నిర్వహించే (ఆపరేషన్ ముస్కాన్ ) విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి కోరారు. గురువారం ఆపరేషన్ ముస్కాన్ 12, 2026 అమలుపై జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో కలెక్టర్ నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ అదృశ్యమైన పిల్లలను గుర్తించి రక్షించడం, బాల కార్మికులు, బాండెడ్ లేబర్‌గా పనిచేస్తున్న చిన్నారులను రెస్క్యూ చేసి పునరావాసం కల్పించడంలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఫీల్డ్‌స్థాయిలో బాల కార్మికులు, బాండెడ్ లేబర్ కేసులు లేదా పిల్లలకు సంబంధించిన సమస్యలు గుర్తించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తక్షణమే రెస్క్యూ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రక్షించిన పిల్లలను సంబంధిత శాఖల సమన్వయంతో సురక్షితంగా సంరక్షించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి మాట్లాడుతూ రెస్క్యూ చేసిన ప్రతి చిన్నారి వివరాలను వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యుసి)కి తెలియజేసి,కమిటీ ఆదేశాల మేరకు పునరావాస చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే పిల్లలను తాత్కాలిక సంరక్షణ గృహాల్లో ఉంచాలని, ఇతర రాష్ట్రాలకు చెందిన చిన్నారులను ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసి స్వగ్రామాలకు తరలించాలని తెలిపారు. గతంలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల కింద రెస్క్యూ చేసిన పిల్లల పునరావాసంపై కూడా సమీక్ష నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎల్.శ్రీలత మాట్లాడుతూ డిసిపియు ఆధ్వర్యంలో అన్ని డివిజన్లలో చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను నియమించినట్లు తెలిపారు. పిల్లల రక్షణ, పునరావాసం, చట్టపరమైన ప్రక్రియల అమలులో కీలకంగా వ్యవహరిస్తారని చెప్పారు. మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి మాట్లాడుతూ పిల్లల రక్షణలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని, 24 గంటలూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్మయి ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ నరేందర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డి.స్వర్ణకుమారి, కార్మిక శాఖ అధికారులు, విఆర్‌బి కోఆర్డినేటర్ రోజా, డిసిపియు అధికారి ప్రవీణ్‌కుమార్, ఎవిఒ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పక్కాగా అమలు

జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా సేవలు అందించాలని, తమకు కేటాయించిన విధులను నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని అధికారులను, సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని అడిక్‌మెట్ డివిజన్ పరిధిలో దయానంద్ నగర్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాలను కర్ణన్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కమిషనర్ స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, సవరణల ప్రక్రియ ఏ విధంగా జరుగుతోందో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు అడిగిన పలు సందేహాలకు ఆయన అక్కడికక్కడే సమాధానాలిచ్చి నివృత్తి చేశారు. ఈ సందర్భంగా 'సర్' ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ విధానాన్ని కమిషనర్ క్షుణ్ణంగా సమీక్షించారు. అనంతరం ఆయన ఎన్నికల సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ఎఈఆర్ఓలు), బిఎల్ఓ సూపర్‌వైజరీ అధికారులు, బూత్ లెవల్ అధికారులు, (బిఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎలు) అందరూ భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) నిబంధనలను పక్కాగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో కమిషనర్ కర్ణన్‌తో పాటు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కె.ఎ. మంగతాయారు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.





## టూరిజం ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారానికి పోరాటం




ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** టూరిజం ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కారానికై ఎఐటియుసి పోరాటం చేస్తుందని సిపిఐ జాతీయ నాయకులు, ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి తెలిపారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ శిల్పారామంలో రాజమౌళి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంప్లాయిస్ యూనియన్ కాంట్రాక్ట్ అవుట్సోర్స్ అధ్యక్షతన గురువారం శిల్పారామం ముందు ఎఐటియుసి జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి చాడ వెంకటరెడ్డి, విఎస్ బోస్ పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శిల్పారామం లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి శేర్లింగంపల్లి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు చందు యాదవ్, తుపాకుల రాములు, టి.కృష్ణ, కనకయ్య, విజయ్, శ్రీను ప్రవీణ్, కుమార్, సూర్యం జగదాంబ సబ్బబేగం తదితరులు పాల్గొన్నారు.

## జెడ్‌సి ఎస్ఐఆర్ పరిశీలన



**ప్రజాపక్షం/యాకుత్‌పురా:** కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సందర్భంగా ఇంటి వద్దకు వచ్చే బిఎల్ఓలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు ఆయన మలక్‌పేట్, సైదాబాద్, సింగరేణి కాలనీ, ఐఎస్ సదన్, సంతోష్‌నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జెడ్‌సి వెంట డిసిలు అలీ, మంగతాయారు, భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

## మంత్రి లక్ష్మణ్‌కు ఆహ్వానం

**ప్రజాపక్షం/లాల్‌దర్వాజా:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా దేశ రాజధాని ఢిల్లీలో లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో జూలై 20 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలకు రావాలని మంత్రి వాకిటి శ్రీహరికి లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయం కమిటీ చైర్మన్ జి.అరవింద్‌కుమార్‌గౌడ్ ఆహ్వానం అందేశారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేష్, ఎ.బద్రినాథ్‌గౌడ్, కోశాధికారి జి.హరీష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఫలించిన ఏండ్ల నిరీక్షణ



**ప్రజాపక్షం/మలక్‌పేట్:** ఏండ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు అందాయి. ఈ మేరకు గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే బలాల సమక్షంలో ముసారాంబాగ్‌లోని అఫ్జల్‌నగర్‌లో 97 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్(హౌసింగ్) అశోక్ చక్రవర్తి, సైదాబాద్ తహశీల్దార్ మణిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర నీటి సరఫరాపై దృష్టి

**ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ:** హైదరాబాద్ నగరానికి మంజీర, సింగూరు జలవనరుల నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్న పంపింగ్ స్టేషన్లకు విద్యుత్‌ను అందిస్తున్న విద్యుత్ లైన్లు, టీజీఎస్పీడీసీఎల్ సబ్‌స్టేషన్, 3.3 కేవీ సబ్‌స్టేషన్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాలు, ఈదురుగాలులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల సమయంలో చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడటం, విద్యుత్ స్తంభాలు, పరికరాలు దెబ్బతినడం వంటి కారణాలతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల పంపింగ్ వ్యవస్థలకు అంతరాయం ఏర్పడి, హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరాపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో జేఎండీ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/కాచిగూడ:** డివిజన్‌లోని మాడపాటి హనుమంతరావు పక్క వీధిలో రూ.5 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ కార్పొరేటర్ కన్నె ఉమ ప్రారంభించారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు కన్నే రమేష్ యాదవ్, జలమండలి జిఎం శ్రీధర్‌రెడ్డి, డీజీఎం కృష్ణ, ఏఈలు సూర్య, కోదండరాంరెడ్డి, నాయకులు వెంకటేష్ యాదవ్, బాల్ వీర్, మల్లికార్జున్, భీమ్‌రాజ్, సంతోష్, రవి యాదవ్, సూరి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులు 'సర్' ఫారం నింపాలి



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** సర్ క్షేత్ర స్థాయి పర్యవేక్షణలో భాగంగా రామనగర్ డివిజన్‌లోని బూత్ నెంబర్ 206, 207లో జిహెచ్‌ఎంసి సూపర్వైజర్ రాజేష్, బిఎల్‌వో సుజాతలతో కలిసి బిఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్ రెడ్డి సర్ ఫారం అందించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ముదిగొండ మురళి, రూపుల వివేక్, సయ్యద్ సాబీర్, నితిన్‌కుమార్, మహిళా నాయకురాళ్లు మరియ, సుగుణ, పద్మ, గండు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ఒలకు సూచనలు



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** సర్ ప్రక్రియను హైదరాబాద్ జిల్లా ఎలక్షన్ ఆఫీసర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించి ఓటర్లను కలిసి సర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిసి మారుతి దివాకర్, ఏఈఆర్వోలు బి.రవీందర్, ఎస్.దేన్సిల్, అధికారులు పాల్గొన్నారు.

## భూ పోరాటం కోసం

**ప్రజాపక్షం/చార్మినార్:** భూ పోరాటంలో భాగంగా టిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బొల్లిగూడెం తరలివెళ్లారు. ఈ మేరకు ప్రభుత్వ భూమి పరిరక్షణ కోసం చార్మినార్ నియోజకవర్గం టిఆర్‌ఎస్ కార్యకర్తలు చార్మినార్ టిఆర్‌ఎస్ ఇంచార్జి పుప్పాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో వెళ్లడం జరిగింది.

# జలమండలిలో 735 కొత్త పోస్టుల భర్తీ

- ప్రభుత్వం ఉత్తర్వుల జారీ టిజెఇయు తొలి విజయం
- యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలిలో 735 కొత్త పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంతకం చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి తెలిపారు. జలమండలిలో 735 కొత్త పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో జలమండలి ఉద్యోగ, కార్మికులు హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని జలమండలి కేంద్ర కార్యాలయంలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి, తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకట్ స్వామి, మొగుళ్ళ రాజి రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, జలమండలి ఎండి అశోక్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రియతమ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.పి.రాఘవేంద్ర రాజ్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి. చంద్రశేఖర్, వై.నాగన్న గౌడ్‌లకు శాలువా గజమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ జలమండలి ఉద్యోగులు, కార్మికుల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. దశాబ్ద కాలం పాటు జలమండలిలో కొత్త ఉద్యోగాల సృష్టి లేకుండా ఉన్న ఉద్యోగులపై భారీ పని భారం పడేదని, ఉద్యోగ, కార్మికులకు ప్రమోషన్లు కూడా దక్కకుండా పోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత గత రెండున్నర ఏళ్ళ కాలంలో టిజెఈయు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అనేక కార్మిక సమస్యలను పరిష్కరించబడ్డాయని తెలిపారు. టిజెఈయు అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవన్ కుమార్, మేవ ప్రధాన కార్యదర్శి సయ్యిద్ అక్తర్ అలీ, నేతలు ఆనంద్ రెడ్డి, సి.రాజు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ గూండాగిరీకి భయపడం

- మంత్రులు చర్చలకు పిలిస్తే పారిపోయారు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ:** రాష్ట్రంలో బిఆర్‌ఎస్ పార్టీ గూండాగిరీకి కాంగ్రెస్ ప్రభుత్వం పడదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలపై ఆయన స్పందించారు. కోట్ల రూపాయలు కొల్లగొట్టిన బిఆర్‌ఎస్ నాయకులు ఇంకా అధికారంలో ఉన్నామనో లేక అధికారంలోకి వస్తామనే భ్రమతోనో మాట్లాడుతున్నారని చెప్పారు. గత పదేళ్లలో వారు అంటించుకున్న బురదను ఇప్పటి ప్రభుత్వానికి, మంత్రులకు అంటించాలని చూస్తున్నారన్నారు. అయిదేళ్ల పాలన కోసం ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే మతి భ్రమించిన బిఆర్‌ఎస్ నాయకులు రెండున్నరేళ్లకే గద్దె దిగాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. ఈ రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏం జరిగిందో, ఎలాంటి తీర్పులు వచ్చాయో రాష్ట్ర ప్రజలకు తెలుసని ఆయన చెప్పారు. ఏశాఖ టెండర్ పిలిచినా సరే టెండర్ అసలు మొత్తం కంటే రెండు నుంచి మూడు రెట్లు అవినీతి జరిగిందనడం వారి అవివేకానికి అద్దం పడుతోందన్నారు. వారి ప్రవర్తన ఇలాగే ఉంటే రానున్న కాలంలో బిఆర్‌ఎస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదని చెప్పారు. మీరు చేసిన సవాల్‌ను స్వీకరించి మా మంత్రులు చర్చకు పిలిచారన్నారు. చర్చల కోసం వచ్చి గంటన్నర సమయం వేచి చూసినా రాకుండా పరారయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో మీరు ఏం మాట్లాడుతారో తెలుసన్నారు. దీనికి కూడా తేదీని ఖరారు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# ఫీజుల ఉద్యమం ఆగదు

8న సత్యాగ్రహ దీక్ష
ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/ హిమాయత్‌నగర్:** రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా రూ.8 వేల కోట్ల పెండింగ్ ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్టు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య తెలిపారు. పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీం అమలు చేయాలని, జి.ఒ.9ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, బిసి యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి సంయుక్త అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. 14 లక్షల మంది విద్యార్థులకు రూ.8వేల కోట్ల ఫీజు బకాయిలుంటే మొన్న ప్రభుత్వం మొక్కుబడిగా రూ.300కోట్లు విడుదల చేసిందని, అవి ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. కొత్త విధానం జిఒ 9 అమలు సాధ్యం కాదన్నారు. విద్యార్థులు తమ చేతి నుంచి ఫీజులు కట్టలేరన్నారు. పాత విధానంలో లోపాలుంటే సరిచేసి విద్యార్థులు ఫీజులు కట్టకుండానే అడ్మిషన్లు ఇచ్చేవిధంగా విధానాలు ఉండాలని సూచించారు. గత నెల 30న రాష్ట్ర వ్యాప్త కాలేజీల బంద్ సంపూర్ణంగా విజయవంతమైందన్నారు. ఫీజులు కట్టని విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, వారి కష్టాలు వర్ణణాతీతమన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పాత విధానంతో ఫీజులు చెల్లించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బిసి విద్యార్థి సంఘం కన్వీనర్లు రాందేవ్ మోదీ, నిఖిల్ పటేల్, సంఘం కార్యదర్శి భీంరాజ్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగలడం ఖాయం : జాజుల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫీజు రియంబర్స్‌మెంట్ అమలు చేయాలని, ఫీజుల బకాయిలు తక్షణమే చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌తో బిసి జెఎసి ఇచ్చిన కాలేజీల బంద్ సంపూర్ణంగా విజయవంతమైందని, బంద్ సందర్భంగా వేలాది కాలేజీలు మూతపడ్డాయని, లక్షలాది మంది విద్యార్థులు బంద్‌లో పాల్గొన్నారని, కాలేజీల బంద్ చూసైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరవాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని బర్కత్ పురలో జరిగిన విద్యార్థుల ఆందోళనలో జాజుల శ్రీనివాస్ గౌడ్, బిఆర్‌ఎస్ శాసనసభ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, గుజ్జ కృష్ణ, తాటికొండ విక్రమ్ గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, కనకల శ్యామ్‌కుర్మా తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మాజీ సిపి ఎకె ఖాన్ కుమారుడిపై చీటింగ్ కేసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఎకె ఖాన్ కుమారుడు మొహ్సిన్ ఖాన్, అతని సహచరుడు తబ్రేజ్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు మోసం, దాడి ఆరోపణలతో కేసు నమోదు చేశారు. సినీ నిర్మాతను రూ.50 లక్షలు మోసం చేయడంతో పాటు అతనిపై దాడి చేసినట్లు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం ఫిర్యాదుదారు, సినీ దర్శకుడు వెంకట అనీష్ రెడ్డి తన 'మహారాగ్ని' చిత్రానికి నిర్మాతను వెతుకుతున్న సమయంలో జూబ్లీహిల్స్‌లోని సన్‌లిట్ గ్రూప్ కార్యాలయంలో మొహ్సిన్ ఖాన్, తబ్రేజ్‌ను కలిశారు. పెట్టుబడిదారులను పరిచయం చేస్తామని నమ్మించి, 2025 ఆగస్టులో మొహ్సిన్ ఖాన్‌కు రూ.25 లక్షలు చెల్లించినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే ఉద్దేశంతో తబ్రేజ్‌కు కూడా మూడు విడతల్లో మరో రూ.25 లక్షలు చెల్లించినట్లు ఫిర్యాదులో తెలిపారు. అయితే డబ్బు తీసుకున్నప్పటికీ పెట్టుబడిదారులను పరిచయం చేయకపోగా, డబ్బు తిరిగి కోరగా బెదిరింపులకు పాల్పడి దాడి చేసినట్లు ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా జూబ్లీహిల్స్ పోలీసులు మొహ్సిన్ ఖాన్, తబ్రేజ్‌లపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను సేకరిస్తున్నట్లు సమాచారం. కాగా, మొహ్సిన్ ఖాన్ మాజీ పోలీస్ కమిషనర్ ఏకే ఖాన్ కుమారుడు మాత్రమే కాకుండా, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ అల్లుడు కూడా కావడం ఈ వ్యవహారానికి ప్రాధాన్యతను సంతరించుకుంది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.


అంబేద్కర్ అభయ హస్తం సాధన కోసం..

## 27న ఛలో ఢిల్లీ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** అంబేద్కర్ అభయ హస్తం సాధనకై జులై 27న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిస్తున్నామని దళిత గిరిజన వేదిక స్పష్టం చేసింది. గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో వేదిక అధ్యక్షుడు బొంకూరి సురేందర్(సన్ని) తన కార్యవర్గ సభ్యులతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేవెళ్ల, కామారెడ్డిలో ఇచ్చిన డిక్లరేషన్ అమలుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న దళిత, గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై డిక్లరేషన్లను చట్టబద్ధం చేసేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో వేదిక నాయకులు కండెల వెంకటేష్, సినపాటి రజిని, మద్దెల భవాని, కల్లెపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త బిఎల్ఓలను నియమించండి



**ప్రజాపక్షం/కాచిగూడ:** పోలింగ్ బూత్ నెం 200, 205, 211 పరిధిలో బిఎల్‌వో అధికారులు రాకపోవడంతో సర్ ప్రక్రియకు తీవ్ర అంతరాయం కలుగుతుందని బిజెపి నాయకులు ఆరోపించారు. ఈ మేరకు కాచిగూడ డివిజన్‌లోని ఆయా బూత్‌లకు సంబంధించిన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇప్పటివరకు అందకపోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు కన్నె రమేష్ యాదవ్ అంబర్‌పేట్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతి దివాకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

## పోలీసుల తీరుపై ఆగ్రహం



**ప్రజాపక్షం/సంతోష్‌నగర్:** బిఆర్‌ఎస్ నేతల అరెస్ట్ నేపథ్యంలో వారిని కలిసేందుకు కంచన్‌బాగ్ పోలీసులు అనుమతి నిరాకరించడం పట్ల బిఆర్‌ఎస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా మీడియా ప్రతినిధులను సైతం అడ్డుకోవడం విమర్శలకు తావిచ్చింది. ఏకంగా పోలీస్ స్టేషన్ ప్రధాన గేటుకు తాళం వేసి మీడియా సిబ్బందిని లోపలికి అనుమతించకుండా అడ్డుకోవడం జరిగింది. విధులు నిర్వర్తించేందుకు వచ్చిన మీడియాను అడ్డుకోవడం సరైంది కాదని పలువురు మీడియా ప్రతినిధులు అభిప్రాయపడగా ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇదిలాఉండగా.. చర్చకు రమ్మని సవాల్ విసిరి.. చివరికి పోలీసుల మాటున దాక్కోవడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనం అని ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ బిఆర్‌ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు.

## గురుకులాల్లో అవినీతి లేదని చూపండి: జెఎసి చైర్మన్ శ్యామ్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** గురుకులాల్లో జరిగిన అవినీతిపై చర్చిద్దామని వస్తే అరెస్టు చేయడం అన్యాయమని గురుకుల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్ల జేఏసీ చైర్మెన్ మందా శ్యామ్ మండిపడ్డారు. గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో గురుకులాల్లో అవినీతిపై భహిరంగ చర్చకు మేం సిద్ధం అన్న అంశంపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తన కార్యావర్గంతో కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి, మంత్రివర్గం రాష్ట్రంలోని అవినీతిని నిర్మూలించాల్సిందిపోయి అవినీతికి ఆజ్యం పోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 26 ఏళ్ల పాటు వివిధ ప్రభుత్వాల్లో పని చేసిన ఆర్ఎస్ ప్రవీన్కుమార్‌కు రక్షణ తగ్గించి ఎటువంటి ప్రజాప్రతినిధులు కాని రేవంత్‌రెడ్డి సోదరులైన కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డిలకు పటిష్ట సెక్యూరిటీ కల్పించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సమావేశంలో జేఏసీ నాయకులు నర్రా నిర్మల, స్వరూప, అబ్రహం హసన్, పీ. సైదులు, లింగాల అనీల్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



**ప్రజా పక్షం/నల్లకుంట:** తిలక్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను బల్దియా బాస్ కర్ణన్ పంపిణీ చేశారు. సోషల్ వర్కర్ రమణ మాదిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో డిసి మారుతి దివాకర్, సోషల్ వర్కర్ రాధేష్ మాదిరాజు, సిహెచ్ మురళి, భానుమూర్తి, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దెబ్బకు బిఆర్‌ఎస్ నేతలు తోకముడిచారు

కాంగ్రెస్ సీనియర్ నేత
దేవని సతీశ్ విమర్శ



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** గురుకులాల టెండర్‌లపై చర్చకు డప్పు చాటింపు చేసి పిలిచినా బిఆర్‌ఎస్ నేతలు తోకముడిచారని కాంగ్రెస్ సీనియర్ నేత దేవని సతీశ్ మాదిగ విమర్శించారు. గురుకులాల ఈ–టెండర్లు రూ.687 కోట్లు అయితే రూ.2వేల కోట్ల కుంభకోణం జరిగిందని హరీశ్‌రావు ఒకవైపు, రూ.3వేల కోట్ల అవినీతి జరిగిందని ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మరోవైపు సవాళ్లు చేయడాన్ని టిపిసిసి రాష్ట్ర నేతలు దేవని సతీశ్, మానవతారాయ్ ప్రతి సవాల్ చేశారు. గురువారం గన్‌పార్కు అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు హరీశ్‌రావు కోసం మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ ఎదురుచూడగా, ఆయన రాకపోవడంతో వెళ్లిపోయారు. ఆర్ ఎస్.ప్రవీణ్ కుమార్ చర్చకు రావాలని సతీశ్ మాదిగ డప్పు కొట్టి చాటింపు చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీటింగ్‌కే పరిమితం కావొద్దని చర్చకు రావాలన్నారు. అమరవీరుల సాక్షిగా కాంగ్రెస్ దెబ్బకు బిఆర్‌ఎస్ వాళ్లు తోక ముడిచారని సతీశ్ విమర్శించారు.

# వీడిన దోపిడీ కేసు మిస్టరీ


-నలుగురు అరెస్ట్.. పరారీలో ఐదుగురు

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** పద్మారావునగర్‌లోని జ్యోతి మెడికల్ హాల్లో జరిగిన సంచలన సాయుధ దోపిడీ కేసును చిలకలగూడ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, ప్రధాన సూత్రధారి సాయితో పాటు పరారీలో ఉన్న మరో ఐదుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 28న అర్ధరాత్రి దాటిన తర్వాత ముసుగులు ధరించిన దుండగులు కత్తులతో సెక్యూరిటీ గార్డులను బెదిరించి బంధించారు. అనంతరం గ్యాస్ కట్టర్లతో పెంట్ హౌస్ తలుపులు బద్దలు కొట్టి క్యాష్ కౌంటర్‌లోని రూ.27,500లతో పాటు గార్డుల నగదును దోచుకెళ్లారు. బాధితుడు సతీష్‌కుమార్ ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను పట్టుకున్నారు.నిందితులు 15 రోజుల ముందే పక్కా స్కెచ్ వేసి, రెక్కీ నిర్వహించి ఈ దోపిడీకి పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితులు రోహిత్ పాల్, దేవేంద్ర కుమార్, పృథ్వీరాజ్, మహమ్మద్ సల్మాన్లను అరెస్ట్ చేశారు. చాకచక్యంగా కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అనుమానితుల సమాచారాన్ని డయల్ 100కు అందించాలని సికింద్రాబాద్ డీసీపీ రక్షిత సూచించారు.

# పత్తి విత్తనాల పంపిణీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పత్తి సాగు విస్తీర్ణం, ఉత్పాదకత పెంపే లక్ష్యంగా 2026 ఖరీఫ్ సీజన్ నుండి రాష్ట్రంలోని 19 జిల్లాల్లో కేంద్ర ప్రాయోజిత 'పత్తి ఉత్పాదకత మిషన్' అమలు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది.ఈ కార్యక్రమంలో భాగంగా 2026–27 సీజన్ కోసం రైతులకు పత్తి వి త్తనాల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ సంచాలకుల కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, తెలంగాణ రాష్ట్ర విత్తన సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి. గోపి, ఉప సంచాలకులు బి. నరసింహ రావు, సంయుక్త సంచాలకులు ఎస్. బాలు తదితరులు హాజరయ్యారు.విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు రైతులకు అందజేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి. గోపి మాట్లాడుతూ, 2026 నుంచి 2030–31 వరకు కాటన్ మిషన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. హెచ్‌డిపిఎస్, సిఎస్, ఐసిఎం వంటి ఆధునిక సాగు పద్ధతులను ప్రదర్శన క్షేత్రాల ద్వారా రైతులకు పరిచయం చేయనున్నట్లు చెప్పారు. అలాగే వేపనూనె వంటి పర్యావరణ అనుకూల ఇన్‌పుట్స్‌ను రాయితీపై అందించనున్నట్లు పేర్కొన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ పత్తి సాగు ఆధునిక విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కూడా తమ అనుభవాలను పంచుకున్నారు.అధికారులు రైతులు ఈ పథకాన్ని వినియోగించుకుని అధిక ఉత్పాదకత సాధించాలని సూచించారు.

## జలమండలి ఉద్యోగుల పదవీ విరమణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** జలమండలిలో పనిచేస్తున్న 67 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. వారిని గురువారం ఖైరతాబాద్‌లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు.కార్యక్రమంలో పీ అండ్ ఏ సీజీఎం సురేష్, జీఎం సరస్వతి పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐ సృష్టించిన నకిలీ తీర్పులు..
# న్యాయ వ్యవస్థకు ప్రమాదకరం

**'సుప్రీం' హెచ్చరిక**




**న్యూఢిల్లీ:** నకిలీ, ఉనికిలో లేని, ఊహాత్మక సమాచారాన్ని లేదా తీర్పులను ఆధారంగా తీసుకుని కృత్రిమ మేధ (ఎఐ) సృష్టించి ఇచ్చే తీర్పులు న్యాయవ్యవస్థకు అత్యంత ప్రమాదకరమని సుప్రీం కోర్టు హెచ్చరించింది. ఇటువంటి తీర్పులను ఉపయోగించడం 'చట్ట, న్యాయ వ్యవస్థలో మిథైల్ ఐసోసయనేట్ వాయువును విడుదల చేసినంత ప్రమాదకరం' అని వ్యాఖ్యానిస్తూ, ఈ తరహా తీర్పులపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరించాలని స్పష్టం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేస్తూ, ఎస్సెల్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ దివాలా కేసులో జాతీయ కంపెనీ న్యాయ ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)ముంబయి బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ట్రిబ్యునల్ తన తీర్పులో ఎఐ సృష్టించిన, ఉనికిలో లేని న్యాయ తీర్పులను ప్రస్తావించినట్లు సుప్రీం కోర్టు గుర్తించింది. 'నకిలీ, ఉనికిలో లేని, ఎఐ సృష్టించిన కల్పిత తీర్పులను న్యాయపూర్వక ఆధారాలుగా వినియోగించడం చట్టవ్యవస్థలో ప్రమాదకరమైన మిథైల్ ఐసోసయనేట్ వాయువు లీకైనట్టుగా భావించాల్సి ఉంటుంది. అది కనిపించదు, నిశ్శబ్దంగా వ్యాపిస్తుంది. దాని ప్రభావం గుర్తించే సమయానికి భారీ నష్టం జరిగిపోతుంది. ఇది న్యాయ నిర్ణయాల విశ్వసనీయతనే కలుషితం చేయడమే కాకుండా, న్యాయవ్యవస్థకు ప్రాణాధారమైన న్యాయనిర్ణయ ప్రక్రియను దెబ్బతీస్తుంది' అని ధర్మాసనం పేర్కొంది. ఎఐ రూపొందించిన తీర్పులను ధ్రువీకరించకుండా కోర్టులో ప్రస్తావించడం న్యాయవాదుల వృత్తి నైతికతకు విరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. అలాగే, అలాంటి నకిలీ తీర్పులను ఆధారంగా చేసుకుని న్యాయమూర్తులు తీర్పులు ఇవ్వడం కూడా తీవ్రమైన తప్పిదమేనని పేర్కొంది. ఒక తీర్పు రూపకల్పనలో కొద్దిపాటి నకిలీ లేదా కల్పిత సమాచారం చేరినా, అది న్యాయ ప్రక్రియ పవిత్రతను దెబ్బతీస్తుందని, అలాంటి తీర్పు చట్టం దృష్టిలో చెల్లదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయపరమైన నిర్ణయాల్లో సమగ్రత, విశ్వసనీయత అత్యంత కీలకమని పేర్కొన్న ధర్మాసనం, ఎఐని న్యాయవ్యవస్థకు సహాయక సాధనంగా వినియోగించడాన్ని తాము వ్యతిరేకించడం లేదని స్పష్టం చేసింది. అయితే, ఎఐ సృష్టించిన సమాచారాన్ని ధ్రువీకరించకుండా కోర్టు తీర్పులుగా చూపడం లేదా వాటిపై ఆధారపడడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని తెలిపింది. న్యాయ నిర్ణయాల ప్రతి దశలో తుది నియంత్రణ మానవుల చేతుల్లోనే ఉండాలని స్పష్టం చేసింది. కేవలం హెచ్చరికలు జారీ చేయడం సరిపోదని, బాధ్యతను నిర్ధారించే చర్యలు కూడా అవసరమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో, న్యాయవాదులు ఎఐ సృష్టించిన నకిలీ తీర్పులను కోర్టుల్లో సమర్పించే ఘటనలను నివారించేందుకు అవసరమైన మార్గదర్శకాలు రూపొందించాలని భారత బార్ కౌన్సిల్ (బిసిఐ)ని ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ఇటువంటి ఉల్లంఘనలకు తగిన క్రమశిక్షణ చర్యలు ఏమిటో నిర్ధారించాలని సూచించింది. ఈ కేసు పూజా రమేష్ సింగ్, జమ్మూ అండ్ కాశ్మీర్ బ్యాంక్, ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ మధ్య దివాలా వివాదానికి సంబంధించినది. ఎన్‌సిఎల్‌టి తన తీర్పుకు ఆధారంగా పేర్కొన్న పలు సుప్రీంకోర్టు తీర్పులు అసలు ఉనికిలోనే లేవని సుప్రీంకోర్టు గుర్తించింది. ఉదాహరణకు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ వర్సెస్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రియల్ ఎస్టేట్ లిమిటెడ్ (2019) 16 ఎస్‌సిసి 528, సర్బజిత్ సింగ్ వర్సెస్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (2022) 7 ఎస్‌సిసి 464 వంటి కేసులను ట్రిబ్యునల్ ప్రస్తావించినప్పటికీ, అవి పూర్తిగా కల్పితమైనవని తేలింది. ఈ తీర్పులను తమ న్యాయవాది సమర్పించలేదని, ట్రిబ్యునల్ స్వయంగా చేసిన పరిశోధనలో అవి చేర్చారని జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంక్ వివరణ ఇచ్చింది. అయినప్పటికీ, తప్పు ఎక్కడ జరిగినా అది న్యాయపాలనకు తీవ్ర నష్టం కలిగిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంటూ, న్యాయవ్యవస్థలో ఎఐ వినియోగం అత్యంత జాగ్రత్తతో, కచ్చితమైన మానవ పర్యవేక్షణతో మాత్రమే కొనసాగాలని స్పష్టం చేసింది.

### బిహార్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లో మూడు అసెంబ్లీ స్థానాలకు
## ఈనెల 30న ఉప ఎన్నికలు

**న్యూఢిల్లీ:** బిహార్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో ఖాళీ అయిన మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈనెల 30న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. బిహార్‌లోని బంకిపూర్, మధ్యప్రదేశ్‌లోని దతియా, గుజరాత్‌లోని మంజల్పూర్ అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. బిహార్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నితిన్ నబిన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో బంకిపూర్ స్థానం ఖాళీ అయింది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేంద్ర భారతి మోసం కేసులో దోషిగా తేలడంతో ఆయనను అనర్హుడిగా ప్రకటించడంతో దతియా స్థానానికి ఉప ఎన్నిక అవసరమైంది. గుజరాత్‌లో బిజెపి ఎమ్మెల్యే యోగేష్‌భాయ్ నరందాస్ పటేల్ మృతితో మంజల్పూర్ నియోజకవర్గం ఖాళీ అయింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, ఈనెల 6న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. నామినేషన్ల దాఖలుకు జూలై 13 చివరి తేదీ కాగా, 14న నామినేషన్ పత్రాల పరిశీలన నిర్వహిస్తారు. అభ్యర్థిత్వాల ఉపసంహరణకు 16 వరకు గడువు ఉంటుంది. పోలింగ్ 30న జరగగా, ఓట్ల లెక్కింపు ఆగస్టు 3న చేపట్టనున్నారు. ఉప ఎన్నికలు జరగనున్న నియోజకవర్గాలు ఉన్న జిల్లాల్లో వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వచ్చినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎంలు), వివిప్యాట్ యంత్రాలను ఉపయోగిస్తామని పేర్కొంది. అలాగే, క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులు, వారికి టికెట్లు ఇచ్చిన రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆ వివరాలను పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు, తమ అధికారిక వెబ్‌సైట్లలో తప్పనిసరిగా ప్రచురించాలని ఎన్నికల సంఘం మరోసారి స్పష్టం చేసింది.




## భారత్ –జపాన్ సంబంధాలకు కొత్త ఊపు

**ఆర్థిక భాగస్వామ్యం, రక్షణ రంగంలో కీలక ఒప్పందాలు**



**న్యూఢిల్లీ:** భారత్–జపాన్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఇరు దేశాలు పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయే తకైచి మధ్య న్యూఢిల్లీలో జరిగిన 16వ భారత్–జపాన్ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ఆర్థిక భాగస్వామ్యం, రక్షణ సహకారం, కృత్రిమ మేధ (ఎఐ), ఇంధన భద్రత, అత్యాధునిక సాంకేతికత వంటి రంగాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక భద్రతకు సంబంధించిన ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక, కృత్రిమ మేధలో సహకారంపై సంయుక్త ప్రకటన, ఇంధన సరఫరా గొలుసును బలోపేతం చేసే ఒప్పందాలతో పాటు, ఇరు దేశాలు తొలిసారిగా సైనిక పరికరాల సంయుక్త అభివృద్ధికి సంబంధించిన రక్షణ ఒప్పందంపై కూడా సంతకాలు చేశాయి. సెమీకండక్టర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, ఆధునిక పదార్థాల తయారీ వంటి వ్యూహాత్మక రంగాల్లో సరఫరా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. సమావేశం అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ, భారత్, జపాన్ ఆర్థిక వ్యవస్థలు ఒకదానికొకటి పరస్పరపూరకంగా ఉన్నాయని చెప్పారు. సంస్కృతి నుంచి ఆధునిక సాంకేతికత వరకు ఇరు దేశాల ఆలోచనా విధానంలో సారూప్యత ఉందని, పరస్పర విశ్వాసమే ఈ భాగస్వామ్యానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ఇంధన భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ 'భారత్–జపాన్ బయోగ్యాస్ ఇనిషియేటివ్' కింద దేశంలో వెయ్యి బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మోదీ ప్రకటించారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ఊతం లభిస్తుందని చెప్పారు. అలాగే జపాన్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, భారత సాఫ్ట్‌వేర్ సామర్థ్యాలు కలిస్తే కృత్రిమ మేధ రంగంలో విశేష పురోగతి సాధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. జపాన్ ప్రధాని సనాయే తకైచి మాట్లాడుతూ, పెట్టుబడులు, ఆవిష్కరణల ద్వారా ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడంపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. 17 వ్యూహాత్మక రంగాల్లో పెట్టుబడుల ద్వారా జపాన్ సరఫరా వ్యవస్థ, సాంకేతిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని ప్రధాని మోదీ ముందుకు తీసుకెళ్తున్నారని, భవిష్యత్ పెట్టుబడుల ద్వారా రెండు దేశాలను మరింత బలంగా, సంపన్నంగా తీర్చిదిద్దాలన్న ఉమ్మడి సంకల్పం తమకు ఉందని ఆమె పేర్కొన్నారు. కాగా, మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా గురువారం రాష్ట్రపతి భవన్‌లో సనాయే తకైచికి ఘనంగా అధికారిక స్వాగతం లభించింది. ప్రధాని మోదీ సమక్షంలో మూడు సైనిక దళాల గౌరవ వందనం స్వీకరించిన ఆమె, అనంతరం విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో పాటు కేంద్ర మంత్రులను కలుసుకున్నారు. ఈ పర్యటన భారత్–జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక మైలురాయిగా భావిస్తున్నారు.

## మోసాలు, నకిలీ ఖాతాల నివారణకు
# పలు భద్రతా చర్యలు

**వాట్సాప్‌లో యూజర్‌నేమ్ ఫీచర్‌పై స్పష్టతనిచ్చిన 'మెటా'**



**న్యూఢిల్లీ:** వాట్సాప్‌లో త్వరలో అందుబాటులోకి రానున్న 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై తలెత్తిన వివాదాల నేపథ్యంలో మెటా సంస్థ కీలక వివరణ ఇచ్చింది. ఈ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ మొబైల్ నంబర్‌ను వెల్లడించకుండా ప్రత్యేక యూజర్‌నేమ్ ద్వారా ఇతరులతో అనుసంధానం కావచ్చు. అయితే ఈ ఫీచర్ కారణంగా నకిలీ ఖాతాలు, మోసాలు, ప్రముఖుల పేర్ల దుర్వినియోగం పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల మెటాకు నోటీసు జారీ చేసింది. ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు ఈ ఫీచర్‌ను అమలు చేయవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో వాట్సాప్ సమగ్రంగా తరచుగా అడిగే ప్రశ్నలు (ఎఫ్ఎక్యూ) జాబితాను విడుదల చేస్తూ భద్రతా అంశాలపై స్పష్టత ఇచ్చింది. యూజర్‌నేమ్‌ను తప్పనిసరిగా ఉపయోగించాల్సిన అవసరం లేదని, ఇది పూర్తిగా ఐచ్ఛికమని సంస్థ తెలిపింది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న మొబైల్ నంబర్ ఆధారిత విధానంలో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొంది. వాట్సాప్ వివరణ ప్రకారం, యూజర్‌నేమ్‌లను ఎవరైనా యథేచ్ఛగా వెతికి కనుగొనే అవకాశం ఉండదు. ఫోన్ నంబర్‌ను ఎలా సెర్చ్ చేయలేమో, అదే విధంగా యూజర్‌నేమ్‌ను కూడా అపరిచితులు నేరుగా శోధించలేరు. అంతేకాకుండా వినియోగదారులు కోరుకుంటే 'యూజర్‌నేమ్ కీ' అనే అదనపు భద్రతా సదుపాయాన్ని కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ విధానంలో ఎవరైనా సంప్రదించాలంటే యూజర్‌నేమ్‌తో పాటు ఆ ప్రత్యేక 'కీ' కూడా తెలుసుకుని ఉండాలి. అవసరమైతే ఈ 'కీ'ని ఎప్పుడైనా మార్చుకునే అవకాశం కూడా ఉంటుంది. ప్రముఖులు, సినీ తారలు, ప్రభుత్వ సంస్థలు, మెటా ధ్రువీకరించిన ఖాతాల పేర్లను ముందుగానే రిజర్వ్ చేసినట్లు వాట్సాప్ వెల్లడించింది. దీంతో ఆ పేర్లను సంబంధిత అసలు యజమానులు మాత్రమే పొందగలుగుతారు. ఎవరైనా ప్రముఖుల పేర్లతో నకిలీ యూజర్‌నేమ్‌లు సృష్టించే అవకాశాన్ని ఈ విధానం ద్వారా గణనీయంగా తగ్గించవచ్చని సంస్థ తెలిపింది. అలాగే ఇన్‌స్టాగ్రామ్ లేదా ఫేస్‌బుక్ ఖాతాలను వాట్సాప్‌తో అనుసంధానం చేసే వినియోగదారులు, అదే పేరుతో యూజర్‌నేమ్‌ను పొందే అవకాశం ఉంటుంది. ఇది అసలు ఖాతా యజమానిని గుర్తించడంలో సహాయపడుతుందని, అనంతరం కావాలనుకుంటే ఆ ఖాతాల అనుసంధానాన్ని తొలగించుకోవచ్చని సంస్థ పేర్కొంది. యూజర్‌నేమ్‌ల ద్వారా సందేశాల సేవ ప్రారంభమైన తర్వాత, కొత్త వ్యక్తి నుంచి సందేశం వచ్చినప్పుడు ఆ ఖాతా ఏ దేశానికి చెంది?, అది కొత్త ఖాతానా?, ఉమ్మడి గ్రూపులు ఉన్నాయా? వంటి వివరాలతో పాటు ప్రత్యేక హెచ్చరికలు కూడా వినియోగదారులకు చూపిస్తామని వాట్సాప్ వెల్లడించింది. అనుమానాస్పద ఖాతాలను బ్లాక్ చేయడం, ఫిర్యాదు చేయడం వంటి ప్రస్తుత భద్రతా సదుపాయాలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపింది. ఇటీవల ప్రముఖుల పేర్లను ముందుగానే డబ్బు చెల్లించి రిజర్వ్ చేసుకోవచ్చని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని వాట్సాప్ పూర్తిగా ఖండించింది. అలాంటి ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, ప్రసిద్ధ వ్యక్తులు లేదా సంస్థల పేర్లను సంబంధిత చట్టబద్ధమైన యజమానులు మాత్రమే పొందగలరని స్పష్టం చేసింది. ఈ ఏడాది చివర్లో యూజర్‌నేమ్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ యోచిస్తోంది. అయితే వినియోగదారుల అభిప్రాయాలు, ప్రభుత్వ సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ దశలవారీగా అమలు చేస్తామని మెటా వెల్లడించింది. దీంతో ఫోన్ నంబర్‌ను పంచుకోకుండా వాట్సాప్ వినియోగించే అవకాశం లభించనున్నప్పటికీ, మోసాలు, వ్యక్తిత్వ దొంగతనం వంటి ప్రమాదాలను నివారించేందుకు పలు రక్షణ వ్యవస్థలను ఒకేసారి అమలు చేయనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది.

## ఉద్యమం మరింత ఉద్ధృతికి...
# 'కాక్‌రోచ్‌లతో చాయ్ పే చర్చ' షురూ

**ప్రారంభించిన సిజెపి చీఫ్ అభిజీత్ దిప్కే**
**60కి పడిపోయిన ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ షుగర్ లెవల్స్**





**న్యూఢిల్లీ :** 'నీట్' సహా పలు పరీక్షా నిర్వహణ విధానాలలో అక్రమాలను ఆక్షేపిస్తూ కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి) దేశరాజధాని ఢిల్లీలో చేస్తున్న నిరసన దీక్ష కేంద్రంలోని బిజెపి సర్కార్ ప్రతిష్ఠను దెబ్బతీస్తోంది. కాగా, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 5వరోజైన గురువారం కొనసాగుతున్న నిరాహారదీక్షలో ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ రక్తంలో చక్కెర స్థాయి 60కి పడిపోగా, ఆయన బ్లడ్ ప్రెషర్ (బిపి) తక్కువగా నమోదు అయ్యింది. మరొకవైపు 13వ రోజుకు చేరుకున్న ఈ ఉద్యమాన్ని మరింత విస్తరించే అంశంపై నిరసనకారుల అభిప్రాయాలను సేకరించేందుకు కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే 'కాక్‌రోచ్‌లతో చాయ్ పే చర్చ' అనే కార్యక్రమాన్ని ప్రకటించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిని పంచుకుంటూ, ఆయన పరిస్థితి విషమిస్తోందని, ఒకవేళ సోనమ్‌వాంగ్‌చుక్‌కు ఏమైనా జరిగితే ప్రభుత్వమే అందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని అభిజీత్ దిప్కే హెచ్చరించారు. 'సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం నిరంతరం క్షీణిస్తోంది. ఆయన షుగర్ లెవల్ 60కి పడిపోయింది. రక్తపోటు కూడా చాలా తక్కువగా ఉంది. సోనమ్ వాంగ్‌చుక్ సార్‌కు ఏమైనా జరిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది'అని దిప్కే 'ఎక్స్'లో షేర్ చేసిన ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తన డిమాండ్‌ను సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే పునరుద్ఘాటించారు. 'ఈ ఉద్యమాన్ని మరింత మెరుగ్గా, పెద్దదిగా ఎలా చేయగలం' అనే దానిపై అభిప్రాయాలు సేకరించడమే లక్ష్యంగా దిప్కే నిరసనకారులతో 'కాక్‌రోచ్‌లతో చాయ్ పే చర్చ'అనే పేరుతో నిరసనకారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్ఎ)కు చెందిన ఆరుగురు విద్యార్థులు కూడా నిరసన స్థలంలోని వేరొక వేదిక నుంచి తమ నిరవధిక నిరాహారదీక్షను కొనసాగించారు. ఒకరోజు ముందు, నిరాహారదీక్ష చేస్తున్న విద్యార్థుల ఆరోగ్యం క్షీణిస్తోందని, ఎఐఎస్ఎ తెలిపింది. జెఎన్‌యుఎస్‌యు సంయుక్త కార్యదర్శి డానిష్ రక్తంలో చక్కెర స్థాయి 61 ఎంజి/డిఎల్‌కు పడిపోయిందని, అలాగే ఆరోగ్య సమస్యల కారణంగా అమీన్, దీపక్ వర్మలను కూడా నిరహారదీక్షలను కొనసాగించవద్దని డాక్టర్లు సలహా ఇచ్చారని వెల్లడించింది. ఆందోళనకు సంఘీభావం తెలియజేసేందుకు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జనరల్ సెక్రటరీ దీపాంకర్ భట్టాచార్య గురువారం సాయంత్రం నిరసన ప్రదేశాన్ని సందర్శించనున్నారు. ఈ నిరసనకు పలువురు రాజకీయ నాయకుల మద్దతు లభించింది. గత కొద్దిరోజులుగా పౌర సమాజ సభ్యులు కూడా ఈ ప్రదేశాన్ని సందర్శించారు. సందర్శించిన వారిలో సిపిఐ(ఎం) ప్రధానకార్యదర్శి ఎం.ఎ.బేబి, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు బృందా కరత్, సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా, , సిపిఐ నాయకురాలు అన్నీరాజా, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు లాయర్ ప్రశాంత్ భూషణ్, పారదర్శకత కార్యకర్త అంజలి భరద్వాజ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సాగరిక ఘోష్ తదితరులు ఉన్నారు. నీట్‌తో సహా పరీక్షా విధానంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ జూన్ 20న కాక్‌రోచ్ జనతా పార్టీ తన నిరసనను ప్రారంభించింది. ఓటర్ల జాబితాలల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) వంటి ఎన్నికల అంశాలతో సహా జవాబుదారీతనం, సంబంధిత ఇతర సమస్యలను కూడా ఈ ఆందోళన లేవనెత్తుతున్నదని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే చెప్పారు.

## రామ మందిరం విరాళాల దుర్వినియోగం...
# 'చందా చోరీ మెగా స్కాండల్'

**కాంగ్రెస్ తీవ్రస్థాయి ఆరోపణ**
**'సుప్రీం' విచారణ జరగాలని ప్రధాని మోదీకి కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కెసి. వేణుగోపాల్ లేఖ**



**న్యూఢిల్లీ :** అయోధ్య రామ మందిరం విరాళాల దుర్వినియోగంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో ఆరోపణలు సంధించింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కెసి.వేణుగోపాల్ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి గురువారం ఒక లేఖ రాస్తూ రామ మందిరం విరాళాల దుర్వినియోగంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో తక్షణమే విచారణ జరపాలని వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ దుర్వినియోగాన్ని ఆయన 'చందా చోరీ మెగా స్కాండల్' గా అభివర్ణించారు. తన లేఖలో వేణుగోపాల్ మాట్లాడుతూ, వందల కోట్ల ఆరోపణలతో కూడిన 'ఈ స్థాయి మోసం హిందూ విశ్వాసం, మతం, జీవనవిధానానికి భారీ ద్రోహం' అని ఆరోపించారు. శ్రీరాముడు న్యాయానికి, ధర్మానికి ప్రతిరూపంగా పూజించబడతాడని, ఇటువంటి ఆరోపణలను నిష్పక్షపాతంగా విచారించకుండా వాటిని కప్పిపుచ్చడానికి అనుమతించడం, ఆయన భక్తులకు, ఆయన ప్రతిబింబించే విలువలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కెసి.వేణుగోపాల్ అన్నారు. 'అయోధ్యలోని రామ మందిరంలో జరిగిన భారీ ఆర్థిక మోసం, దొంగతనం, విరాళాల దుర్వినియోగం వంటి దిగ్భ్రాంతికరమైన విషయాలు బయటపడ్డాయి. దీంతో లక్షలాది మంది భారతీయులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆవేదనపై ఆగ్రహం వ్యక్తం చేయడానికి నేను మీకు లేఖ రాస్తున్నాను' అని వేణుగోపాల్ పేర్కొన్నారు. శ్రీరాముడిపై ప్రగాఢ విశ్వాసం, భక్తితో తమ కష్టార్జితాన్ని, జీవిత పొదుపును అర్పించిన సాధారణ పౌరులు సమర్పించిన కానుకలను సిగ్గులేకుండా దోచుకున్నారని, ఇది లక్షలాదిమంది పవిత్రంగా భావించే స్థలం పవిత్రతను దెబ్బతీసిందని సీనియర్ కాంగ్రెస్ నేత కెసి.వేణుగోపాల్ మండిపడ్డారు. పార్లమెంట్‌లోని కీలక పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి హెడ్‌గా ఉన్న కెసి.వేణుగోపాల్ శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కళ్లముందే ఒక అత్యంత వ్యవస్థీకృతమైన రాకెట్ పనిచేస్తోందని, కొనసాగుతున్న ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందన్నారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన తన లేఖను షేరింగ్ చేస్తూ అయోధ్య రామ మందిరం వద్ద జరిగిన 'భారీ చందా చోరీ' దేశాన్ని కుదిపేసిందని తెలియజేశారు.

**రామ మందిరం విరాళాల చోరీ కేసులో నిందితుడి భార్యకూ నోటీసు జారీ**

రామ మందిరం దొంగతనం కేసులో నిందితుడైన లవకుష్ మిశ్రా భార్యపేరు మీద అనధికారంగా ఇల్లు కట్టుకున్నారనే ఆరోపణలపై అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ (ఎడిఎ) ఆమెకు నోటీసు జారీచేసిందని, ఈ ఆరోపిత నిధుల దుర్వినియోగం కేసులో పోలీసులు తమ దర్యాప్తును ముమ్మరం చేసిన నేపథ్యంలో ఈ నోటీసు జారీ చేసినట్లు గురువారం అధికారులు, పోలీసువర్గాలు తెలిపాయి. ఎడిఎ వర్గాల సమాచారం ప్రకారం, నిర్మాణంలో ఉన్నటువంటి ఇల్లు సోహావల్ తహసీల్‌లోని బన్విర్‌పూర్ గ్రామంలో ఉంది. ఆ భూమిని లవకుష్ మిశ్రా భార్య సుప్రియా మిశ్రా పేరుమీద కొనుగోలు చేయబడి ఉంది. అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి తప్పనిసరి అనుమతి పొందకుండానే ఇల్లు నిర్మాణం చేపట్టారు. కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, దర్యాప్తు అధికారులు బుధవారం లవకుష్ మిశ్రా నివాసంలో కూడా సోదాలు జరిపి, అతని కుటుంబ సభ్యులను ప్రశ్నించారని పోలీస్ వర్గాలు తెలిపాయి.రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు జూన్ 7న వెలుగులోకి వచ్చాయి.

**ట్రస్ట్ నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని న్యాయవాదుల నిరసన**

అయోధ్య రామ మందిరం విరాళాల నిధులను దుర్వినియోగం చేసిన ట్రస్ట్ నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫైజాబాద్ బార్ అసోసియేషన్ నాయకులు గురువారం ఇక్కడ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ఆరోపణలపై రామ మందిరం ట్రస్ట్ ప్రధానకార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా, గోపాల్ రావులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ లాయర్లు పోలీసులకు ఫిర్యాదుచేశారు.ఈ కేసులో మొదటి ఎఫ్ఐఆర్‌లో ఫిర్యాదుదారైన మరో ట్రస్టీ కృష్ణమోహన్‌ను కూడా న్యాయవాదులు పోలీసులకు చేసిన ఫిర్యాదులో నిందితుడిగా పేర్కొన్నట్లు ఫైజాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కలికా ప్రసాద్ మిశ్రా తెలిపారు. న్యాయవాదులు తమ ఫిర్యాదును సమర్పించే ముందు, కేసు నమోదు చేసి ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ కోర్టు ప్రాంగణం నుంచి ఇక్కడి రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్ వరకూ ప్రదర్శనగా వెళ్లారు. ప్రదర్శన సందర్భంగా పోలీసు సిబ్బంది లాయర్ల గుంపును అదుపుచేయడానికి చాలా కష్టపడ్డారు. ఈ తోపులాటలో తమకు స్వల్పగాయాలయ్యాయని కొందరు న్యాయవాదులు ఆరోపించారు.


**విరాళాల దుర్వినియోగంపై ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలి : కేజ్రీవాల్**

అయోధ్యలోని రామ మందిరం విరాళాల దుర్వినియోగం కేసుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ వివరణ ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కోరారు. ఈ కేసులో కేవలం 'పావులను' మాత్రమే అరెస్ట్ చేశారని, ఇందులో భాగస్వాములైన శక్తివంతమైన వ్యక్తులను మాత్రం రక్షిస్తున్నారని ఆయన ఆరోపించారు. గురువారం కేజ్రీవాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భూమి కొనుగోలు, ఆలయ నిర్మాణం, భక్తులు సమర్పించిన విరాళాల విషయంలో భారీగా అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రైవేట్ వ్యక్తులు రూ.14కోట్ల విలువైన ప్రైవేట్ భూమిని రూ.95కోట్లకు ఆలయ ట్రస్ట్‌కు విక్రయించారని, అలాగే నిర్మాణ పనులలో లోపాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయని కేజ్రీవాల్ వివరించారు.

## మాజీ న్యాయమూర్తి గౌతమ్ పటేల్‌కు బెదిరింపులు

**దర్యాప్తు నివేదికలు గోప్యంగా ఉంచాలని బాంబే హైకోర్టు ఆదేశం**





**ముంబయి:** దావూదీ బొహ్రా వారసత్వ వివాదంపై 2024లో ఇచ్చిన తీర్పు అనంతరం, హత్య చేస్తామంటూ మాజీ న్యాయమూర్తి గౌతమ్ పటేల్, ఆయన కుటుంబ సభ్యులకు వస్తున్న బెదిరింపుల కేసులో ముంబయి పోలీసులు సమర్పించిన దర్యాప్తు నివేదికలను గోప్యంగా ఉంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని బాంబే హైకోర్టు ఆదేశించింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర ఘుగే, జస్టిస్ గౌతమ్ అంఖాద్‌లతో కూడిన బాంబే హైకోర్టు కోర్టు ధర్మాసనం విచారణ సందర్భంగా, దర్యాప్తుకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయడం సమంజసం కాదని పేర్కొంది. 2008 నవంబర్ 26 ముంబయి ఉగ్రదాడుల సమయంలో దర్యాప్తు వివరాలు విస్తృతంగా ప్రసారమవడంతో విచారణకు ఆటంకం ఏర్పడిందని గుర్తు చేస్తూ, అలాంటి పరిస్థితి మళ్లీ తలెత్తకూడదని వ్యాఖ్యానించింది. ముంబయి పోలీసు కమిషనర్ సమర్పించిన నివేదిక ప్రకారం, జస్టిస్ పటేల్, ఆయన కుటుంబ సభ్యులకు వచ్చిన బెదిరింపులపై రెండు నాన్‌కాగ్నిజబుల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మరోవైపు, లండన్‌లో జస్టిస్ పటేల్ కుటుంబానికి కల్పించిన భద్రత, ఆయన కుమార్తెపై జరిగిన భౌతిక దాడికి సంబంధించి తీసుకున్న చర్యలను విదేశాంగ మంత్రిత్వ శాఖ హైకోర్టుకు వివరించింది. తదుపరి పురోగతి నివేదికను వచ్చే నెల సమర్పించాలని ఆదేశిస్తూ కేసు విచారణను ఆగస్టు 7కు వాయిదా వేసింది. కాగా, గత పది నెలలుగా జస్టిస్ పటేల్ కుటుంబానికి బెదిరింపు లేఖలు వస్తున్నాయి. ఇటీవల వచ్చిన లేఖలో కుటుంబ సభ్యులను హత్య చేసేందుకు 'కాంట్రాక్ట్' ఇచ్చినట్లు హెచ్చరించడమే కాకుండా, ఒక డిజిటల్ స్టోరేజ్ పరికరాన్ని కూడా పంపించారు. దానిని లండన్ పోలీసులకు అప్పగించారు. అలాగే, తన తీర్పుకు క్షమాపణ చెబుతూ, ఒత్తిడిలో ఆ తీర్పు ఇచ్చినట్లు పేర్కొంటూ యూట్యూబ్‌లో వీడియో విడుదల చేయాలని దుండగులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ముగ్గురు న్యాయవాదుల సంఘాలు ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేయగా, అప్పటి నుంచి జస్టిస్ పటేల్ కుటుంబానికి పోలీసు రక్షణ కల్పిస్తున్నారు.

# కీవ్‌పై రష్యా భారీ క్షిపణి, డ్రోన్ దాడులు

## 17 మంది మృతి, 90 మందికిపైగా గాయాలు



**కీవ్:** ఉక్రేన్ రాజధాని కీవ్‌పై రష్యా గురువారం తెల్లవారుజామున భారీ స్థాయిలో క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో కనీసం 17 మంది పౌరులు మృతి చెందగా, 90 మందికి పైగా గాయపడ్డారని కీవ్ మేయర్ విటాలీ క్లిచ్కో తెలిపారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండే అవకాశం ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. దాడులు ప్రారంభమైన వెంటనే నగరమంతా భారీ పేలుళ్లతో మార్మోగింది. అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీతో పాటు అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో వేలాది మంది ప్రజలు మెట్రో స్టేషన్లలో ఆశ్రయం పొందారు. పలు నివాస భవనాలు కూలిపోగా, అగ్నిప్రమాదాలు సంభవించాయి. దాదాపు 30 ప్రాంతాల్లో నష్టం వాటిల్లగా, 20కి పైగా నివాస భవనాలు దెబ్బతిన్నాయి. అత్యవసర సిబ్బంది శిథిలాలను తొలగిస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకారం, ఈ దాడి ఉక్రేన్ ఇటీవల రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన మౌలిక వసతులపై జరిపిన దీర్ఘ శ్రేణి దాడులకు ప్రతీకారంగా చేపట్టిన చర్య. దాడుల్లో సైనిక పరిశ్రమలు, ఇంధన కేంద్రాలు, వైమానిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని రష్యా ప్రకటించింది. ఉక్రేన్ వైమానిక దళం తెలిపిన వివరాల ప్రకారం, రష్యా మొత్తం 74 క్షిపణులు, వాటిలో 24 బాలిస్టిక్ క్షిపణులు, అలాగే 496 డ్రోన్లను ప్రయోగించింది. బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోవడం కష్టమని, మరిన్ని పేట్రియట్ క్షిపణి రక్షణ వ్యవస్థలను అందించాలని ఉక్రేన్ మరోసారి పాశ్చాత్య దేశాలను కోరింది. ఉక్రేన్ విదేశాంగ మంత్రి ఆంద్రీ సిబిహా ఈ ఘటనను 'భయానక రాత్రి'గా అభివర్ణిస్తూ, రష్యా చర్యలను ఖండించారు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని ఆర్టికల్ 51 ప్రకారం ఉక్రేన్ తన ఆత్మరక్షణ హక్కును వినియోగిస్తోందని, రష్యా మాత్రం దురాక్రమణదారుగానే వ్యవహరిస్తోందని అన్నారు. మరోవైపు, ఉక్రేన్ కూడా రష్యాపై తన దాడులను కొనసాగించింది. మాస్కోకు తూర్పున ఉన్న నిజ్నీ నోవ్‌గొరాడ్ ప్రాంతంలోని రష్యా అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో ఒకదానిపై డ్రోన్ దాడి జరిపినట్లు ఉక్రేన్ జనరల్ స్టాఫ్ వెల్లడించింది. అలాగే రష్యా ఆక్రమిత లుహాన్స్క్ ప్రాంతంలో సైనిక సరఫరాలకు ఉపయోగిస్తున్న కీలక రైల్వే వంతెనను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. పాశ్చాత్య విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఇటీవలి నెలల్లో ఉక్రేన్ చేపడుతున్న డ్రోన్ దాడులు రష్యా సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తూ యుద్ధ గమనాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈ ఏడాది వేసవి దాడుల్లో రష్యా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేకపోయిందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# అమెరికా–ఇరాన్ చర్చల్లో సానుకూల పురోగతి

## పాకిస్థాన్ వెల్లడి



**ఇస్లామాబాద్:** అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న దౌత్య చర్చల్లో సానుకూల పురోగతి నమోదైనట్లు పాకిస్థాన్ గురువారం ప్రకటించింది. ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంలో దోహాలో అమెరికా, ఇరాన్ ప్రతినిధులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించగా, ఇస్లామాబాద్ అవగాహన ఒప్పందం (ఎంఒయు) అమలుకు సంబంధించిన పలు అంశాలపై పురోగతి సాధించినట్లు పాకిస్థాన్ విదేశాంగ శాఖ వెల్లడించింది. పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణ లక్ష్యంగా అమెరికా, ఇరాన్ దేశాలు జూన్ 18న అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. అనంతరం జూన్ 21న స్విట్జర్లాండ్‌లోని లూసెర్న్ సరస్సు సదస్సు అనంతరం సాంకేతిక స్థాయి చర్చలు జరిగాయి. ఈ చర్చలకు పాకిస్థాన్, ఖతార్ మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నాయి. దోహాలో జరిగిన తాజా సమావేశాల్లో ఒప్పందంలోని వివిధ అంశాలపై ఇరు పక్షా లు నిర్మాణాత్మకంగా చర్చించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. తదుపరి విడత చర్చల తేదీని ప్రకటించనప్పటికీ, ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు పూర్తయిన వెంటనే మళ్లీ సమావేశం కావాలని అమెరికా, ఇరాన్ అంగీకరించినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 28న టెహ్రాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త వైమానిక దాడుల తొలి రోజున ఖమేనీ మరణించారు. ఆయన అంత్యక్రియలు జూలై 5, 6, 7 తేదీల్లో టెహ్రాన్, ఖోమ్ నగరాల్లో నిర్వహించగా, తుది ఖననం జూలై 9న మష్హద్‌లో జరగనుంది. పాకిస్థాన్ విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రకటనను ఖతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి కూడా ధ్రువీకరించారు. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇరు దేశాల మధ్య సంభాషణ కొనసాగించేందుకు పాకిస్థాన్, ఖతార్ కీలక మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నాయి.

## బలవంతపు దత్తతలపై

# బ్రిటన్ క్షమాపణ

**లండన్:** వివాహం కాని మహిళల నుంచి బలవంతంగా శిశువులను వేరు చేసి దత్తతకు ఇచ్చిన దశాబ్దాల నాటి ప్రభుత్వ విధానానికి సంబంధించి బ్రిటన్ ప్రభుత్వం అధికారికంగా క్షమాపణ చెప్పింది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ పార్లమెంట్ దిగువ సభ (హౌస్ ఆఫ్ కామన్స్)లో క్షమాపణ కోరుతూ ఒక ప్రకటన చేశారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ సంస్థలు పోషించిన పాత్రను అంగీకరించి బాధితులకు క్షమాపణలు చెప్తున్నట్టు పేర్కొన్నారు. 1949 నుంచి 1976 మధ్య ఇంగ్లండ వేల్స్ ప్రాంతాల్లో వివాహం కాని మహిళలకు జన్మించిన సుమారు 1.85 లక్షల మంది శిశువులను దత్తతకు ఇచ్చినట్లు అంచనా. ఆ కాలంలో సామాజిక అపవాదు, మతపరమైన ఆచారాలు, ప్రభుత్వ విధానాల కారణంగా అవివాహిత గర్భిణులను ప్రత్యేక సంస్థల్లో ఉంచి, మానసిక ఒత్తిడి, బెదిరింపులు, మోసాల ద్వారా వారి శిశువులను దత్తతకు అప్పగించేలా చేశారని బాధితులు ఎన్నో సంవత్సరాలుగా ఆరోపిస్తున్నారు. 1966లో 17 ఏళ్ల వయస్సులో తన బిడ్డను కోల్పోయిన మాజీ ఆరోగ్య శాఖ మంత్రి ఆన్ కీన్ మాట్లాడుతూ, ఈ క్షమాపణ తమపై మోపిన అవమాన ముద్రను తొలగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'మేము మా పిల్లలను స్వచ్ఛందంగా వదులుకోలేదు. మమ్మల్ని బలవంతపెట్టారు. ఈ క్షమాపణతో జరిగిన అన్యాయాన్ని కొంతవరకు సరిదిద్దే అవకాశం వచ్చింది' అని ఆమె పేర్కొన్నారు. 2022లో బ్రిటన్ పార్లమెంట్ సంయుక్త మానవ హక్కుల కమిటీ కూడా బాధిత మహిళలను అవాంఛిత దత్తతలకు బలవంతం చేసిన ప్రభుత్వ సంస్థలు, అధికారుల చర్యలపై ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని సిఫార్సు చేసింది. అనంతరం 2023లో స్కాట్లాండ వేల్స్ ప్రభుత్వాలు అధికారిక క్షమాపణలు చెప్పినా, అప్పటి కన్జర్వేటివ్ ప్రభుత్వం అలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న లేబర్ పార్టీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఇదే నెలలో ఇంగ్లాండ్ చర్చి కూడా తన ఆధ్వర్యంలోని సంస్థల్లో జరిగిన బలవంతపు దత్తతల విషయంలో క్షమాపణలు ప్రకటించింది. ఇలాంటి చారిత్రక అన్యాయాలపై ఇప్పటికే పలు దేశాలు స్పందించాయి. 2013లో ఆస్ట్రేలియా ప్రభుత్వం బలవంతపు దత్తతల బాధితులకు జాతీయ స్థాయిలో క్షమాపణలు చెప్పగా, ఐర్లాండ్‌లో కాథలిక్ చర్చి నిర్వహించిన 'మదర్ అండ్ బేబీ హోమ్స్'లో జరిగిన దుర్వ్యవహారాలపై 2021లో విచారణ అనంతరం ప్రభుత్వం అధికారికంగా క్షమాపణలు తెలిపింది. అక్కడ 20వ శతాబ్దంలో నిర్వహించిన 18 కేంద్రాల్లో సుమారు 9,000 మంది చిన్నారులు మరణించినట్లు విచారణలో వెల్లడైంది.

## ట్రంప్ అకౌంట్స్ పథకానికి

# మైక్రాన్ నుంచి 250 మిలియన్ డాలర్ల పెట్టుబడి




**వాషింగ్టన్:** అమెరికాలో చిన్నారుల దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను లక్ష్యంగా రూపొందించిన 'ట్రంప్ అకౌంట్స్' పథకంలో ప్రముఖ సెమీకండక్టర్ సంస్థ మైక్రాన్ టెక్నాలజీస్ 250 మిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించింది. సంస్థ సీఈఓ సంజయ్ మెహ్రోత్రా చేసిన ఈ ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వాగతించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, 18 సంవత్సరాల లోపు పిల్లల కోసం ఉద్యోగులు చేసే పొదుపు విరాళాలకు ఒక్కో చిన్నారి ఖాతాకు గరిష్ఠంగా 1,000 డాలర్ల వరకు మైక్రాన్ సమాన మొత్తాన్ని (మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్) అందించనుంది. అలాగే ఐడాహో, న్యూయార్క్, వర్జీనియా, కాలిఫోర్నియా, కొలరాడో, మిన్నెసోటా, టెక్సాస్ రాష్ట్రాల్లో మైక్రాన్ కార్యకలాపాలు ఉన్న ప్రాంతాల్లో ట్రంప్ అకౌంట్ తెరిచే పిల్లలకు ఒక్కసారిగా 250 డాలర్ల ప్రారంభ నిధిని (సీడ్ డిపాజిట్) జమ చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. సోషల్ సెక్యూరిటీ నంబర్ ఉన్న 18 ఏళ్లలోపు ప్రతి అమెరికన్ చిన్నారికి ఈ ఖాతా అందుబాటులో ఉంటుంది. వ్యక్తులు, యజమానులు లేదా ఇతరులు ఈ ఖాతాల్లో డబ్బు జమ చేయవచ్చు. వ్యక్తిగత రిటైర్మెంట్ ఖాతాల (ఐఆర్‌ఎ) తరహాలో ఈ నిధులు పన్ను మినహాయింపుతో పెరుగుతాయి. ఈ ఖాతాలు ఈనెల 4 నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ పెట్టుబడి ద్వారా దాదాపు 10 లక్షల మంది చిన్నారులకు ప్రయోజనం చేకూరుతుందని మైక్రాన్ అంచనా వేస్తోంది. 'సాంకేతికతలో పెట్టుబడి పెట్టినంతే, మనుషుల భవిష్యత్తులో పెట్టుబడి పెట్టడం కూడా ముఖ్యమే' అని సీఈఓ సంజయ్ మెహ్రోత్రా తెలిపారు. ఈ నిధుల్లో ఎక్కువ భాగం మైక్రాన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రాంతాల కుటుంబాలు, చిన్నారుల దీర్ఘకాలిక ఆర్థిక అవకాశాలను పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు.

# ఉగ్రవాదానికి సమర్థన ఉండకూడదు

## ఐక్యరాజ్యసమితిలో భారత్ స్పష్టీకరణ

**ఐక్యరాజ్యసమితి:** ఉగ్రవాదానికి ఎలాంటి కారణం, రాజకీయ లక్ష్యం లేదా వ్యూహాత్మక ప్రయోజనం పేరుతోనూ సమర్థన ఉండదని భారత్ స్పష్టం చేసింది. 'ఉగ్రవాది అంటే ఉగ్రవాదే' అని పేర్కొంటూ, ఉగ్రవాదాన్ని పెంపొందించే హింసాత్మక భావజాలాన్ని నిర్మూలించేందుకు అంతర్జాతీయ సమాజం ఏకమై పనిచేయాలని ఐక్యరాజ్యసమితిలో భారత్ పిలుపునిచ్చింది. ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో 'యుఎన్ గ్లోబల్ కౌంటర్ టెర్రరిజం స్ట్రాటజీ (జిసిటిఎస్) తొమ్మిదో సమీక్ష ఆమోదం సందర్భంగా భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని మాట్లాడుతూ, భారత్ దశాబ్దాలుగా సరిహద్దు దాటి జరిగే ఉగ్రవాదానికి బలైందని, వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని, అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని గుర్తు చేశారు. ఉగ్రవాదానికి సంబంధించి ద్వంద్వ ప్రమాణాలకు తావులేకుండా అన్ని దేశాలు వ్యవహరించాలని ఆయన అన్నారు. ఉగ్రదాడులకు పాల్పడినవారితో పాటు వాటి నిర్వాహకులు, ఆర్థిక సహకారులు, ప్రోత్సాహకులను కూడా చట్టం ముందు నిలబెట్టి శిక్షించే బాధ్యత అన్ని దేశాలపై ఉందని స్పష్టం చేశారు. ఇందుకోసం సభ్యదేశాల మధ్య సంపూర్ణ సహకారం అవసరమని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో తప్పుడు పోలికలు లేదా రాజకీయ ప్రయోజనాలతో కూడిన వాదనలు ఉండకూడదని భారత్ పేర్కొంది. ఉగ్రవాదం వ్యాప్తికి దారితీసే పరిస్థితులను పరిష్కరించడం అవసరమే అయినప్పటికీ, వాటిని ఉగ్రవాదానికి సమర్థనగా చూపరాదని స్పష్టం చేసింది. మానవ హక్కులు, న్యాయపాలనను పరిరక్షించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, జీవించే హక్కే అత్యంత ప్రాథమిక మానవ హక్కు అని, ఉగ్రవాదం ఆ హక్కుపై నేరుగా దాడి చేస్తుందని భారత్ పేర్కొంది. ఉగ్రవాదానికి నిధుల సమీకరణను అడ్డుకోవడం అంతర్జాతీయ సమాజం ప్రధాన లక్ష్యంగా ఉండాలని భారత్ సూచించింది. ఇందుకోసం ఆర్థిక సమాచార మార్పిడి వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్' (ఎఫ్‌ఎటిఎఫ్) ప్రమాణాలను సమర్థంగా అమలు చేయాలని కోరింది. ఉగ్రవాదులకు నిధులు చేరే సురక్షిత కేంద్రాలుగా ఏ దేశమూ మారకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది. ఉగ్రవాద సంస్థలు కొత్త సాంకేతికతలను దుర్వినియోగం చేస్తున్న నేపథ్యంలో, వాటిని అడ్డుకునే అంశంపై జిసిటిఎస్ సమీక్షలో ఏకాభిప్రాయం సాధించలేకపోవడం నిరాశ కలిగించిందని భారత్ పేర్కొంది. అంతర్జాతీయ ఉగ్రవాద నిర్మూలనకు సమగ్ర చట్టపరమైన వ్యవస్థ కల్పించే 'సమగ్ర అంతర్జాతీయ ఉగ్రవాద నిరోధక కన్వెన్షన్' (సిసిఐటి)ని దాదాపు మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంచడం సామూహిక పోరాటాన్ని బలహీనపరుస్తోందని, దీనిపై సభ్యదేశాలు రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించాలని భారత్ కోరింది. అలాగే, ఏ మతం, జాతి, దేశం లేదా వర్గంపై ద్వేషంతో జరిగే అన్ని రకాల దాడులను భారత్ ఖండిస్తుందని హరీశ్ పర్వతనేని తెలిపారు. ఇస్లామోఫోబియా, క్రైస్తవ వ్యతిరేకత, యూదు వ్యతిరేకత మాత్రమే కాకుండా ఇతర మతాలపై జరుగుతున్న వివక్షను కూడా ఐక్యరాజ్యసమితి సమానంగా గుర్తించాలని ఆయన సూచించారు. ఉగ్రవాదాన్ని సమర్థించే మంచి–చెడు ఉగ్రవాదుల అనే భేదానికి తావివ్వకుండా, ద్వంద్వ ప్రమాణాలు లేకుండా, పారదర్శకంగా ఆంక్షలు అమలు చేసినప్పుడే ప్రపంచం ఈ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కోగలదని భారత్ స్పష్టం చేసింది.

# గంజాయి సరఫరా

(మొదటి పేజీ తరువాయి)

గంజాయిని సాగు చేసి, ఇతర ప్రాంతాల నుంచి సేకరించి దేశంలోని దాదాపు 21 రాష్ట్రాలకు పోస్టల్, కొరియర్ సేవల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు.

**'మెడిసిన్' పేరుతో పార్సిళ్లు..**

**ఏడాదికి రూ.5 కోట్ల టర్నోవర్..**

ఇస్రీ బజార్, ఫుస్రో బజార్ పోస్టాఫీసుల నుంచి గంజాయిని 'మెడిసిన్' పేరుతో స్పీడ్ పోస్ట్‌లో పంపిస్తూ, హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, కేరళ, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లోని కస్టమర్లకు చేరవేసేవారు. సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా ఆర్డర్లు తీసుకుని యుపిఐ ద్వారా చెల్లింపులు స్వీకరించేవారు. ఈ ముఠా రోజుకు సగటున 80 నుంచి 100 ఆర్డర్లను పూర్తి చేస్తూ, ఒక్కో పార్సిల్‌లో 50 నుంచి 250 గ్రాముల గంజాయిని పంపిణీ చేసేది. ఒక్కో ఆర్డర్‌కు రూ.1,500 నుంచి రూ.8,000వరకు వసూలు చేస్తూ నెలకు రూ.30 నుంచి రూ.35 లక్షల ఆదాయం, ఏడాదికి రూ.4 నుంచి రూ.5 కోట్ల టర్నోవర్ సాధించినట్లు పోలీసులు గుర్తించారు.

**'మ్యాంగో', 'స్టిక్', 'ఫ్లవర్' కోడ్ పదాలు..**

పోలీసులకు అనుమానం రాకుండా గంజాయి పరిమాణాలను సూచించేందుకు 'మ్యాంగో', 'స్టిక్', 'ఫ్లవర్' వంటి కోడ్ పదాలను వినియోగించేవారు. అక్రమంగా వచ్చిన డబ్బును వివిధ బ్యాంకు ఖాతాలు, యుపిఐ ఐడిల ద్వారా మళ్లిస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు తేలింది. హైదరాబాద్‌కు స్పీడ్ పోస్ట్ ద్వారా వచ్చిన గంజాయి పార్సిళ్ల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టి, గుడిమల్కాపూర్, ఎస్‌ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో సుశాంత్ వ్యాస్, లడ్డు అనే ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌న్యూ డిసిపి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు బాలస్వామి, నాగార్జున, ఎస్‌ఐ మనోజ్ కుమార్ తదితరులతో కూడిన 22 మంది పోలీసు బృందం ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిందని, వారి సేవలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

(మొదటి పేజీ తరువాయి)

పొందుపర్చిన నిబంధనలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం నిర్ణయాలను మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ధనసరి అనసూయ సీతక్కతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ''కూలీలకు ఉపాధి భరోసా కల్పించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు చేయవద్దని జనవరిలోనే తెలంగాణ శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపినప్పటికీ, ఆ చట్టాన్ని యథావిధిగానే అమలు చేయాలని నిర్ణయించిందని, అయినప్పటి కీ మరోసారి తెలంగాణ రాష్ట్ర నిరసనను కేంద్రానికి తెలియజేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం మోపే విధంగా కేంద్రం నిర్ణయం తీసుకున్నదని, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా, ఏకపక్షంగా విబి జి రాంజీ పథకం అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం పలు సిఫారసులను మంత్రివర్గానికి సమర్పించింది. ఈ సిఫార్సులపై కూడా మంత్రివర్గంలో చర్చించారు. ఇతర రాష్ట్రాలన్నీ కొత్త చట్టం ఆమోదం తెలిపాయా? లేదా?అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని రాష్ట్రాలు కొత్త చట్టం అమలుకు నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు మంత్రివర్గం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇక గత్యంతరం లేని పరిస్థితిలో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించే ఆలోచనతో ఈ కొత్త చట్టాన్ని అమలు చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది'' అని వివరించారు.

# మొదటి దశకు ఆమోదం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అందించే అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అందించాలని నిర్ణయించింది. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించే సంకల్పంతో పాటు జవాబుదారీతనం పెంచే ఆలోచనలో భాగంగా రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి ఈ పథకం వర్తింపజేయనున్నట్టు మంత్రివర్గంలో నిర్ణయించారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంట గ్రామంలో నిత్యావసర వస్తువులు గోదాముల నిర్మాణానికి 50 ఎకరాలను, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాల స్థలాన్ని మార్కెట్ ధరకే తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు కేటాయించేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జవహర్ నవోదయ విద్యాలయాలకు రెండు చోట్ల ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల ప్రభుత్వ భూమిని క్యాబినెట్ కేటాయించింది. జగిత్యాల జిల్లా చల్గల్ గ్రామంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని క్యాబినెట్ నిర్ణయించింది.

**వైద్యశాఖలో 6278 పోస్టుల మంజూరు**

కొత్తగా అందుబాటులోకి వస్తున్న టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్ నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్ టిమ్స్‌తో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టుల ను మంజూరు చేసింది. మొత్తం 6,278 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ బేసిక్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులకు అనుమతించారు. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇక్కడ అందిం చే వైద్య సేవలకు సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎల్‌ఒసిలను కూడా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**'మూసీ' మొదటి దశకు రూ.7,345.12 కోట్లకు ఆమోదం**

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఫేజ్ I పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో 21 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ.7,345.12 కోట్ల విలువైన పనుల మంజూరు చేస్తూ, దీనికి సంబంధించి టెండర్లను ఆహ్వానించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. హిమాయత్ సాగర్ నుంచి ఈసా, ఉస్మాన్ సాగర్ నుంచి మూసా ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపు ఘాట్ వరకు ఈ పనులు చేపట్టనున్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనులు, నిర్వహణ కోసం నూతనంగా 147 పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బంది డిప్యూటేషన్‌కు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపి ఎం. అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్‌లు దానం నాగేందర్, నవీన్ యాదవ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మెట్టు సాయి, దీపక్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

**హరీశ్‌రావు సహా పలువురు అరెస్టు**

గురుకులాల అవినీతి అంశంపైన మంత్రులు, బిఆర్‌ఎస్ నాయకుల సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్క్ వద్దకు బయల్దేరేందుకు ప్రయ త్నించిన బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు తన్నీరు హరీశ్ రావుతో పాటు పలువురి వాహనా

# కొనసాగిన హైడ్రామా

(మొదటి పేజీ తరువాయి)

లను పోలీసులు గురువారం అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బిఆర్‌ఎస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రులు సవాళ్లు విసిరిన నేపథ్యంలోనే తాము గన్‌పార్క్ వద్దకు వెళ్తున్నామని, తామే మీ గొడవ పడేందుకు వెళ్లడం లేదని పోలీసులకు హరీశ్ రావు సూచించారు. అయినప్పటికీ పోలీసులు బిఆర్‌ఎస్ నాయకుల వాహనాలను అడ్డుకున్నారు. తమకు అనుమతి ఇవ్వకపోతే కాలినడకన వెళ్తామని హరీశ్ రావు కారు దిగి బయటికి వచ్చారు. ఆయన వెంట బిఆర్‌ఎస్ నాయకులు కూడా రోడ్డుపైకి వచ్చారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు,బిఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగి, ఆ తోపులాటలో హరీష్ రావు కిందపడ్డారు. కొద్ది సేపు స్థానికంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. బిఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

# 6న హైదరాబాద్‌లో భారీ ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కార్యాలయంలో మార్క్స్ భవన్‌లో గురువారం వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు సాదినేని వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు హన్మేశ్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్, ఎంసిపిఐ నాయకులు వనం సుధాకర్, ఎస్‌యుసిఐ నాయకులు భరత్ పాల్గొన్నారు. 'ప్రతి గుడిసెకు పట్టా – పేదవాడికి ఇల్లు' అనే నినాదంతో నిర్వహించే ఈ ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా గుడిసెవాసులు, పేదలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఈ సందర్భంగా వామపక్షాల నేతలు పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో గుడిసెలలో నివసిస్తున్న పేదలందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి, ప్రభుత్వ వ్యయంతో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో లక్షలాది ఎకరాల్లో సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కూడా ధర్నాలో ప్రధానంగా డిమాండ్ చేయనున్నట్లు వారు వెల్లడించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనట్లయితే ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

# కాలరాస్తున్న ప్రభుత్వాలు

(మొదటి పేజీ తరువాయి)

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్ల అవుతున్నా ముస్లింలు, ఇతర మైనారిటీలు ఇంకా పేదరికం, నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయని విమర్శించారు. తొమ్మిదేళ్లుగా మూతపడి ఉన్న రాష్ట్ర మైనారిటీ కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మైనారిటీ, వక్ఫ్ భూములపై జరుగుతున్న ఆక్రమణలను అరికట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మైనారిటీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలలో తగిన వాటా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ముస్లింల ఓట్లు గల్లంతవుతున్నాయనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని అజీజ్‌పాషా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇస్కాఫ్ రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్, ప్రధాన కార్యదర్శి ఎండి.ఫయాజ్, సహాయ కార్యదర్శి ఎండి.జమీల్, నాయకులు శంకర్ నాయక్, ఖాలీద్, కలీమ్, రెహమాన్, నదీమ్, ఖలీమ్, తన్వీర్ ఖాన్, గౌస్‌పాషా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్లు, ఎమ్మార్వో కార్యాలయాల ముందు నిరసనలు వ్యక్తం చేయడం జరిగిందని తెలిపారు. రెండవ దశ ఉద్యమంగా ఈనెల 6వ తేదీన హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద లక్షలాదిమందితో మహా ధర్నా నిర్వహించబోతున్నామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో పేదలకు వేసుకున్న ప్రతి గుడిసెలకు పట్టాలను ఇచ్చే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టి ఎవరూ చేయాలని ఈ పనిని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని అలా కాకుండా గుడిసెలనే తొలగిస్తామనుకుంటే ఈ చర్యలను అడ్డుకోవడానికి ఎంతటి ఉద్యమాలకైన వెనకడబోమని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు.

అదేవిధంగా దశాబ్దాలుగా పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులను, పేదలకు సాగు హక్కు పత్రాలు (పట్టాలు) అందజేయాలన్నారు. అదేవిధంగా గత బిఆర్ ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టర్ పేరుతో కాస్తు దారుల కాలం తొలగించి తరతరాలుగా భూములను దున్నుకుని బతుకుతున్న నిరుపేదలకు వాటి పై హక్కులే కుండా చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతిలో సైతం కాలాన్ని ఇప్పటీ వరకు చేర్చకపోవడం అన్యాయమని దీనిని వెంటనే పొందుపర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

**సింగరేణిపై శ్వేత పత్రం విడుదల చేయాలి :**

సింగరేణి సంస్థలో కార్మికుల్లో నెలకొన్న అసంతృప్తిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి 'శ్వేతపత్రం' విడుదల చేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. అదేవిధంగా బొగ్గు నిల్వలకు సంబంధించి తప్పుడు లెక్కలు రాసి గందరగోళానికి కారణమవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. చేశారు. సింగరేణికి విద్యుత్ సంస్థలు, ప్రభుత్వం నుండి దాదాపు రూ.56 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఒకవైపు లాభాల పంపిణీ అంటూనే, మరోవైపు నష్టాల పేరుతో గనులను మూసివేయడం, కార్మికులను తొలగించాలనుకోవడంపై తీవ్ర గందరగోళం నెలకొందని విమర్శించారు. సంస్థ నిర్వహణ బాధ్యతలను అధికారులకే వదిలేయాలని, రాజకీయ జోక్య ం తగ్గించాలని కోరారు.

**హరీష్ రావు అంతిమంగా నేను చెప్పిన విషయాన్ని అంగీకరించినందుకు సంతోషం**

# అవిశ్రాంత పోరాటాలు

హరీష్ రావు అంతిమంగా నేను చెప్పిన అంశాన్ని అంగీకరించినందుకు సంతోషమని 40 లక్షల టన్నుల బొగ్గు ఎక్కువగా లెక్కలలో చూపారని నేను చెప్పానని, హరీష్ రావు దొంగతనం జరిగిందని చెప్పారని అన్నారు. ఇప్పుడు లెక్కలలో పెంచి చూపెట్టారు అని చెప్పిన దానికి వారు అంగీకరించారని అన్నారు. బిఆర్‌ఎస్ కాలంలో 75 లక్షల టన్నులు ఇదేవిధంగా దొంగ లెక్కలు వ్రాశారా, అది కూడా అంగీకరిస్తే సంతోషమన్నారు.

**కొంతమంది కార్మికులకేనా కనీస వేతనాలు ?**

ప్రభుత్వం ఇటీవల కొంతమంది కార్మికులకు మాత్రమే కనీస వేతనాలను ప్రకటించడం అన్యాయమన్నారు. హాస్పిటల్స్, పంచాయతీలు, సర్వీస్ సెక్టార్లలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఇంకా కనీస వేతనాలను అధికారికంగా ప్రకటించలేదని, దీనిపై కూడా తాము త్వరలోనే పోరాట కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. బడ్జెట్ సమావేశాలు ముగిసిన నెలలు గడుస్తున్న కేటాయించిన నిధుల విడుదల కావడం లేదన్నారు. ప్రభుత్వ వెంటనే ఓ కార్యచరణను రూపొందించి కేటాయించిన నిధులన తక్షణమే విడుదల చేయాలని సూచించారు.

**కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఐ దేశవ్యాప్త సమరభేరి : కె.రామకృష్ణ**

కేంద్రంలో గత 12 ఏళ్లుగా అధికారం చెలాయిస్తున్న నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ కనుసన్నల్లో పని చేస్తూ వారి ఎజెండాను అమలు చేయడం తప్ప ప్రజలకు సంబంధించి ఏ ఒక్క వర్గానికి కూడ న్యాయం చేయకపోగా, ఏ రాముడి పేరుని వాడుకుని అధికారంలోకి వచ్చారో అదే దేవుడిని కూడ మోసం చేశారని రామకృష్ణ ఆగ్రహంవ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని సిపిఐ నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా ఆగ దేశవ్యాప్త పాదయాత్రలు, ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందులో భాగంగా ఆగస్టు 6 నుండి 15 వరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని ప్రతి గల్లీ, పట్టణం, నగరాల్లో పెద్ద ఎత్తున పాదయాత్రలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కోట్లాది మంది ప్రజలను కలిసి ప్రభుత్వ విధానాలను ఎండగడుతామని తెలిపారు. ఆ తర్వాత సెప్టెంబర్ 1న దేశ రాజధాని'చలో ఢిల్లీ' కార్యక్రమం ద్వారా మహా ర్యాలీని నిర్వహించనున్నమన్నారు.

దేశంలో మార్పు కోసం, ప్రజా రక్షణ కోసం చేపట్టే ఈ 'చలో ఢిల్లీ' ర్యాలీని పాదయాత్రలను జయప్రదం చేయాలని ప్రజలకు, కార్మిక వర్గాలకు విజ్ఞప్తి రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ముడి చమురు ధరలు పెరిగాయని దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్,ను ధరలను విపరీతంగా పెంచిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్ అదే ముడి చము రు ధరలు 40 శాతం తగ్గగా కేంద్ర ప్రభుత్వం ఇక్కడ లీటర్ డీజిల్ కేవలం 3 రూపాయలు తగ్గించి ప్రజలను ముష్టి వేసినట్లు అవహేళన చేస్తోందని విమర్శించారు.

అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు పదే పదే భారాలు మోపిన కేంద్రం, ఇప్పుడు ధరలు తగ్గినప్పుడు ఆ మేరకు ఇక్కడ ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. ప్రతిఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బిజెపి ప్రభుత్వం అవి ఇవ్వకపోగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' స్థానంలో వివి రామ్ జీ విధానాన్ని తీసుకువచ్చి, గ్రామీణ ప్రజలు, వ్యవసాయ కార్మికుల నోట్లో మట్టి కొట్టారనిఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాముడి పేరు చెప్పి అధికారం పొంది, విరాళాల రూపంలో భారీగా డబ్బులు వసూలు చేసి, చివరికి ఆ రాముడికే టోపీ పెట్టారని విమర్శించారు. ఈ ఘటనపై తక్షణమే న్యాయ విచారణ జరిపించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# శ్రీలంకలో టీమిండియా పర్యటన

## ఆగస్టు 15 నుంచి టెస్టు సిరీస్



టెస్టు సిరీస్ కోసం టీమిండియా జట్టు శ్రీలంకలో పర్యటించనున్నది. ఆగస్టు 15 నుంచి 27వ తేదీ మధ్య ఇరు జట్లు రెండు టెస్టుల్లో తలపనున్నాయి. వరల్ టెస్ట్ చాంపియన్ షిప్‌లో భాగంగా ఈ సిరీస్ నిర్వహిస్తున్నట్లు శ్రీలంక క్రికెట్ బోర్డు తెలిపింది. గాలేలో తొలి టెస్టు, కొలంబోలో రెండో టెస్టును వేదికగా ఫిక్స్ చేశారు. ఆగస్టు 15వ తేదీన గాలే ఇంటర్నేషనల్ స్టేడియంలో తొలి టెస్టు ప్రారంభం కానున్నది. ఆగస్టు 23వ తేదీ నుంచి కొలంబో స్టేడియంలో రెండో టెస్టు ఆడనున్నారు. గతంలో రెండు సార్లు వరల్ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్స్‌లో భారత్ ఓడిన విషయం తెలిసిందే. డబ్ల్యూటీసీ టైటిల్‌ను ఇండియా గెలవలేకపోయింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ రేసులో టీమిండియా జట్టు అయిదో స్థానంలో ఉన్నది. ఆ తర్వాత శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. ఇక నవంబర్, డిసెంబర్ నెలలలో న్యూజిలాండ్‌లోనూ ఇండియా పర్యటించనున్నది. శుభమన్ గిల్ నేతృత్వంలోని భారత టెస్టు జట్టు ఇంగ్లండ్‌తో సిరీస్‌ను 2–2 తేడాతో డ్రా చేసుకున్నది. వెస్టిండీస్‌తో జరిగిన హోం సిరీస్‌ను గెలుచుకున్న విషయం తెలిసిందే. అయితే గత ఏడాది స్వదేశీ గడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో భారత్ ఘోర పరాభవాన్ని చవిచూసింది. 2017లో చివరిసారి శ్రీలంకలో భారత్ పర్యటించింది. 9 ఏళ్ల గ్యాప్ తర్వాత లంకలో టీమిండియా టెస్టు సిరీస్ ఆడనున్నది. గత సిరీస్‌ను భారత్ 3–0 తేడాతో గెలుచుకున్నది.

# ఈక్వెడార్‌పై గెలిచి ప్రిక్వార్టర్స్‌కు మెక్సికో



సాకర్ ప్రపంచకప్‌లో 40 ఏండ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత మెక్సికో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. గ్రూప్ దశలో హ్యాట్రిక్ విజయాలతో దుమ్మురేపిన సహ ఆతిథ్య దేశం నాకౌట్లోనూ అదే జోరు కొనసాగించింది. బుధవారం ఉదయం జరిగిన రౌండ్ 32లో మెక్సికో 2–0తో ఈక్వెడార్‌ను ఓడించి నాలుగు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. 1986 తర్వాత మెక్సికో జట్టు ప్రిక్వార్టర్స్కు చేరడం ఇదే తొలిసారి. ఆ ప్రపంచకప్ తర్వాత వరుసగా ఏడుసార్లూ రౌండ్32లోనే నిష్క్రమించిన మెక్సికో స్వదేశంలో మాత్రం ఆ అడ్డుగోడను అధిగమించింది. జులియన్ క్వినోన్స్ (22వ నిమిషంలో), రవుల్ హిమనెజ్ (31 వ) చెరో గోల్ కొట్టి తమ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. సొంత అభిమానుల నడుమ నాకౌట్ బరిలోకి దిగిన మెక్సికో.. తొలి అర్ధభాగంలోనే ప్రత్యర్థిపై పూర్తిస్థాయి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. గత సౌదీ ప్రో లీగ్లో అత్యధిక గోల్స్తో ఆకట్టుకున్న ఫార్వర్డ్ జులియన్.. బాక్స్ వెలుపలి నుంచి గోల్ కొట్టి మెక్సికోను ఆధిక్యంలోకి తెచ్చాడు. ఆ వెంటనే స్టార్ స్ట్రైకర్ హిమనెజ్ సైతం గోల్ చేశాడు. మ్యాచ్ మొత్తంలో మెక్సికో కంటే బంతిని తమ అధీనంలోనే ఉంచుకున్న ఈక్వెడార్.. గోల్ కొట్టడంలో మాత్రం విఫలమైంది. ఆ జట్టు ఏడు సార్లు మెక్సికో గోల్పోస్ట్పై దాడులకు దిగినా అవి ఫలించలేదు. మెక్సికో 15 సార్లు గోల్కు యత్నించి రెండుసార్లు సఫలమైంది. 1986లో మెక్సికో ప్రిక్వార్టర్స్ ఆడినప్పుడు మిడ్ఫీల్డర్గా ఉన్న జేవియర్ ప్రస్తుతం ఆ జట్టు కోచ్‌గా ఉండటం విశేషం.

### స్వీడన్‌ను చిత్తుచేసిన ఫ్రాన్స్.. ప్రిక్వార్టర్స్‌కు ఇంగ్లండ్

గత ఎడిషన్‌లో తృటిలో టైటిల్ చేజార్చుకుని ఈసారి ఎలాగైనా ట్రోఫీని ముద్దాడాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన ఫ్రాన్స్.. స్థాయికి తగ్గ ప్రదర్శనతో నాకౌట్ దశను ఘనంగా ఆరంభించింది. బుధవారం ఉదయం జరిగిన పోరులో ఫ్రాన్స్.. 3–0తో స్వీడన్‌ను చిత్తుచేసింది. 'గోల్డెన్ బూట్' రేసులో అర్జెంటీనా దిగ్గజం లియోనల్ మెస్సీ (6 గోల్స్)తో పోటీపడుతున్న ఫ్రాన్స్ స్టార్ కిలియన్ ఎంబాపె (6) మరో డబుల్ ధమాకాతో ఆ జట్టుకు సునాయాస విజయాన్ని అందించాడు.

అట్లాంటాలో ఉత్కంఠగా జరిగిన పోరులో ఇంగ్లండ్ 2–1తో కాంగోను ఓడించి ప్రిక్వార్టర్స్ చేరింది. కెప్టెన్ హ్యారీకేన్ (75వ, 86వ) పది నిమిషాల్లోనే రెండు గోల్స్ చేసి ఆ జట్టుకు విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలిచినా కాంగో అసాధారణంగా పోరాడింది. ఏడో నిమిషంలోనే ఆ జట్టు నుంచి బ్రయాన్ సిపెంగా తొలి గోల్ చేసి ఇంగ్లిష్ ఫ్యాన్స్‌కు షాకిచ్చాడు. ఫస్టాఫ్తో పాటు రెండో అర్ధభాగం సగం వరకూ ఇంగ్లండ్ ఆటగాళ్లు ఎంత యత్నించినా కాంగో రక్షణశ్రేణిని ఛేదించలేకపోయారు. కానీ హ్యారీకేన్ మ్యాజిక్‌తో ఇంగ్లండ్ జయకేతనం ఎగురవేసింది.

## పోటీ కోసం జీకె
(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

# ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

- వేలా పరిమితి ఇచట ఎక్కువ
  మధ్యధరా సముద్రం
- ఫ్లాషర్ ను ఇచట అమరుస్తారు
  రైల్వే మార్గాలు
- పెన్నానది ఏ కొండలలో పుట్టినది?
  నందిదుర్గ
- యూరప్‌ను దీని నుండి యూరల్ పర్వతాలు వేరు చేయుచున్నవి?
  ఆసియా
- ఇందిర జలప్రభను ప్రారంభించిన ప్రదేశం?
  జంగాలపల్లి
- మంచినీరు ఎక్కువ భాగం ఈ ప్రదేశంలో ఉంటుంది?
  నదులు
- IRDP అనగా
  సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం
- ఐక్యరాజ్యసమితి కార్యాలయం ఇచ్చట ఉంది
  న్యూయార్క్
- స్పాంజ్ ఐరన్ ఇండియా కంపెనీ ఇచట ఉంది
  పాల్వంచ
- అతి చిన్న గ్రహం
  బుధుడు
- వేడికి ఎక్కువగా వ్యాకోచించునవి
  వాయు పదార్థాలు
- రాష్ట్రమంత్రులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించటానికి ఉద్దేశించిన పథకం
  ప్రజాపథం
- మానవుని హృదయంలో గదుల సంఖ్య
  4
- మధ్య ఆఫ్రికాను ఆవిష్కరించినది
  లివింగ్ స్టన్
- ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)ను ఎప్పుడు స్థాపించారు?
  1969
- దేశంలో స్థూల పెట్టుబడి రేటు 2013–14లో ఎంత శాతం ఉంది?
  32.3%
- అంతరిక్ష యాత్రికుడికి ఆకాశం ఏ రంగులో కనిపిస్తుంది?
  నలుపు
- పెన్సిలిన్‌ను కనిపెట్టిన శాస్త్రవేత్త
  అలెగ్జాండర్ ఫ్లెమింగ్
- ఎత్తైన శిఖరం K2 ఈ శ్రేణిలో ఉంది
  కారకోరం
- ఏపిస్ ఇండికా దేని శాస్త్రీయ నామం
  తేనెటీగ
- శరీరం నుండి నీరు బయటకు పోకుండా, ఉప్పునీటి జీవులు నిలవచేసుకొను పదార్థం...
  యూరియా
- పెర్టుసిస్ బాక్టీరియా కలుగచేసే వ్యాధి:
  కోరింత దగ్గు



- కాపర్ ఆక్సైడ్ రంగు
  నలుపు
- రాజ్యసభకు పోటీచేయడానికి కనీస వయసు ఎంత?
  30
- 1950–51లో జీడీపీలో వ్యవసాయరంగం వాటా ఎంత?
  56.5%
- ఏ వ్యక్తికైనా ఒక ఆధ్యాత్మిక గురువు లేకపోతే పరిపూర్ణత లభించదని పేర్కొన్నది ఎవరు?
  గురు నానక్
- భారత పార్లమెంటులో అంతర్భాగం ఎవరు?
  రాష్ట్రపతి
- శరీరంలో ఎలర్జి ప్రతిచర్యలను తగ్గించేవి:
  ఇస్నోఫిల్స్
- నీటిలో గల సూక్ష్మ జీవులను చంపటానికి తాగేముందు ఎన్ని నిమిషాలు మరిగించాలి?
  10–15 నిమిషాలు
- ఈ క్రింది వానిలో ఫిల్ములు మరియు తయారు చేసేది ఏది?
  పాలిఎస్టర్లు
- ఇందిరా ఆవాస్ యోజన
  అవసరాలు తీర్చడం
- మధ్యాహ్న భోజన పథకం 8 నుండి 10వ తరగతి పిల్లల వరకు ఆ సంవత్సరం నుండి అమలు జరుగుతుంది
  2008
- పంచాయతీరాజ్ వ్యవస్థ గురించి తెలియజేసే ఆర్టికల్ ఏది?
  40
- ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ పదవీ కాల పరిమితి?
  5 సంవత్సరాలు
- సోడానీటిలో ఉండే వాయువు ఏది?
  కార్బన్ డై ఆక్సైడ్
- సిక్కు మత స్థాపకుడు ఎవరు?
  గురునానక్
- స్వయం ఉపాధి పథకాల కమిటీ చైర్మన్
  కలెక్టర్
- గాలిలో ఆక్సిజన్ శాతం
  10
- మానవునిలో వెన్ను నాడుల జతల సంఖ్య
  31
- ఆముదపు నూనెను వీటి తయారీలో ఉపయోగిస్తారు
  ప్లాస్టిక్కులు
- ఇప్ప చెట్ల పూల నుండి తయారుచేస్తారు?
  ఇప్పసారా
- ప్రపంచంలో పొడవైన రైలు మార్గం గల ప్రాంతం ఏది?
  ట్రాన్స్ సైబీరియా
- 'ద్రాక్షసారా' ఉత్పత్తిలో ప్రథమ స్థానం వహించుచున్నది?
  ఫ్రాన్స్
- యూరప్ దేశాలలో చిన్నది ఏది?
  వాటికన్ సిటీ
- ఎవరి అనుమతితో ఆర్థికబిల్లులు పార్లమెంటులో ప్రవేశపెట్టబడతాయి?
  రాష్ట్రపతి
- సీతాఫలాలకు ప్రసిద్ధి గాంచిన జిల్లా ఏది?
  చిత్తూరు
- ధ్వనివేగం ఎందులో గరిష్ఠం.
  ఉక్కు

# 'ఉపాధి' పథకం పేరు మార్చడం దుర్మార్గం

## సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాచలం :** మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధిహామీ పథకం పేరును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విబిజి రామ్‌జీ పథకంగా పేరు మార్చడం దుర్మార్గమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాఘవనిలయం రెడ్ల సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నిందని, అందులో భాగంగా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కోత పెట్టారని, రాష్ట్రాల వారీగా చెల్లింపులు చేస్తున్నారన్నారు. మోదీ తీరు జాతిపితను అవమానించే విధంగా ఉందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఎపిలో కలిపిన ఐదు గ్రామపంచాయతీలని తెలంగాణకు ఇవ్వాలన్నారు. ఈ ఐదు పంచాయతీలు తెలంగాణలో కలపడం ద్వారా వందలాది ఎకరాల భూమి వస్తుందని, తద్వారా ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాద్రి రామాలయాభివృద్ధికి నిధులు విడుదల చేయడం హర్షణీమమని, ఆ నిధులు దుర్వినియోగం కాకుండా నాణ్యతతో కట్టడాలు చేపట్టాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న కరకట్ట నిర్మాణాన్ని పూర్తి చేసి వరద నీరు పట్టణంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతల ప్రజలను ఆదుకోవాలని, వారికి ఎత్తైన ప్రదేశాల్లో ఇండ్లు కట్టించి ఇవ్వాలన్నారు. పేదలు ఎదుర్కొంటున్న భూసమస్యలపై వామపక్ష పార్టీలు ఐక్యపోరాటాలు సాగిస్తున్నాయని, అందులో భాగంగా ఈనెల 6న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టామని తెలిపారు. 'పేదవానికి ఇళ్లు – ప్రతి గుడిసెకు పట్టా' అనే నినాదంతో 9 కమ్యూనిస్టు పార్టీల ఐక్య పోరాటంగా ఇది సాగుతుందన్నారు. జిల్లాకు జరుగుతున్న అన్యాయాలను పాలకులకు తెలిసే విధంగా పోరాటాల కేంద్రమైన భద్రాచలంలో ఈనెల 7,8,9 తేదీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ పోరాటాల రూపకల్పన ఇక్కడి నుండే ప్రారంభం కానుందని మొదటి రెండు రోజులు కమ్మ సత్రంలో చివరి రోజైన 9న రాఘవ నిలయం రెడ్ల సత్రంలో ఉంటుందన్నారు. శిక్షణా తరగతులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారని సాబీర్‌పాషా వెల్లడించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాదం, కల్లూరి వెంకటేశ్వర్లు, నరాటి ప్రసాద్, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, మువ్వా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి

## ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య
## యూనియన్‌లో చేరిన 150 మంది ఆటో డ్రైవర్లు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆటో కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘటిత పోరాటాలతోనే ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన అన్నారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ శేషగిరి భవన్ లో గురువారం ఎఐటియుసి అనుబంధ ఆటోవర్కర్స్ యూనియన్ 15వ పట్టణ మహాసభ యూనియన్ అధ్యక్షులు ఉబ్బులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు వివిధ అడ్డాల నుంచి పెద్దసంఖ్యలో ఆటో డ్రైవర్లు, కార్మికులు హాజరై సభను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ ఆటో కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఉపాధి భద్రత కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడుతుందన్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. పెరుగుతున్న ఇంధన ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా ఆటో కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సామాజిక భద్రత, ప్రమాద భీమా, పెన్షన్ వెంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. మహాసభలో యూనియన్ బలోపేతం, సభ్యత్వ నమోదు విస్తరణ, కార్మికుల హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యాచరణపై పలు తీర్మాణాలను ఆమోదించినట్లు జమలయ్య పేర్కొన్నారు.

**ఎఐటియుసిలో భారీ చేరికలు :** ఈ మహాసభలో వివిధ అడ్డాల నుంచి 150 మంది ఆటో డ్రైవర్లు ఎఐటియుసిలో చేరగా కంచర్ల జమలయ్య వారికి కండవాలు కప్పి సంఘంలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతన యూనియన్‌లో చేరిన ఆటో వర్కర్లు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఐక్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫయామ్, మర్రి కృష్ణ, ఆరెల్లి కృష్ణ, అబ్బులు, విజ్జి, బాబు, జానీదేశీ, బొట్టు శ్రీను, మంద శ్రీను, జలీల్, గౌస్, చింటు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కారానికి '10'న విద్యాసంస్థల బంద్

## వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు





**ప్రజాపక్షం/కరీంనగర్ :** రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యార్థుల భద్రత వంటి అనేక సమస్యలు పేరుకుపోయినా రాష్ట్ర ప్రభుత్వం వాటి పరిష్కారంపై నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని వామపక్ష విద్యార్థి సంఘాల కరీంనగర్ జిల్లా కమిటీలు విమర్శించాయి. విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ జూలై 10న కేజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నామని, ఈ బంద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రజలు, తల్లిదండ్రులు, మేధావులు సహకరించి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని గణేష్ నగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో గల ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లాకార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు కామ్పల్లి అరవింద్ ఎఐఎస్‌బి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతీకం రాజశేఖర్‌గౌడ్, పిడిఎస్‌యు రాష్ట్ర కోశాధికారి అంగడి కుమార్, పిడిఎస్‌యు న్యూడెమోక్రసీ జిల్లా అధ్యక్షుడు లోకిని రమేష్, నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, బోయిని విష్ణు, వెల్దీ రాజు, తాళ్లపల్లి అంజి పాల్గొన్నారు.

**హనుమకొండ :** విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ జూలై 10న జరిగే విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలని జిల్లాకేంద్రలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, ఎఐఎఫ్‌డిఎస్ జిల్లా కార్యదర్శి మాస్ సావిత్రి, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి బొక్క నరసింహ రావు, జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఎఐఎస్‌బి జిల్లా కన్వీనర్ సతీష్, ఎఐడిఎస్ఒ జిల్లా కార్యదర్శి వెంకటేష్ పిలుపునిచ్చారు.

**వరంగల్ :** విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐఎస్‌ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, ఎఐఎస్‌బి నాయకులు తాజ్, ఎఐఎఫ్‌డిఎస్ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పైసా గణేష్, పిడిఎస్‌యూ జిల్లా నాయకుడు వంశీ డిమాండ్ చేశారు. 10న విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని గురువారం స్టేషన్ రోడ్‌లోని బాపూజీ సెమినార్ హాల్ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మీడియా సమావేశం వారు విజ్ఞప్తి చేశారు.

**పెద్దపల్లి :** విద్యారంగ సమస్యల పరిష్కారానికై విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లెల ప్రశాంత్, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి ఈర్ల రామచందర్ కోరారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని వారు అన్నారు. కార్యక్రమంలో నాయకులు తడిగొప్పుల అనూప్ సాయి, రాఘవ సన్నీ, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్, కాంపెల్లి రాహుల్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.





# జిజిహెచ్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## సంఘం రాష్ట్రకార్యదర్శి ఓమయ్య, జిల్లా అధ్యక్షుడు సుధాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో జిజిహెచ్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ రాములుకు వినతి పత్రం అందజేసినట్లు రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య, జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో పని చేస్తున్న సానిటేషన్, పేషంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి సంబంధించిన టెండర్ కాలపరిమితి ముగిసి సంవత్సరం అవుతున్నప్పటికీ వేతనాలు పెరగకపోవటం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీనివ్వటం జరిగిందని వెంటనే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయటంతో పాటు పిఆర్‌సి ప్రకటించి కనీస వేతనాలు అమలు చేయాలని, జిల్లా కేంద్ర ఆస్పత్రిని 1000పడకలకు పెంచాలని, ప్రస్తుతం కార్మికులపై పని భారం పెరుగుతున్నందున కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 23 జాతీయ, పండగ, అర్జీ సెలవులు ఇవ్వాలనే డిమాండ్లతో ఈనెల 9న కోటిలోని డిఎంఇ కార్యాలయం ముట్టడి ఉందని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే సమ్మె నిర్వహించక తప్పదన్నారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి భాగ్యలక్ష్మి, నాయకులు రాధాకుమార్, స్వరూప, భారతి, కవిత, వెంకటేష్, సానిటేషన్, పేషంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



# బదిలీల 'జీఓ'లు బేఖాతరు

**ఇంజనీర్ల కెరీర్‌తో ఆటలు !**
**మూడు కార్పొరేషన్‌ల పరిధిలో తీవ్ర గందరగోళం**
**జాయినింగ్స్ లేవు - డ్యూటీలు లేవు**
**- ఇంజనీర్ల తీవ్ర ఆవేదన**
**నిబంధనలకు విరుద్ధంగా కమిషనర్‌ల లేఖలు..**
**పైరవీలకే పెద్దపీట ?**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర మున్సిపల్ శాఖలో పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ల బదిలీల వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను (జిఓలను) క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు తుంగలో తొక్కడంతో.. బదిలీల ప్రక్రియ అంతా అస్తవ్యస్తంగా మారింది. జి.ఓ38, జి.ఓ 575 ప్రకారం బదిలీలైన వందలాది మంది ఇంజనీర్లు ప్రస్తుతం ఎటూ కాకుండా పోయారు. ఒకవైపు బదిలీ అయిన స్థానంలో పోస్టింగ్ ఇవ్వక, మరోవైపు పాత స్థానాలకు వెళ్లలేక దాదాపు నెల రోజులుగా డ్యూటీలు లేకుండా ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విచిత్రమేమిటంటే, వీరికి పని లేకుండానే జిహెచ్‌ఎంసి నిధుల నుంచి జీతాలు చెల్లించాల్సి రావడం గమనార్హం.

**తలకిందులైన ప్రభుత్వ ఆదేశాలు..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీ ఉత్తర్వులు వచ్చిన మూడు రోజుల్లోగా సంబంధిత అధికారులు ఉద్యోగులను రిలీవ్ చేయాలి. ఒకవేళ రిలీవ్ చేయక పోయినా, ఉద్యోగులు తమకు తాముగా రిలీవ్ అయినట్లు భావించి కొత్త స్థానాల్లో జాయిన్ కావాల్సి ఉంటుంది. అక్కడి హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ (హెచ్ఓండి) వారిని తప్పనిసరిగా చేర్చుకోవాలి. కానీ గ్రేటర్ పరిధిలో సీన్ రివర్స్ అయింది. జిహెచ్‌ఎంసి నుంచి సిఎంసికి బదిలీ అయిన ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) అక్కడ జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వగా, అక్కడి చీఫ్ ఇంజనీర్ నిబంధనలను పక్కనబెట్టి, 'మీ జాయినింగ్‌ను యాక్సెప్ట్ చేయడం లేదు. మళ్లీ వెళ్లి జిహెచ్‌ఎంసిలోనే పని చేసుకోండి' అంటూ సలహా ఇవ్వడం శాఖలో చర్చనీయాంశంగా మారింది.

సదరు ఈఈని సిఎంసిలో జాయిన్ చేసుకోకపోవడానికి వెనుక అసలు కారణం, అక్కడ పనిచేస్తున్న ఒక మహిళా ఈఈని రిలీవ్ చేయడం ఇష్టం లేకపోవడమేనని తెలుస్తోంది. ఆమె అప్పటికే జిహెచ్‌ఎంసికి బదిలీ అయినా, సిఎంసి కమిషనర్ ఆమె బదిలీని ఆపాలంటూ ఈఎన్‌సికి లేఖ రాయడం గమనార్హం. ఇదే బాటలో జిహెచ్‌ఎంసిలో పనిచేస్తున్న మరో మహిళా ఈఈ ఎంఎంసికు బదిలీ అయ్యారు. అయితే, రామగుండం, మల్కాజిగిరిల నుంచి ఇద్దరు ఈఈలు వచ్చి జిహెచ్ఎంసిలో జాయిన్ అయినప్పటికీ, ఈమెను మాత్రం ఇక్కడే కొనసాగించాలంటూ జిహెచ్‌ఎంసి కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ ముగ్గురు అధికారులు లేకపోతే కార్పొరేషన్‌లలో పనులే జరగవన్నట్లుగా కమిషనర్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**సీనియార్టీకి పాతర.. జూనియర్లకు కట్టబెట్టిన వైనం**

మల్కాజిగిరికి బదిలీ అయిన సదరు మహిళా ఈఈకి తీవ్ర అన్యాయం జరిగినట్లు డిపార్టమెంట్‌లో చర్చ జరుగుతోంది. జిహెచ్‌ఎంసి ప్రాజెక్ట్స్ విభాగంలో ఇటీవల ఎస్ఈ (ఎస్ఈ) రిటైర్ అవ్వగా, ఆ స్థానంలో సీనియర్ అయిన ఈమెకు 'ఎఫ్ఏసీ'ఇవ్వాల్సింది పోయి, ఇప్పటికే మూడు నాలుగు పోస్టుల బాధ్యతల్లో ఉన్న ఒక రెగ్యులర్ ఎస్ఈకి ఆ బాధ్యతలు కట్టబెట్టారు.

**బాధితురాలి ఆవేదన..**

'జిఓ 575 ప్రకారం తనను మల్కాజిగిరి కార్పొరేషన్‌కు వెళ్లనిచ్చి ఉంటే, జూన్ 30న రిటైర్‌మెంట్ ద్వారా ఏర్పడిన మూడు ఖాళీలలో ఒక ఎస్ఈ పోస్ట్ సీనియార్టీ ప్రకారం తనకు దక్కేది. కానీ కమిషనర్ తనను ఇక్కడే ఉంచడం వల్ల, తనకన్నా జూనియర్ అయిన ఒక మహిళా ఈఈకి అక్కడ ఎస్ఈ పోస్ట్ దక్కిందని ఆమె తన సన్నిహితుల వద్ద వాపోయినట్లు సమాచారం.

**నెల రోజులుగా డ్యూటీలు లేవు.. జీతాలు దండగ !**

ఎంఎంసి నుంచి రిలీవ్ అయి వచ్చి జిహెచ్‌ఎంసిలో రిపోర్ట్ చేసిన ఒక ఈఈ, నలుగురు డిఈలు, ఆరుగురు ఏఈల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. వారు జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు వారికి ఎలాంటి రీ పోస్టింగ్ ఇవ్వలేదు. అటు పాత కార్పొరేషన్‌కు వెళ్లలేక, ఇటు కొత్త చోట డ్యూటీ లేక ఖాళీగా ఉంటున్నారు. మే 30న వచ్చిన బదిలీల జి.ఓలను నెల దాటినా అమలు చేయలేదు. జూలై 1 నాటికి స్పష్టత ఇస్తామని కమిషనర్ హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. మున్సిపల్ శాఖ స్పెషల్ సిఎస్ ఆదేశాల మేరకు ముగ్గురు కమిషనర్లు, ఈఎన్‌సి ఒక రోజంతా సుదీర్ఘంగా చర్చలు జరిపినా ఫలితం శూన్యమైంది.

**రిటైర్డ్ అధికారులపై ఉన్న శ్రద్ధ.. వంద మంది ఇంజనీర్లపై లేదా?**

ఇటీవల రిటైర్ అయిన ఒక సిఈ (సిఈ)కి సంబంధించిన ఫైళ్లను ఆగమేఘాల మీద కదిపిన అధికార యంత్రాంగం, మూడు కార్పొరేషన్‌ల పరిధిలో బదిలీల వల్ల ఇబ్బంది పడుతున్న దాదాపు 100 మంది ఇంజనీర్ల భవిత్యాన్ని మాత్రం గాలికొదిలేసింది. ఈ నాన్చుడు ధోరణితో తాము ఇంకా ఎన్ని రోజులు మానసిక క్షోభ అనుభవించాలని ఇంజనీర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగంలో సాగుతున్న ఈ వ్యవహారంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అన్నారు.



# గిరిజన, ఆదివాసీల సమస్యలపై పోరాటాలు తీవ్రతరం చేయాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పిలుపు**

**తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో గిరిజన, ఆదివాసీల సమస్యలపై పోరాటాలు తీవ్రతరం చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు. ఈ నెల 18,19 తేదీల్లో రెండు రోజుల పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో జరగనున్న తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3 వ మహాసభల వాల్ పోస్టర్‌ను గురువారం హైదరాబాద్‌లోని సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలు సమగ్ర అభివృద్ధికి నోచుకోలేదని, ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలు అణిచివేస్తున్నాయని, గిరిజన, ఆదివాసీల హక్కులను పరిరక్షించడం కోసం ఉద్యమించాలని కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు. గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్ మాట్లాడుతూ ఈ నెల 18, 19 తేదీలలో రెండు రోజుల పటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణం జరగనున్న రాష్ట్ర 3 వ మహాసభలకు సిపిఐ జాతీయ కార్యదర్శి డి. అని రాజా, అఖిలభారత ఆదివాసి మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి పసుపతి కొల్ , సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు హాజరు కానున్నారని తెలిపారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలోని 33 జిల్లాలనుండి దాదాపు 800 ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. మహాసభలో భాగంగా మొదటి రోజు భారీ ప్రదర్శన అనంతరం ఉంటుందని వెల్లడించారు. అనంతరం ప్రతినిధుల సభ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జరుగుతుందని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని రమావత్ అంజయ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జువారి రమేష్. నాయకులూ వడిత్య స్వరూప. నేనావత్ రూప్ సింగ్. సక్రు నాయక్. శీను నాయక్. వడత్యా దసురు పాల్గొన్నారు.



## రెండు వేల ఇందిరమ్మ ఇండ్లను అదనంగా కేటాయించాలని వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు ఉన్న నియోజకవర్గాలకు అదనంగా రెండు వేల ఇందిరమ్మ ఇండ్లను అదనంగా కేటాయించాలని కాంగ్రెస్‌కు చెందిన ఆదివాసి, గిరిజన ఎంఎల్‌ఏలు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో గిరిజన ఎంఎల్‌ఏలు సిఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడం తో పాటు ఇందిర గిరి జల వికాసం పథకాన్ని అమలు చేయాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని, ఐటిడిఏలను మరింత బలోపేతం చేయాలని వారు సిఎంను విజ్ఞప్తి చేశారు. సిఎంను కలిసిన వారిలో అశ్వరావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, భద్రాచలం ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్ రావు, ఖానాపూర్ ఎంఎల్‌ఏ వెడ్మ బొజ్జు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మ ణ్, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా నడుస్తున్న జెబిఎం ఎలక్ట్రిక్ బస్సుల సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు టిజిఎస్ ఆర్‌టిసి ప్రకటించింది. ఇటీవల జెబిఎం ఎలక్ట్రిక్ బస్సుల్లో వరుసగా చోటుచేసుకున్న బ్యాటరీ అగ్నిప్రమాదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. జెబిఎం సంస్థ ప్రమాదాలపై సమగ్ర నివేదిక, శాశ్వత నివారణ చర్యలు, బ్యాటరీ ఫిట్‌నెస్ సర్టిఫికేషన్, హైదరాబాద్ బస్ భవన్‌లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు వంటి భద్రతా చర్యలపై నివేదిక సమర్పించాలని ఆర్‌టిసి కోరింది. సంస్థ సూచించిన అన్ని భద్రతా ప్రమాణాలు అమలయ్యాయని, 'వాహనం ఆపరేషన్‌కు పూర్తిగా సురక్షితం' అనే ధృవీకరణ లభించిన తర్వాతే ఎలక్ట్రిక్ బస్సుల సేవల పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యం స్పష్టం చేసింది.

## బుల్లెట్‌ప్రూఫ్ వాహనం తొలగించొద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :**బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్‌కు కేటాయించిన బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని ప్రస్తుతం ఉపసంహరించవద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు ప్రస్తుతం ఉన్న భద్రతా ఏర్పాట్లను కొనసాగించాలని, భద్రత తగ్గింపునకు గల కారణాలను కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. భద్రత ఉపసంహరణ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ టి. మాధవీదేవి విచారణ చేపట్టారు. నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించినందున ఇప్పటికీ భద్రతా ముప్పు ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. విచారణను ఈ నెల 7కు వాయిదా వేస్తూ అప్పటి వరకు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని కొనసాగించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

## ఎన్ఐఏకు విద్యార్థి మిస్సింగ్ కేసు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫిన్‌లాండ్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న తెలంగాణ విద్యార్థి మణిదీప్ అదృశ్యమైన ఘటనపై దర్యాప్తును అక్కడి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించినట్లు కేంద్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. కేసు పురోగతిపై కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు ప్రత్యేక నోడల్ అధికారిని కూడా నియమించినట్లు వెల్లడించింది. హయత్‌నగర్‌కు చెందిన మణిదీప్ మే 6 నుంచి కనిపించకుండా పోయాడని, తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ అతని తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. విద్యార్థి మే 5న తల్లితో చివరిసారిగా మాట్లాడిన తర్వాత ఆచూకీ తెలియలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దర్యాప్తు వివరాలు సేకరించేందుకు మరికొంత సమయం కావాలని కేంద్రం కోరడంతో విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది.

## జలగంకు భద్రత కొనసాగించండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే జలగం ప్రసాదరావుకు ప్రస్తుతం కల్పిస్తున్న 1+1 భద్రతను వారంపాటు కొనసాగించాలని హైకోర్టు ఖమ్మం పోలీసు కమిషనర్‌ను ఆదేశించింది. భద్రత ఉపసంహరణ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ టి. మాధవీదేవి విచారణ చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నక్సలిజం నిర్మూలనలో కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో ఇప్పటికీ భద్రతాపరమైన ముప్పు ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. భద్రతా సమీక్ష కమిటీ నివేదిక ఆధారంగానే నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం తెలిపింది. కమిటీ నివేదికను సమర్పించాలని ఆదేశించిన కోర్టు విచారణను ఈ నెల 6కు వాయిదా వేసి, అప్పటి వరకు భద్రత కొనసాగించాలని స్పష్టం చేసింది.

# 'సర్'లో లోపించిన పారదర్శకత



'పివి స్మారకోపన్యాస' సభలో పరకాల ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)లో పారదర్శకత లోపించిందని, జవాబుదారీతనం కరువైందని, ఇందులో ఉన్న విధానపరమైన లోపాలను పౌర సమాజం, బుద్ధి జీవులు ప్రశ్నించాలని ప్రఖ్యాత ఆర్థిక, సామాజిక విశ్లేషకులు, రచయిత డాక్టర్ పరకాల ప్రభాకర్ పిలుపునిచ్చారు. మాజీ ప్రధాని, భారత రత్న పి.వి. నరసింహారావు 105 వ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, సిఎస్‌టిడి భవనంలోని సి.నారాయణ రెడ్డి ఆడిటోరియంలో గురువారం ''ఎస్ఐఆర్ 202526: భారతదేశ భావనను ఛిన్నాభిన్నం చేయడమా?'' అనే అంశంపై పరకాల ప్రభాకర్ 'పివి స్మారకోపన్యాసం' చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, బలోపేతం చేసేందుకు, పారదర్శకమైన, కచ్చితమైన ఓటర్ల జాబితానే పునాది అని అన్నారు. సర్ పేరుతో ఓట్లను తొలగించడం ప్రాజాస్వామ్యానికి, రాజ్యంగా రచయిత డా.అంబేడ్కర్ ఆలోచన విధానాలకు వ్యతిరేకమన్నారు. గతంలో ఓటర్లు నాయకులను ఎన్నుకునేవారాని, ప్రస్తుతం నాయకులే తమకు నచ్చిన వారిని ఓటర్లుగా ఉండేలా నిర్ణయిస్తున్నారని , ఇది మంచి పరిణామం కాదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అందరూ ఉన్నత విద్యను అభ్యసించేలా సమాన అవకాశాలను కల్పిస్తూ ప్రజాస్వామ్య విలువలను సగర్వంగా నిలబెదుతున్నామన్నారు. అనంతరం పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ ఆధునిక భారతదేశ గొప్ప నాయకులలో పివి ఒకరని అన్నారు. భారతరత్న పి.వి. నరసింహారావు ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆయన అద్భుతమైన నాయకత్వం, మేధస్సు, రాజనీతిజ్ఞత దేశంపై చెరగని ముద్ర వేశాయని గుర్తు చేశారు.వందేమాతరంపై కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్ జారీ చేయడం,జనాభా మార్పులపైన ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు, కొన్ని రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించారని, వీటిపైన ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పేవారే లేరన్నారు. 2002లో చేపట్టిన విస్తృత సవరణతో పోలిస్తే ప్రస్తుత ఓటర్ల జాబితా అందుకు భిన్నంగా ఉందన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎక్కువ ఓట్లు కోల్పోయిన వారిలో మైనారిటీలు, దళితులు, ఆదివాసిలు, మహిళలు, రోజువారీ కూలీలు, ఆర్థికంగా బలహీన వర్గాలే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలోని మేధావులు వెంటనే మేల్కొని రాష్ట్రంలోని వయోజనుల సంఖ్య కంటే ఒక్క ఓటు తక్కువగా ఉన్నా వదిలే ప్రసక్తి లేదని ఎన్నికల అధికారులకు హెచ్చరించాలని పిలుపునిచారు. కేంద్ర ఎన్నికల సంఘంలో జావాబుదారీ తనం లేకుండా పోయిందన్నారు. ఎంఎల్‌సి సురభి వాణి దేవి మాట్లాడుతూ తన తండ్రి పివి ప్రజా జీవితమంతా సమానత్వం, పురోగతి, సామాజిక న్యాయం వంటి విలువలను పాటిస్తూ, సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, సమగ్రాభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (అకాడమిక్) ప్రొఫెసర్ జి. పుష్ప చక్రపాణి,రిజిస్ట్రార్ సభకు స్వాగతం పలుకగా, డాక్టర్ ఎల్.వి.కె. రెడ్డి వందన సమర్పణ చేశారు.



## వ్యవసాయ శాఖను సందర్శించిన ఇండోనేషియా ప్రతినిధి బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆధునిక, పారదర్శక విధానాలు ఎంతో చాలా బాగున్నాయని ఇండోనేషియా ప్రతినిధులు ప్రశంసించారు. ఆహార భద్రత, వ్యవసాయ స్వయం సమృద్ధి, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి అంశాలపై అధ్యయనం కోసం ఇండోనేషియాకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం గురువారం తెలంగాణ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాన్ని సందర్శించింది. ఈ బృందం తెలంగాణ వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా.బి.గోపిను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణలో అమలవుతున్న రైతు పథకాలు, సాంకేతిక ఆధారిత వ్యవసాయ విధానాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇండోనేషియా ప్రతినిధులకు రాష్ట్ర అధికారులు వివరించారు. రైతు భరోసా, రైతు బీమా, ప్రకృతి వ్యవసాయం, డిజిటల్ క్రాప్ సర్వే, అగ్రి స్టాక్, యూరియా బుకింగ్ యాప్, వ్యవసాయ డ్రోన్ల వినియోగం వంటి కార్యక్రమాలపై వివరాలు అందించారు. అలాగే విత్తన అభివృద్ధి, ధృవీకరణ వ్యవస్థలు , ఉద్యానవన శాఖ కార్యక్రమాలపై కూడా సమాచారం ఇచ్చారు. వ్యవసాయ పరిశోధన, సాంకేతిక మార్పిడి, ఆహార భద్రత వంటి అంశాలపై ఇరు పక్షాలు విస్తృతంగా చర్చించాయి.

## సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్‌లో రెవల్యూషనరీ కమ్యూనిస్టు సెంటర్ విలీనం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్‌లో రెవల్యూషనరీ కమ్యూనిస్టు సెంటర్ (ఆర్‌సిసి)విలీనమైంది. ఇక మీదట రెవల్యూషనరీ కమ్యూనిస్టు సెంటర్ సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్‌గా కొనసాగనుంది. ఈ మేరకు ఇరు పార్టీల మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో విస్తృత చర్చల అనంతరంఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తరుపున ప్రదీప్ సింగ్ ఠాకూర్, సుభాష్ దేవ్, పోటు రంగారావు, రెవల్యూషనరీ కమ్యూనిస్టు సెంటర్ తరపున అర్జున్ ప్రసాద్ సింగ్, దర్శన్ పాల్, బచ్చాప్రసాద్ సింగ్‌లు పాల్గొన్నారు. భారత సమాజ స్వరూపం, రాజ్యం, విప్లవ దశ, శత్రు-మిత్ర శక్తులు, ప్రధాన వైరుధ్యం వంటి సిద్ధాంత అంశాలపై ఇరు పక్షాలు ఏకాభిప్రాయానికి రావడంతో పాటు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, కార్మిక-రైతు కూటమి ఆధారంగా ప్రజాతంత్ర విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా ప్రకటించారు. ఈ విలీన ప్రక్రియ ద్వారా పార్టీ సంస్థాగతంగా బలోపేతం కానుందని నాయకులు వెల్లడించారు.

## కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుల నియామకం



**ప్రజాపక్షం/బేగంపేట్:** కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులను నియమిస్తూ టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రకాశంనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దర్గా కరుణాకర్ నియమితులయ్యారు. కూకట్‌పల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 16 డివిజన్లకు నూతన అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

# నాలాలో చెత్త వేస్తే కఠిన చర్యలు

**ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాలాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. వర్షాకాల ముందస్తు కార్యాచరణలో భాగంగా కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి గురువారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. చిలకనగర్ పార్కు, సరూర్ నగర్ ప్రజా నివాస్ ఫేజ్ 1, ఉప్పల్ బీరప్పగడ్డ రోడ్, చిలకనగర్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చిలకనగర్ లోని బ్యాంక్ కాలనీ పార్కు నిర్వహణను స్వయం సహాయక సంఘం సభ్యులకు అప్పగించగా, వారు పార్కును అత్యంత పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దిన తీరుపై కమిషనర్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పార్కులను వీరికి అప్పగిస్తామని, ప్రజల భాగస్వామ్యంతో పట్టణ హరితాభివృద్ధిని బలోపేతం చేయాలన్నారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో నిరంతర చెత్త తొలగింపు కార్యక్రమాలను (జివిపిల నిర్మూలన) పర్యవేక్షించారు. ఉప్పల్ బీరప్పగడ్డ రోడ్డులో ఫ్రైడే డ్రై డే, వెక్టర్ కంట్రోల్ చర్యలను పరిశీలించి, దోమల లార్వా పెరగకుండా, నిల్వ నీరు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఉప్పల్ చిలకనగర్ మెయిన్ రోడ్డులోని ఓపెన్ నాలాను పరిశీలించిన కమిషనర్, ప్లాస్టిక్, ఘన వ్యర్థాలు నాలాలో వేయడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలా పరిసరాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని, అక్రమంగా చెత్త వేసే వారిపై జరిమానాలు విధిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



## సిఎస్‌ను కలిసిన టూరిజం కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్ నేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును ఆయన ఛాంబర్‌లో టూరిజం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సబ్బు రాజమౌళి సిఎస్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టూరిజం శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ఆయన సిఎస్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిందిగా కోరారు.

## ఆర్‌టిసి రూ.1700 కోట్ల లాభాల్లోకి వచ్చినా ఉద్యోగుల బకాయిలు చెల్లించరా?

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత ఏడు సంవత్సరాలుగా బస్సు టికెట్ ఛార్జీలు పెంచకుండానే టిజిఎస్ ఆర్‌టిసి రూ.1,700 కోట్ల లాభాలను అర్జించిందని, 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 ఏప్రిల్ 30 వరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆర్‌టిసి ఆర్థిక పరిస్థితి గతంతో పోలిస్తే గణనీయంగా మెరుగుపడిందని పేర్కొన్న ఆయన, సంస్థ లాభాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో ఉద్యోగుల హక్కు అయిన బకాయిల చెల్లింపులో ఆలస్యం చేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బకాయిలను విడుదల చేసి వారికి న్యాయం చేయాలని ఎం. నాగేశ్వరరావు కోరారు.

## ఉపాధ్యాయులను ఇహెచ్‌ఎస్‌లోకి తీసుకురావాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని తెలంగాణ మోడల్ స్కూళ్లలో (ఆదర్శ పాఠశాలలు) పనిచేస్తున్న ఉపాధ్యాయులను 'ఉద్యోగుల ఆరోగ్య పథకం' (ఇహెచ్ఎస్) పరిధిలోకి తీసుకురావాలని వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి పింగిళి శ్రీపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు విద్యాశాఖలో పూర్తి స్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా కొనసాగుతున్నారని, వారు నిరంతర సేవలు అందిస్తున్నప్పటికీ, వారికి ఇప్పటి వరకు 'ఇహెచ్ఎస్' సౌకర్యాన్ని కల్పించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయు లు కీలకపాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు.ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కూడా ఈహెచ్ఎస్ సౌకర్యాన్ని వర్తింపజేయడం ద్వారా వారికి సామాజిక, వైద్య భద్రత లభిస్తుందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి, వీలైనంత త్వరగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను ఉద్యోగుల ఆరోగ్య పథకం పరిధిలోకి తీసుకొస్తూ తగిన చర్యలు తీసుకోవాలని పింగిళి శ్రీపాల్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రెవెన్యూ రికార్డులు బయటికెలా వచ్చాయ్?

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధికారిక నిర్ణయాలు వెలువడకముందే రెవెన్యూ శాఖ అంతర్గత పత్రాలు సంబంధిత వ్యక్తుల చేతికి ఎలా చేరుతున్నాయంటూ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితి అధికారిక రికార్డుల భద్రతపై అనుమానాలు కలిగిస్తోందని వ్యాఖ్యానించిన న్యాయస్థానం, సమాచార లీకేజీని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై ఈ నెల 13లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. జోగులాంబ గద్వాల జిల్లాలోని భూమికి సంబంధించిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టగా, అధికారుల మధ్య మార్పిడి అయిన అంతర్గత పత్రాలు నిర్ణయం వెలువడకముందే బయటకు రావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. శాఖలో సమాచార నియంత్రణ, పత్రాల రక్షణ, అధికారుల బాధ్యతలపై ప్రత్యేకంగా సమీక్షించి నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 13కు వాయిదా వేశారు.

## ఎర్రకుంట ఆక్రమణలపై వివరణ ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లాలాగూడలోని ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో జరుగుతున్న ఆక్రమణలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని హైకోర్టు హైడ్రా, హెచ్ఎండీయేలను ఆదేశించింది. అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. చెరువు విస్తీర్ణంలో సుమారు ఎనిమిది ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయని, అక్రమ నిర్మాణాలను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోర్టును కోరారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి పేదల గుడిసెల తొలగింపులో చురుకుగా ఉండే అధికారులు చెరువు ఆక్రమణల విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 16కు వాయిదా వేశారు.

# పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం



## డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ, మౌలిక సదుపాయాలపై సమీక్ష

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి క్యాంప్ కార్యాలయంలో సింగన్నగూడెం వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లకి సంబందించిన మౌలిక సదుపాయాలపై భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఇప్పటికే కేటాయించిన నేపథ్యంలో, వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇళ్లలో నివాసం ఉండేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అత్యవసరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో తాగునీటి సరఫరా, విద్యుత్, అంతర్గత సీసీ రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు మిగిలి ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులో పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన అదనపు నిధులను సమకూర్చి అన్ని పనులను పూర్తి స్థాయిలో పూర్తి చేసి, నిర్దేశించిన సమయంలో లబ్ధిదారులకు ఇళ్లను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. డబుల్ బెడ్రూమ్ కాలనీని పూర్తిస్థాయిలో నివాసయోగ్యంగా తీర్చిదిద్ది, లబ్ధిదారులు ఎలాంటి అసౌకర్యం లేకుండా నివాసం ఉండేలా అన్ని చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజులవెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డి, భువనగిరి మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ శ్రీరేఖ బాబురావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, కౌన్సిలర్లు, పంచాయతీ రాజ్, మున్సిపల్ హౌసింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పామాయిల్ పంటలపై మొగ్గు చూపండి

## సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపు

### పామాయిల్ సాగు పంటల పరిశీలన



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** రైతులు వరి సాగుకు స్వస్తి పలికి రాబోయే రోజుల్లో లాభసాటిగా ఉండే పామాయిల్ తోటలవైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కాసరాబాద్‌లోని ఆయిల్‌ఫామ్ పంటలను ఆయన పరిశీలించి పామాయిల్ సాగు చేస్తున్న మల్లేష్ అనే రైతుతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ తోటలు రైతులకు సిరుల పంటగా మారనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులకు మేలు చేసే పంటల్లో పామాయిల్ అత్యుత్తమమైనదన్నారు. వరి సాగుతో పోలిస్తే ఇందులో పెట్టుబడి భారం చాలా తక్కువని తెలిపారు. ఒక్కసారి ఈ తోటను నాటితే నాలుగు సంవత్సరాల నుంచి మొదలై ఏకంగా 30 సంవత్సరాల వరకు రైతులకు స్థిరమైన, అధిక ఆదాయం లభిస్తుందని వివరించారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు 70 నుండి 90 శాతం వరకు భారీ సబ్సిడీని అందిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న ఈ అద్భుతమైన సదుపాయాలను, రాయితీలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో కోకో, వక్క, మిరియాలు, తమలపాకు బహుళ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణయ్య, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి తీగల నాగయ్య, వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య, సూర్యాపేట డివిజన్ ఉద్యాన అధికారి కట్ట స్వాతి, ఉద్యాన విస్తరణ అధికారులు యారాల సుధాకర్ రెడ్డి, రంగు ముత్యం రాజు, వంగూరి అనిల్, ఆయిల్ ఫెడ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నిమ్మ గోపికృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ భవిష్య, రైతులు పాల్గొన్నారు.

# 'సర్' ప్రక్రియలో తప్పిదాలు చేస్తే చర్యలు

## 100 ఎన్యూమరేషన్ పూర్తిచేయాలి: కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో సూపర్‌వైజర్లు,బీఎల్ఓలు ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈఆర్వోలు,ఏఈఆర్వోలు,మున్సిపల్ కమిషనర్లు,తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సర్ ప్రక్రియను సమీక్షించారు. జిల్లాలో ఎన్యుమరేషన్ 98 పూర్తయింది. మిగిలిన 2 వెంటనే పూర్తిచేసి 100లక్ష్యం సాధించాలి. బీఎల్ఓలు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లాలి. మున్సిపల్ సిబ్బంది, వార్డు అధికారులు బీఎల్ఓలకు సహకరించాలి అని కలెక్టర్ అన్నారు. పని తీరు సరిగాలేని బీఎల్ఓలకు శిక్షణ ఇవ్వాలని, హెల్ప్ డెస్క్‌లు సమర్థంగా నిర్వహించాలన్నారు. విధులను సక్రమంగా నిర్వహించని బీఎల్ఓలపై కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. కొత్త విద్యా సంవత్సరం నేపథ్యంలో విద్యార్థులకు జనన ధ్రువీకరణ, ఆధార్, ఇతర సర్టిఫికెట్లు మీ సేవ ద్వారా త్వరితగతిన అందించాలని, భూభారతి, సాదాబైనామా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పెండింగ్ దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు జె. శ్రీని వాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్ఓ దశరథ పాల్గొన్నారు.

**పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ అన్నారు.గురువారం ఆయన పట్టణంలోని పానగల్ రహదారిలోని అర్బన్ హాస్పిటల్ ఎదురుగా,శ్రీనగర్ కాలనీలలో ఇంటింటికి వెళ్లి బీఎల్ఓలు నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వడం, పూర్తిచేసి తిరిగి సేకరించడం, 6,7,8 ఫారాల నిర్వహణను పరిశీలించారు. బీఎల్ఓలు కిట్, ఐడెంటిటీ కార్డుతో వస్తున్నారా, బీఎల్ఏలు హాజరవుతున్నారా అని ఆరాతీశారు.

# ఏడుగురు జూదరుల అరెస్ట్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై మిర్యాలగూడ రూరల్ పోలీసులు గురువారం సాయంత్రం మెరుపు దాడి చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం వెంకటాద్రిపాలెంలోని నయారా పెట్రోల్ బంక్ వెనకాల గల ఖాళీ స్థలంలో కొంతమంది వ్యక్తులు గుంపుగా చేరి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు రూరల్ పోలీసులు సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకోగా, మరో వ్యక్తి పోలీసులను చూసి అక్కడి నుండి తప్పించుకొని పారిపోయాడు. పట్టుబడిన జూదరుల నుండి రూ. 2,790 నగదు, ఐదు సెల్ ఫోన్లు, ఐదు మోటారు సైకిళ్లు, 104 ప్లేయింగ్ కార్డులతో పాటు ఆట కోసం ఉపయోగించిన గ్రౌండ్ షీట్లను పోలీసులు స్వాధీనపరచుకున్నారు. ఘటనా స్థలంలో పంచనామా నిర్వహించి, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా చట్టవిరుద్ధంగా పేకాట వంటి జూద క్రీడలు ఆడితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# చేపల వేట నిషేధం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జూలై 1 నుండి ఆగష్టు 31 వరకు కృష్ణా నది, పులిచింతల రిజర్వాయర్ పరిధిలో చేపల వేట పూర్తిగా నిషేధించబడిందని జిల్లా మత్స్యశాఖ అధికారి డి. ఆంజనేయస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపల సంతానోత్పత్తి కాలాన్ని పరిరక్షించడం, చేపల సంపదను అభివృద్ధి చేయడం, జలవనరుల స్థిరమైన వినియోగాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా నిషేదించినట్లు పేర్కొన్నారు. ఈ నిషేధిత కాలంలో మత్స్యకారులు ఎలాంటి వలలు, పడవలు లేదా ఇతర చేపల వేట పరికరాలను ఉపయోగించి చేపల వేట చేపట్టరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై అమలులో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం తగిన చట్టపరమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. మత్స్యకారులు, మత్స్య సహకార సంఘాల సభ్యులు, ప్రజలు ఈ నిషేధాన్ని స్వచ్ఛందంగా పాటించి, చేపల సంపద పరిరక్షణకు సహకరించాలని కోరారు.

# దేవాలయ భూములు అన్యాక్రాంతమని తేలితే చర్యలు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** దేవాలయ భూములు అన్యాక్రాంతమని తేలితే వదిలిపెట్టేది లేదని చర్యలు తీసుకుంటామని సర్వే అధికారులు చెప్పారు.పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలోని శ్రీ రాజగోపాల స్వామి దేవస్థాన మాన్యాలు అన్యాక్రాంతం అవుతున్నాయని కమిషనర్కు వినతి పెట్టుకున్న దరిమిలా అధికారులు స్పందించి గురువారం ఆదేవస్థాన కమిటీ చైర్మన్ చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో మండల సర్వే అధికారి సర్వే చేపట్టారు. దేవాదాయ ధర్మదాయ శాఖ మండల ఇంచార్జి వెంకట్ రెడ్డి బృందం పర్యటించి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూఅక్రమంగా కబ్జాలో ఉన్నవారిని త్వరలోనే తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర చిన్న నారాయణ, ఎర్ర శంకరయ్య, జింక సత్యనారాయణ, పావిరాల లింగస్వామి, మొగిలిపాక శ్రీనివాస్, భీమగోని ఉండటి ప్రసాద్, శనిగరం ఐలయ్య, ఉడుతల రామకృష్ణ తాడూరి తదితరులు పరమేష్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పార్టీ బలోపేతమే ధ్యేయంగా ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలని నల్లగొండ మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. గురువారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నల్లగొండ మండలం, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నూతనంగా ఎంపికైన గంగుల సైదులు, ఎడ్ల శ్రీనివాస్,తిప్పర్తి, కనగల్ మండల పార్టీ అధ్యక్షులుగా ఎంపికైన పాదూరి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం అనుప రెడ్డిలను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పట్టణ,మండల పార్టీ అధ్యక్షులుగా అవకాశం కల్పించాడని అన్నారు. పార్టీ పటిష్టత కోసం కష్టపడి పని చేయడం పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందే విధంగా చూడాలని కోరారు.ఈకార్యక్రమంలో నల్లగొండ నగర డిప్యూటీ మేయర్ మహమ్మద్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మాజీ జెడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య,నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,పలువురు కార్పొరేటర్లు,సర్పంచ్‌లు,మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఆలేరులో భూ యాజమానులపై అధికార పార్టీ కౌన్సిలర్ల బెదిరింపులు!

## ముగ్గురు కౌన్సిలర్లు డబ్బులు ఇవ్వాలని డిమాండ్



**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్ పేట రెవిన్యూ మంతపురి గ్రామానికి చెందిన ఐదుగురు స్నేహితులు కలిసి బహదూర్ పేట రెవిన్యూ పరిధిలో ఒక ఎకరం భూమి కొనుగోలు చేసుకున్నారు భూమి కొనుగోలు చేసుకుని ఐదుగురు స్నేహితులు ఎవ్వరి వాటా వారి పేరు పైన రిజిస్టర్ చేసుకున్నారు. వారు కొనుగోలు చేసుకున్న భూమి భాగ పంపిని చేసుకుని నివాసం ఉండటానికి రేకులతో షెడ్ నిర్మాణం చేసుకున్నారు దీనితో పాటుగా పండ్ల తోటలు, కూరగాయలు, పూల మొక్కలు, కుందేళ్లు కోళ్ల పెంపకం చేపడుతున్నారు ఇటీవల గెలిచిన కొందరు కౌన్సిలర్ లు పదవిని అడ్డు పెట్టుకుని అక్రమ వసూళ్లకు బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ప్రజాపక్షంను ఆశ్రయించారు. ఇదే కాకుండా ఆలేరు మున్సిపల్ పరిధిలోని వెంచర్ల యజమానులను బెదిరింపులకు పాల్పడుతూ సెటిల్మెంట్లకు అక్రమ దందాలకు పాల్పడుతున్నారని కౌన్సిలర్ పదవిని అడుగు పెట్టుకొని రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని సదరు బాధితులు గోడువెళ్లబోస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని కౌన్సిలర్ల అక్రమ దందాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.



# నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ భద్రతపై జిల్లా ఎస్పితో ప్రత్యేక రక్షణ

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ డ్యాం,ప్రధాన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల భద్రతా చర్యలపై నాగార్జునసాగర్ ప్రత్యేక రక్షణ దళ అధికారులు గురువారం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శరత్ చంద్ర పవార్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.రక్షణ దళ అసిస్టెంట్ కమాండెంట్ బి.రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ప్రధాన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు,తీసుకుంటున్న రక్షణ చర్యలను జిల్లా ఎస్పి కి అధికారులు వివరించారు. ప్రాజెక్టు భద్రతకు సంబంధించిన పలు అంశాలపై ఇరువర్గాల మధ్య చర్చ జరిగింది.ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం నుంచి నాగార్జున సాగర్ డ్యాం, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల భద్రతకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ హామీ ఇచ్చినట్లు ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బి.రాజు తెలిపారు.జిల్లా ఎస్పి కలిసిన వారిలో సాగర్ డ్యాం ఎస్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు,జెన్‌కో ఎస్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీ బస్సులు నిలిపివేత: ప్రయాణికుల అవస్థలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్రవ్యాప్తంగా ఈవీ బస్సులను ఆకస్మికంగా నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ఆరోపించారు.ఇటీవల ఓ ఎలక్ట్రికల్ బస్సు ప్రమాదవశాత్తు కాలిపోయింది.అదృష్టవశాత్తు అందులో ప్రయాణికులు లేరు. ఆ ఘటనతో రాష్ట్రంలో ఈవీ బస్సుల మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. జేబీఎం ప్రైవేట్ సంస్థ బస్సులను రోడ్డెక్కించే ముందు ఫిట్‌నెస్,బాడీ బిల్డింగ్,ఎలక్ట్రికల్ సమస్యలను పరిశీలించకుండానే డిపోలకు పంపారా అని ఆయన ప్రశ్నించారు.ముందు జాగ్రత్త చర్యలు లేకుండా అకస్మాత్తుగా బస్సులు నిలిపివేయడం,ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఎక్స్‌ప్రెస్ బస్సులకు డీలక్స్ బోర్డులు, ఆర్డినరీకి ఎక్స్‌ప్రెస్ బోర్డులు వేసి ప్రయాణికులను దోపిడీ చేస్తున్నారు అని విమర్శించారు.ఆర్టీసీకి సొంతంగా బస్సులు తయారుచేసే నైపుణ్యం ఉన్నా ప్రైవేటు బస్సులు తేవడం సమంజసం కాదు.ప్రభుత్వ ఆలోచన లేని నిర్ణయాలతోనే ఇలాంటి పొరపాట్లు జరుగుతున్నాయి.తక్షణమే జేబీఎం బస్సులను రద్దుచేసి, ప్రభుత్వ ఆధీనంలో సొంత బస్సులనే నడపాలి అని డిమాండ్ చేశారు.

# బిసి కళాకారుల ప్రదర్శన మేళాకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బోనాల పండుగ సందర్భంగా జూలై 16 నుండి 26 వరకు (11 రోజులు) హైదరాబాద్‌లోని హెచ్ఎండిఏ గ్రౌండ్స్‌లో బిసి కళాకారుల ప్రదర్శన కమ్ అమ్మకపు మేళాలో పాల్గొనదలిచిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విశాల్ ధార గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో సుమారు 100 స్టాల్స్ ఏర్పాటు చేయబడుతాయన్నారు. కుండల తయారీదారులు, వెదురు కళాకారులు, ఇనుము, చెక్క కళాకారులు, నీరా ఉత్పత్తిదారులు, చేనేత కళాకారులు, తెలంగాణ సాంప్రదాయ ఆహార ఉత్పత్తిదారులు, తదితర అర్హులైన బిసి వృత్తి కళాకారులకు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించుకునే అవకాశం కల్పించబడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని అర్హులైన బిసి వృత్తి కళాకారులు, హస్తకళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొనదలచినట్లయితే అట్టి వివరాలతో ఈనెల 8న సూర్యాపేట జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో జరుగు సమావేశానికి హాజరు కావాలని సూచించారు. ఎంపికైన ప్రతి స్టాల్‌కు ఇద్దరు ప్రతినిధులకు జిల్లా నుండి హైదరాబాద్ వరకు ఒక వైపు రవాణా సౌకర్యం, 11 రోజులపాటు వసతి, టీ, అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనం ఉచితంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో కల్పించబడుతుందని వివరించారు. ఆసక్తి కలిగిన అర్హులైన బిసి వృత్తి కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఉత్పత్తులను విక్రయించుకోవాలని కోరారు.

# అవార్డులకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు 2026ల ఎంపికకు గాను ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె. అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 10 చివరి తేదీ అని పేర్కొన్నారు. జిల్లాలో అర్హత గల ఉపాధ్యాయులందరూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కొరకు వారి వారి ధృవీకరణ పత్రములతో నేషనల్‌అవార్డ్స్ టు టీచర్స్ ఎడ్యుకేషన్ పోర్టల్ నందు వ్యక్తిగతంగా అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

# విద్యా ప్రమాణాల్లో 'చందంపల్లి భేష్'




**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ మండలంలోని చందంపల్లి మండల పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలను గురువారం రాష్ట్ర విద్యా పరిశోధన,శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) సంచాలకుడు రమేష్,డీఈఓ సుసింధర్ రావు పాఠశాలను సందర్శించారు.క్షేత్రస్థాయిలో విద్యా బోధన,విద్యార్థుల క్రమశిక్షణ, పాఠశాల నిర్వహణ తీరును వారు పరిశీలించారు. విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాల పెంపొందింపునకు తీసుకుంటున్న చర్యలను ప్రధానోపాధ్యాయులు, బాలవాటిక బోధకురాలిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల శ్రద్ధ, పాఠశాలలోని విద్యా వాతావరణం, పరిశుభ్రతపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాల నిర్వహణలో వారు ప్రశంసించారుఇదే స్ఫూర్తితో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని సూచించారు. పాఠశాల ఉత్తమ నిర్వహణకు గుర్తింపుగా హెచ్ఎం,బాలవాటిక బోధకురాలిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఉన్నతాధికారుల ప్రశంసలపై ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. వారి వెంట మండల విద్యాశాఖ అధికారి మేక నాగయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.నవీన్ రెడ్డి,ఆదిద్య,అనిత శ్రీహరి అమరలింగాచారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.అనంతరం నకిరేకల్ లో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పాఠశాలను మధ్యాహ్న భోజనం సమయంలో తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.కూర రుచికరంగా లేదని కారం ఎక్కువగా ఉండటం వల్ల విద్యార్థులు తినలేకపోయారని తెలిపారు. విద్యార్థులకు న్యాణమైన భోజనం అందించాలని ఆదేశించారు .ఏజెన్సీ లోపాలను మార్చుకొక పోతే వెంటనే తొలగించాలని మండల విద్యాధికారికి ఆదేశించారు.

# కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న నాలుగు కోర్టు కాంప్లెక్స్ బిల్డింగ్ పనులను సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ జరుగుతున్న పనుల తీరును, నిర్మాణంలో ఉన్న వివిధ విభాగాల గదులను, న్యాయస్థానాల రూపు రేఖలను ఆయన పరిశీలించి గుత్తేదారుకు తగు సూచనలు చేశారు. నిర్ణీత సమయంలోగా భవన నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావాలన్నారు.

# గీత కార్మికులపై సర్కార్ సవతి తల్లి ప్రేమ



## రూ.6 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలు వెంటనే విడుదల చేయాలి : గీతా పనివారల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పబ్బు వీరస్వామి

**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్రంలోని గీత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,గీత కార్మికుల పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తోందని గీత పనివారల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పబ్బు వీరస్వామి విమర్శించారు. ఎన్నికల సమయంలో గీత కార్మికుల సంక్షేమం కోసం అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం నల్లగొండలోని సిపిఐ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మరబోయిన లాలు అధ్యక్షతన నిర్వహించిన గీతా పనివారల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గీత కార్మికులకు ప్రభుత్వం అందించాల్సిన రూ.6 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడం తీవ్ర అన్యాయమని, వెంటనే నిధులు విడుదల చేసి బాధిత కుటుంబాలకు అందజేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులు ప్రతి రోజూ ప్రాణాలను పణంగా పెట్టి చెట్లెక్కి జీవనం సాగిస్తున్నారని, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన లేదా గాయపడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. అయితే బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల అనేక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ అర్హులైన గీత కార్మికులకు వృత్తి పెన్షన్లు, వితంతు పెన్షన్లు తక్షణమే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.గీత కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అన్ని పథకాలను పారదర్శకంగా అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గీత వృత్తిని పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, గీత కార్మికుల పిల్లలకు విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేయాలనికోరారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టాల్సి వస్తుందని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో గీత పనివారల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి సూరిగి చలపతి, ఉపాధ్యక్షులు బొమ్మరబోయిన లాలు, పల్లె శంకర్, నాయకులు జయరాములు, గంట నాగేష్, వనం వెంకన్న, మాధగోని మల్లయ్య,జిల్లా రాములు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
శుక్రవారం
03-07-2026
www.prajapaksham.in

'అఖిల్ అక్కినేని హీరోగా నటించిన 'లెనిన్' మూవీ ట్రైలర్‌పై సూపర్ స్టార్ మహేష్ బాబు, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ ట్రైలర్ తనకు ఎంతగానో నచ్చిందని, అఖిల్ తన పాత్రలో అద్భుతమైన భావోద్వేగాన్ని, ఫైర్ చూపించారని మహేష్ ఎక్స్ వేదికగా కొనియాడారు.'

రీల్

## 'హైలెస్సో'లో విలన్‌గా శివాజీ



సుధీర్ ఆనంద్ ( సుడిగాలి సుధీర్) హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం హైలెస్సో. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఇది వారి బ్యానర్‌కు ప్రొడక్షన్ నంబర్ 1, సుధీర్ ఆనంద్‌కు హీరోగా ఐదవ చిత్రం.గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ లైలం బాబు' అనే పవర్ ఫుల్ విలన్ పాత్రలో కనిపించను న్నారు. శివాజీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో నల్లటి దుస్తులు, పంచెకట్టుతో రాతి సింహాసనంపై కూర్చొని, చేతిలో సీసా పట్టుకుని శివాజీ కనిపించిన తీరు ఆయన పాత్రలోని పవర్ ని చూపిస్తోంది. 'లైలం బాబు' పాత్రలో శివాజీ తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ అవతార్‌లో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఈ ఫస్ట్ లుక్ తో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ కన్నడ నటి అక్షర గౌడ ఈ కీలక పాత్రలో కనిపించను న్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శర్మ ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు.అనుదీప్ దేవ్ సంగీతం అందించగా, సుజాత సిద్ధార్థ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ఎడిటర్‌గా చోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్ బ్రహ్మ కడలి, చింతా శ్రీనివాస్ రైటర్. హై లెస్సో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది.



## ప్రసాద్ ల్యాబ్స్‌లో వనజీవి అవార్డు ప్రదానోత్సవం

కోటి మొక్కల రామయ్యగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన పర్యావరణ ఉద్యమ కారుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి దరిపల్లి రామయ్య సేవలను చిరస్థాయిగా నిలబెట్టే ఉద్దేశంతో రూపొందిన లఘుచిత్రం 'వనజీవి రామయ్య'. వాస్మిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనజీవి అవార్డు పురస్కార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వనజీవి దరిపల్లి రామయ్య జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవకులను ఘనంగా సత్కరించారు. సమాజానికి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని అందించిన మహనీయుడు దరిపల్లి రామయ్య జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించిన 'వనజీవి రామయ్య' లఘుచిత్రం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రదానం చేసే 'గద్దర్ అవార్డ్స్'లో ఉత్తమ లఘుచిత్రాల విభాగానికి ఎంపిక కావడం విశేషం. ఈ చిత్రంలో బ్రహ్మాజీ టైటిల్ పాత్రలో నటించగా, నంది అవార్డు గ్రహీత వేముగంటి దర్శకత్వం వహించారు. నిడిగొండ నరేష్ కుమార్ ప్రజాపతి, నిర్మాతగా వ్యవహరించారు. డా. కళా రంగా కథను అందించగా, బల్లేపల్లి మోహన్ సంగీతాన్ని సమకూర్చారు. తెలంగాణ రాష్ట్రంలోని పల్లెప్రకృతి వానలకు వనజీవి రామయ్య పేరును పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ అలాగే పాన్ ఇండియా ఫీచర్ ఫిల్మ్‌గా రూపొందిస్తున్నామని నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి ప్రకటించారు.దర్శకుడు వేముగంటి మాట్లాడుతూ దాదాపు ఏడు దశాబ్దాల పాటు తన జీవితాన్నే మొక్కల కోసం అంకితం చేసిన వనజీవి రామయ్యను భావితరాలు ఎన్నటికీ మరచిపోకూడదు. ఆయన సేవలు, జీవన తత్వం ప్రతి ఒక్కరికీ చేరాలనే లక్ష్యంతో 'వనజీవి రామయ్య' చిత్రాన్ని రూపొందించాం. ఈ సినిమా ద్వారా పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన కలుగుతుందని ఆశిస్తున్నాం అన్నారు.హీరోయిన్ నాగరాణి మాట్లాడుతూ ఇంత గొప్ప సందేశాత్మక చిత్రంలో భాగస్వామ్యం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి మంచి సినిమాలు మరెన్నో రావాలి. ఈ అవకాశం కల్పించిన దర్శకుడు, నిర్మాతలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అని అన్నారు.సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ మాట్లాడుతూ ప్రకృతినే జీవితంగా భావించి కోట్లాది మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు వనజీవి రామయ్య. మహనీయుడి జీవిత కథ ఆధారంగా రూపొందిన చిత్రానికి సంగీతం అందించడం నా కెరీర్‌లో గర్వించదగ్గ అవకాశంగా భావిస్తున్నాను. ఈ చిత్రాన్ని ఎంతో హృదయానికి హత్తుకునేలా తెరకెక్కించగా, నిర్మాతలు ఎలాంటి రాజీ లేకుండా మంచి సందేశాన్ని ప్రజలకు చేరవేసే ప్రయత్నం చేశారు. ఈ చిత్రం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తుందని నమ్ముతున్నాను అన్నారు.

## 'సిగ్మా' డబ్బింగ్ పూర్తి



లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ నిర్మిస్తున్న 'సిగ్మా' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దర్శకుడిగా జేసన్ సంజయ్ అరంగేట్రం చేస్తున్న ఈ చిత్రంలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. తాజాగా సినిమా డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జూలై 31న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ హెడ్ జి.కె.ఎం. తమిళ్ కుమరన్ మాట్లాడుతూ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. జూలై 31న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు 'సిగ్మా'ను తీసుకురావడానికి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం అన్నారు. దర్శకుడు జేసన్ సంజయ్ మాట్లాడుతూ డబ్బింగ్ పూర్తి కావడం మా ప్రయాణంలో ఎంతో సంతృప్తినిచ్చే మైలురాయి. ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు 'సిగ్మా'ను తీసుకురావడానికి మరో అడుగు దగ్గరయ్యాం. ఇప్పుడు మా పూర్తి దృష్టి పోస్ట్ ప్రొడక్షన్ పనులపైనే ఉంది. అవి శరవేగంగా జరుగుతున్నాయి. జూలై 31న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నామని చెప్పారు. సందీప్ కిషన్ సరసన ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు థాసన్, యోగ్ జాపీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ చిత్రానికి థమన్ ఎస్ సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కె.ఎల్ ఎడిటింగ్, హరిహరసుధన్ విజువల్ ఎఫెక్ట్స్ సూపర్వైజర్‌గా పనిచేస్తున్నారు.




## 'నాగబంధం' చాలా కాస్ట్లీ సినిమా

నిర్మాత సురేష్ బాబు

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ విజువల్ వండర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జ గపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నా రు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ ప్రెస్ మీట్‌లో నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ ఈ సినిమా షూటింగ్ చేస్తున్నప్పుడు పెద్ద సెట్ వేసినప్పుడు అభిషేక్ నాకు ఫోన్ చేసి వచ్చి చూడమని చెప్పేవారు. తను అద్భుతంగా ఈ సినిమాను తీశాడు. అలాగే ఆర్ట్ డైరెక్టర్ అశోక్ కూడా చాలా చక్కని వర్క్ ఇచ్చారు. అశోక్ నాకు 'ఇంద్రుడు చంద్రుడు', 'కలిసుందాం రా' సినిమాలప్పటి నుంచి పరిచ యం. తను ఈ సినిమాకి అద్భుతమైన వర్క్ ఇచ్చాడు. ఇది చాలా కాస్ట్లీగా తీసిన సినిమా. నేను రషెస్ చూశా ను. అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా ఖర్చు చే శారు. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. ఈ సినిమా చాలా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను.ఈ కార్యక్రమంలో హీరో విరాట్ కర్ణ, దర్శకుడు అభిషేక్ నామా, హీరోయిన్ నభా న టేష్, నిర్మాత కిషోర్ ,నిర్మాత నిశిత, ఆర్ట్ డైరెక్టర్ అశోక్ , మ్యూజిక్ డైరెక్టర్స్, అంకిత్, శ్రష్టి వర్మ పాల్గొన్నారు.

## 17న వస్తున్న 'ఓ.. సుకుమారి'



హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఎంటర్టైనర్ 'ఓ. సుకుమారి'తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు.విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్‌లో రూపొందుతన్న చిత్రమిది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్, టీజర్, సాంగ్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. జూలై 17న ఈ సినిమాను రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరో, హీరోయిన్ ఒకరినొకరు తాకబోతున్న క్షణాన్ని మెరుపులతో విజువల్‌గా చూపించిన తీరు సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది. రజాకార్, పోలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరా మ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వరప్రసాద్ ఎడిటర్. స్వయంభు చిత్రానికి పని చేస్తున్న అను రెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు.ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.



ప్రముఖ దర్శకుడు మెహర్ రమేష్ కుమార్తె మోహన వివాహం అనిరుధ్‌తో వైభవంగా జరిగింది. ఈ పెళ్లి వేడుకకు మెగాస్టార్ చిరంజీవి సతీసమేతంగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

## మున్సిపల్ ఎన్నికలకు సిపిఐ సిద్ధం కావాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బూత్ లెవెల్ నుంచే క్రియాశీలంగా పని చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో గురువారం మల్కాజ్‌గిరి మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, ప్రజా సంఘాల నాయకుల సమావేశం జరిగింది. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్లు ఓటర్లతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీని అన్ని స్థాయిల్లో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన నేపథ్యంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియలో ప్రజలతో కలిసి పనిచేయాలని తద్వారా అర్హులైన ఓటర్ల ఓటు హక్కు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నేతలకు సూచించారు. సమావేశంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఈ.ఉమా మహేశ్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు, డిప్యూటీ సెక్రటరీ ఎం.నరసింహ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, దామోదర్‌రెడ్డి, కె.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 'ఆలోచన ఆవిష్కరణ' పుస్తక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యాలయంలో నేటినిజం పత్రిక ప్రచురించిన ఆలోచన ఆవిష్కరణ పుస్తకాన్ని గురువారం తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బైసా వీణాదాస్, బైసా దేవదాస్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, టుడే ఫ్రీడమ్ ఎడిటర్ ఆజం ఖాన్ పాల్గొన్నారు.

## ఘోర ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దులోని మడపట్టణ ప్రాంతంలో తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. రాతి క్రషర్ వద్ద క్వారీ పనుల్లో నిమగ్నమైన కార్మికులపై సుమారు 40 అడుగుల ఎత్తు నుంచి భారీ బండ రాయి విరిగిపడటంతో వారు శిథిలాల కింద చిక్కుకుని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన వారిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందడంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. మరికొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొందరు కార్మికులు శాశ్వతంగా అవయవాలు కోల్పోయే ప్రమాదం ఉందని సహచరులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ బిహార్, ఉత్తర కర్ణాటక ప్రాంతాలకు చెందిన సుమారు 18 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రాళ్లను లోడ్ చేస్తున్న వాహనాలు పూర్తిగా ధ్వంసమవగా, అక్కడ ఉన్న ట్రాక్టర్ ముక్కలైపోవడం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతున్నది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మరెవరైనా శిథిలాల కింద చిక్కుకున్నారా? అనే కోణంలో గాలింపు చేపట్టడంతో పాటు, ప్రమాద ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని శిథిలాలను తొలగించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి డికె శివకుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్వారీల్లో పనిచేసే కార్మికుల ప్రాణ భద్రతను నిర్ధారించడం యజమానుల బాధ్యత అని పేర్కొంటూ, భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన గనుల యాజమాన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అయితే, యశవంత్‌పుర ఎమ్మెల్యే ఎస్‌టి సోమశేఖర్ ఈ ప్రమాదానికి అక్రమ క్వారీ కార్యకలాపాలే కారణమని ఆరోపించారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో అక్రమ తవ్వకాలపై తాను పదే పదే ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని, ఈ అంశాన్ని కర్ణాటక అసెంబ్లీలో కూడా ప్రస్తావించినట్లు చెప్పారు. గతంలో క్వారీల్లో జరిగిన పేలుళ్ల కారణంగా ఓ చిరుత కూడా మృతి చెందిందని గుర్తు చేశారు. ఈ అక్రమ కార్యకలాపాల్లో పోలీసులు, అటవీ శాఖ, గనుల శాఖ అధికారుల ప్రమేయం కూడా ఉందని ఆరోపించిన ఆయన, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన కొంత మంది అధికార, ఆర్థిక బలం గలవారు తప్పించుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిందితులు శిక్ష నుంచి తప్పించుకోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలావుంటే, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, భద్రతా నిబంధనల ఉల్లంఘన లేదా నిర్లక్ష్యం జరిగిందా అనే కోణాల్లో పోలీసులు సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. మృతులలో ఎక్కువ మంది బిహార్‌కు చెందినవారేనని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఘటనతో మృతులు, క్షతగాత్రుల కుటుంబ సభ్యులు, సహచరుల రోదనలతో ఆ ప్రాంతమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి.

## కాగ్ ఆడిట్ (మొదటి పేజీ తరువాయి)

ఈ దేశాన్ని కేవలం హిందూ రాజ్యంగా మాత్రమే చూడాలని నేను విశ్వసించను,' అని పేర్కొన్నారు. అయితే, చరిత్ర అందుకు భిన్నంగా సాగిందని,బాబ్రీ మసీదు కూల్చివేయబడిందని, ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, బిజెపిలు న్యాయం, కరుణ, ధర్మాలకు ప్రతిరూపమైన శ్రీరాముడిని, విభజన అనే రాజకీయ పథకానికి కేంద్రబిందువుగా మార్చేశాయని మండిపడ్డారు. రామ మందిరం ఒక పవిత్ర ప్రదేశంగా కంటే ఓట్లను సమీకరించేందుకు, అధికారాన్ని పటిష్టం చేసుకోవడానికి, సంఘ్ పరివార్ ప్రభావాన్ని విస్తరించుకోవడానికి ఒక సాధనంగా మారిందని సందోష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణంలో అవకతవకలు, కమీషన్ల ఆరోపణల నుండి, ఎన్నికల లబ్ధి కోసం ఇంకా నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని ప్రారంభించడం వరకు, తాము శ్రీరాముని గొప్ప భక్తులమని చెప్పుకునే వారు, ఆయనను విశ్వాసానికి ప్రతీకగా కాకుండా పదేపదే ఒక రాజకీయ ఆస్తిగా చూశారని విమర్శించారు. ఇటీవల శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్‌కు సంబంధించి వెలుగులోకి వస్తున్న కుంభకోణం వారి నటనను బట్టబయలు చేసిందన్నారు. అవకతవకల ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత, ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశారని, క్రిమినల్ కేసులు నమోదు చేశారని, నగదు, విలువైన కానుకల లెక్కింపుతో సంబంధం ఉన్న కనీసం ఎనిమిది మందిని అరెస్టు చేశారని వార్తలు సూచిస్తున్నాయని సందోష్ తెలిపారు. తాము ఆలయంలో సమర్పించిన బంగారు ఆభరణాలు, వెండి ఇటుకలు, ఇతర విలువైన వస్తువులకు సంబంధించి వివరాలను కోరుతూ భక్తులు ముందుకు వస్తున్నారు, అయితే అధికారిక విచారణ వివరాలను ఇప్పటికీ బహిరంగపరచలేదన్నారు. ఈ వివాదం నడుమ ట్రస్ట్‌లో ఉన్నత స్థాయి రాజీనామాలు చోటుచేసుకున్నాయన్నారు. ఈ విషయాలు దేశ అంతరాత్మను కదిలించాయంటే, దానికి కారణం ఇది కేవలం ఆర్థిక అవకతవకల ఆరోపణ మాత్రమే కాదన్నారు. ఇది విశ్వాసంతో కానుకలు సమర్పించిన లక్షలాది భక్తులకు జరిగిన ద్రోహమని విమర్శించారు. రాజకీయ అధికారాన్ని కూడగట్టుకోవడానికి సంఘ్ పరివార్ శ్రీరాముడిని ఆశ్రయించిందని, ఇప్పుడు దురాశతో ఆయన ఆలయాన్ని కళంకితం చేసిందనే ఆరోపణలను ఎదుర్కొంటోందన్నారు. ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, బిజెపిలకు శ్రీరాముడు ఒక విశ్వాస వస్తువుగా కాకుండా, డబ్బు, పలుకుబడి, అధికారాన్ని పోగుచేసుకునే సాధనంగా మారినట్లు అంతకంతకు స్పష్టమవుతోందని ప్రధానికి రాసిన లేఖలో సందోష్‌కుమార్ విమర్శలు చేశారు. రాముడి మీద భక్తి ఉంటే, వాస్తవాం చెప్పాలని, సంఘ్ పరివార్ దురాశ నుండి లక్షలాది మంది విశ్వాసాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

అవకాశముందన్నారు. శుక్రవారం రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉత్తర, మధ్య, దక్షిణ తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయన్నారు. శని, ఆదివారాల్లో ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆదివారం నుంచి గురువారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని తెలిపారు. ఈ నాలుగు రోజుల పాటు కూడా గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాలు, ఉరుములు, బలమైన గాలుల నేపథ్యంలో రైతులు, ప్రయాణికులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా భారీ వర్షాల హెచ్చరిక ఉన్న జిల్లాల ప్రజలు స్థానిక అధికారుల సూచనలను పాటించాలని తెలిపారు.

## రాజస్థాన్‌లోకి ప్రవేశించిన రుతుపవనాలు

**జైపూర్:** రాజస్థాన్‌లోకి నైరుతి రుతుపవనాలు గురువారం ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. సాధారణంగా జూన్ 25 న రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించాల్సి ఉండ గా, ఈసారి ఏడు రోజుల ఆలస్యంగా జులై 2న ప్రవేశించాయని పేర్కొంది. జైపూర్ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం, ప్రస్తుతం రు తుపవనాలు రాష్ట్రంలోని తూర్పు ప్రాంతాల్లోకి ప్ర వేశించాయి. వాటి ఉత్తర సరిహద్దు ప్రస్తుతం టో ంక్, జైపూర్, అల్వార్ జిల్లాల మీదుగా విస్తరించి ఉంది. బుధవారం నాటికి నైరుతి రుతుపవనాలు గుజరాత్‌లోని మరికొన్ని ప్రాంతాలు, ఉత్తరప్రదేశ్‌లో మిగిలిన ప్రాంతాలు, మొత్తం ఢిల్లీ, మధ్యప్రదేశ్‌లో అత్యధిక ప్రాంతాలు, హర్యానా, పంజాబ్‌లోని విస్తృత ప్రాంతాలతో పాటు రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు ఐఎండి తెలిపింది. రాబోయే రెండు నుంచి మూడు రోజుల్లో రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఇక తూర్పు, ఆగ్నేయ రాజస్థాన్ జిల్లాల్లో వచ్చే కొద్ది రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా ఉదయ్‌పూర్, కోటా, అజ్మీర్, భరత్‌పూర్, జైపూర్ డివిజన్లలో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కోటా డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి ప్రత్యేక హెచ్చరిక జారీ చేసింది. వచ్చే వారం రోజుల పాటు జైపూర్, భరత్‌పూర్, కోటా, ఉదయ్‌పూర్, అజ్మీర్ డివిజన్లలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కొనసాగే అవకాశముందని, ఈ కాలంలో రాష్ట్రంలోని తూర్పు, ఆగ్నేయ ప్రాంతాల్లో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## కట్టడిలో వైఫల్యం

(మొదటి పేజీ తరువాయి)

పాకుతుంది. కొన్ని వేలల్లో ఉంటే కొన్ని లక్షల్లో పలు సందర్భాల్లో కోట్లలో డబ్బు చేతులు మారుతుంది. ఓ మేధావి చెప్పినట్లుగా ఈ దేశానికి అసలు జబ్బు అవినీతే. అవినీతిని అంతం చేయగలిగితే పేదరికం దూరమవుతుందన్న మాటలు కోట్లలో అక్రమ ఆస్తులు బయటపడటం చూస్తుంటే నిజమే అనిపిస్తుంది.

**దొరకని అనకొండలు :**

కక్కుర్తి పడి నగదు తీసుకోవడం, ఫోన్ పేలు చేయించడం మధ్య వర్తులు ఎవరైనా ఉంటే వారికి కూడా ఏమైనా వాటాలు ఇవ్వాల్సి వస్తుందని నేరుగా లంచాలు పుచ్చుకోవడం ఇతరత్రా తప్పులతో కొందరు అవినీతి నిరోధక శాఖాధికారులకు దొరుకుతున్నారు. ఇతరులపై నమ్మకం లేక మొత్తం ఆస్తులను తమ పేరే ఉంచుకోవడం ఒక మాటలో చెప్పాలంటే లంచం పుచ్చుకోవాలన్న ఆశతో తప్పించుకునే మార్గం తెలియక దొరికిపోతున్నారు. ఇలా దొరికిపోయే వారి శాతం అతి స్వల్పం. కానీ దొరకని అనకొండలు కోట్లు కూడేసుకుంటున్నారు. దశాబ్ద కాలంగా జరుగుతున్న కోట్లాది రూపాయల ప్రభుత్వ నిర్మాణాలు, అభివృద్ధి పనులకు సంబంధించి నాణ్యతను ప్రశ్నించిన నాథుడు లేడు. కింద నుంచి పైదాకా అధికారులు వాటేలేసుకోవడంతో పాటు సర్పంచ్ నుంచి చట్టసభల ప్రతినిధుల దాకా కమిషన్లు ముట్ట చెబుతున్నారు. కింద నుంచి పైదాకా కమిషన్లు పోను చివరకు జరిగే పని ఎంత, దానిలో ఉండే నాణ్యత ఎంత అనే దానిపై ఇక ఆలోచనే అనవసరం. ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తే అవినీతి అనకొండలు ఇంతగా పెరిగే వారు కాదు. ఇప్పుడు లంచం ఒక హక్కుగా మారుతుంది. దీనితో ఒకరిని చూసి మరొకరు అవినీతి పరులుగా మారడం వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఈ పరిస్థితికి కారణమవుతుంది. ఎవరో ఒకరు ఫిర్యాదు చేస్తేనో లేక స్పష్టమైన సమాచారం ఉంటే తప్ప ఏసిబి దాడులు చేయడం లేదు. నిజంగా వివిధ శాఖల్లో ఉన్న అధికారులపై దాడులు చేస్తే అవినీతి మకెలంటని అధికారుల సంఖ్య ఎంతో తేలిపోతుంది.

**కొందరు దొరికినా దొరలే :**

ఇటీవల కాలంలో ఏసిబి అధికారులు ప్రత్యక్షంగా లంచం తీసుకుంటుండగా దాడులు చేసి జైళ్లకు పంపుతున్నారు. కానీ కొందరు లంచాలు తీసుకుంటూ దొరికినా దొరలుగానే మిగిలిపోతున్నారు. సామాన్యులు, ప్రజాప్రతినిధులు, అవినీతి అధికారులపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. నాలుగేళ్ల కాలంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి మండల స్థాయిలో లేదా డివిజనల్ స్థాయిలో ఓ అవినీతి అధికారి పై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏసిబి తప్ప ఓ అధికారిని ప్రశ్నించిన వారు కానీ చర్యలు తీసుకుని కనీసం బదిలీ అయిన వారు కూడా లేరంటే అతిశయోక్తి కాదు. చాలా మంది అధికారులు వివిధ సందర్భాల్లో పట్టుబడినప్పుడు రాజకీయ జోక్యంతో బయటపడుతున్నారు. ఆ విషయాన్ని వదిలేయండి కాదు కూడదంటే అక్కడి నుంచి మరో స్థానానికి బదిలీ చేయండి అన్న రాజకీయ ఒత్తిళ్ల నడుమ కొందరు దొంగలు కూడా దొరలుగా మారిపోతున్నారు. ప్రభుత్వం క్రమేపి వ్యవస్థలపై పట్టు కోల్పోతుంది. కార్యనిర్వహక వర్గం (అధికార యంత్రాంగం) అవినీతికి అలవాలమైతే ప్రజలకు అన్యాయం జరుగుతుంది. అర్హులను కాదని అనర్హులకు లబ్ధి చేకూరుతుంది. ఈ విషయం పాలకులకు తెలిసినా వివిధ కారణాలతో సమర్థిస్తూ వస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరం. అవినీతిని ఎక్కడో ఒక చోట కట్టడి చేయకుండా సామాన్యులకు న్యాయం చేయడమన్నది జరగని పని అని పాలకులు గుర్తెరగాల్సి ఉంది. లేదంటే అవినీతి తాకని అధికారులను భవిష్యత్తులో చూడలేమేమో.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com